11-6Pg1exHMNWJQE.qxd:11-6Pg1exHMNWJQE.qxd 1/1/02 6:53 AM Page 1


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 131 పేజీలు: 16 వెల: 6.50

## కాంగ్రెస్‌లో టిఎంసి విలీనం?

## కుప్పకూలిన పాక్ సైనిక హెలికాప్టర్: 21 మంది మృతి

5లో



# ప్రజలే నాదేవుళ్లు

## • పన్నెండేళ్లుగా అవినీతిరహితంగా సాగుతున్న పాలన • కాంగ్రెస్ కుంభకోణాల పీడనుంచి దేశానికి విముక్తి • ప్రధానిగా సుదీర్ఘకాలం నాకు దక్కిన అదృష్టం • ఎన్డీయే పార్టీల సమావేశంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశంలో గడచిన పన్నెండేళ్లనుంచి దేశానికి పట్టిన కాంగ్రెస్ పీడ విరగడయిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను ఎన్డీఎ సరిదిద్దుతోందన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపైనెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేలకోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. దేశ ప్రజలకు ఎన్డీయే పాలనపై విశ్వాసం రెట్టింపు అయిందని అన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఎ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఎ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఎలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఎనేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎన్డీఎ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు.

>>2



## చరిత్రలో మోడీది కొత్త అధ్యాయం

### నెహ్రూను దాటిన ఘనత ఆయనకే దక్కింది: రాష్ట్రపతి ముర్ము ప్రశంస

**న్యూఢిల్లీ,జూన్ 10:** ప్రధానిగా మోడీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ చారిత్రాత్మక మైలురాయి సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మోడీ నాయకత్వంపై దేశప్రజలకున్న అచం

>>2



## శక్తిమంతుడైన గొప్ప నాయకుడు మోడీ

### గత పన్నెండేళ్లలో మరింత మెరుగుపడిన ఇండో-యుఎస్ సంబంధాలు: ట్రంప్

**న్యూఢిల్లీ,జూన్ 10:** ఎన్డీయే పాలన 12 యేళ్లు పూర్తిచేసుకోవడంతో పాటు ప్రధానిగా నరేంద్ర మోడీ జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించిన రికార్డుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ స్పందిం చారు. ఏకకాలంగా 12

>>2

## దిగ్గజ దర్శకుడు భారతీరాజా ఇకలేరు



### దీర్ఘ అస్వస్థతతో చెన్నైలో కన్నుమూత

### పద్మశ్రీ సహా ఆరు జాతీయ పురస్కారాలు పొందిన బహుభాషా దర్శకుడు

### తమిళంలో కిళక్కు పోగుంరైల్, ముదల్ మరియాద్రై, తెలుగులో సీతాకోకచిలుక వంటి హిట్ చిత్రాలతో ఖ్యాతి

### ఘనంగా నివాళులర్పించిన తమిళ సిఎం విజయ్, తెలుగు సిఎంలు, పలువురు ప్రముఖులు

**చెన్నై,జూన్ 10:** దక్షిణాది చలనచిత్ర రంగంలో దిగ్గజ దర్శకునిగా వెలుగొందిన భారతీరాజా (85) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ భారతీ రాజా మృతి చెందారు. 1941 జులై 17న జన్మించిన భారతీ రాజా పదహారేళ్ల వయసు, సీతాకోక చిలుక, ఆరాధన సినిమాలకు జాతీయ అవార్డులు అందుకున్నారు. భారతీరాజా 1974లో చంద్రలీలను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కొడుకు మనోజ్ తాజ్ మహల్ చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. 2025 మార్చి 25న గుండెపోటుతో మనోజ్ మరణించారు. భారతీరాజా అసలు పేరు చిన్నస్వామి. ఆయన 1941 జూలై 17న తమిళనాడులోని తేని అల్లినగరంలో జన్మించారు. బాల్యం నుంచీ భారతీరాజా కళల పట్ల ఆకర్షితుడై

>>2

# అమరావతికి వరాల జల్లు



సెంట్రల్ సెక్రటేరియట్ నమూనా

### రూ.1299.08 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం

### రూ.1234.91 కోట్లతో కేంద్ర ఉద్యోగుల క్వార్టర్లు

### 11టవర్లలో 1504 నివాస గృహాలు, కేంద్ర కేబినెట్ ఆమోదం

### ఇప్పటికే 22.53 ఎకరాలు కేటాయించిన సిఆర్‌డిఎ

**విజయవాడ, జూన్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనుల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి సంబంధించి సిపిడబ్ల్యూడి ప్రతిపాదనలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ)ఆమోదం తెలిపింది. దీంతో అమరా వతిలో రూ.2,534కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కోసం రూ.1,299.08 కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలకు రూ.1,234.91కోట్లు వెచ్చించనుంది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. అమరావతి కేంద్రంగా పని చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మల్టీస్టోరేజ్ నివాసాలు ఏర్పాటు చేయనున్నారు. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం కోసం ఇప్పటికే సిఆర్‌డిఎ 22.53 ఎకరాలు కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సెక్రటే రియట్, 17 ఎకరాల్లో నివాస సముదాయం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెటరీ మద్దతు ద్వారా భరించనుంది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సిపిడబ్ల్యూడి) చేపట్టనుంది. ఇప్పటికే ప్రిబిడ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, టెండర్ పత్రాల రూపకల్పన ప్రక్రియ పురోగతిలో ఉందని ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాజధాని అమరావతిలో కేంద్రం చేపడుతున్న మొట్టమొదటి జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జిపిఆర్‌ఎ)ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం. మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో ఈ జిపిఆర్‌ఎ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 11నివాస టవర్లను ఏర్పాటు చేసి, టైప్2 నుంచి టైప్ 6 వరకు వివిధ కేటగిరీలలో మొత్తం 1,504ఫ్లాట్లను నిర్మిస్తారు. ప్రాజెక్టులో భాగంగా 1,972కార్లు పార్క్ చేసుకునేలా బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు. ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణ విస్తీర్ణం 31.30లక్షల చదరపు అడుగులుగా ఉంది. అమరావతిలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి తగిన నివాస సౌకర్యం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. కార్యాలయాలకు సమీపంలోనే నివాసం ఉండటం వల్ల ఉద్యోగుల నైతిక స్థైర్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇది ప్రభుత్వ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందని ప్రకటనలో వివరించారు.

ఈ ప్రాజెక్టును పూర్తిగా పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. కనీసం 4స్టార్ గ్రీహా (జిఆర్‌ఐహెచ్‌ఏ) రేటింగ్ సాధిం చేలా, ఇంధన సామర్థ్యం, నీటి సంరక్షణ, స్థానిక నిర్మాణ సామగ్రి వాడకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. క్యాంపస్‌లో బ్యాంకు, ఎటిఎం,పోస్టాఫీసు, కమ్యూనిటీ హాల్, ఫుడ్‌కోర్ట్, షాపింగ్ కాంప్లెక్స్, గెస్ట్‌హౌస్ వంటి అన్నిరకాల పౌర,సామాజిక సదుపాయాలు

>>2



## ఉపాధి హామీ కింద రూ.7,700 కోట్లు

### ఎపి ప్రాజెక్టులపై ప్రధానికి సానుకూల దృక్పథం: కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**విజయవాడ,జూన్ 10. ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రమంత్రి పెమ్మసాని అమరావతికి వచ్చే ప్రాజెక్టులపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అమరావతి ప్రాజెక్టులపై ప్రధానికి సానుకూల దృక్పథం ఉందని చెప్పారు. అమరావతికి వచ్చే ఈ ప్రాజె క్టులను శుభశకునంగా భావిస్తు

>>2

# విద్యుత్ స్టేషన్లు వడివడిగా పూర్తి



### లోవోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్‌స్టేషన్లు అవసరం

### అత్యవసర సేవలకు భూగర్భ కేబుల్ వ్యవస్థ: మంత్రి గొట్టిపాటి

**విజయవాడ,జూన్ 10, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచించారు. అలానే అత్యవసర సేవల విభాగాలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు భూగర్భ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సచివాలయంలో బుధవారం ఇంధన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ అంతరాయాల వల్ల రోగులు ఇబ్బందులు పడకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలోని సుమారు 30 ప్రధాన ఆస్పత్రుల్లో జనరేటర్ల పనితీరును సమీక్షించి, కరెంట్ నిలిచిపోయిన సమయంలో స్విచ్ ఓవర్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ చేపడుతున్న అన్ని అభివృద్ధి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో విద్యుత్ అంతరాయాల వల్ల భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరణ చేయడానికి సంబంధించిన అవకాశాలను పరిశీలించాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో ఎదురైన విద్యుత్ సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి, సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి సారించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, ప్రజలపై అదనపు భారం మోపకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, డైరెక్టర్లు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## అభివృద్ధిలో ముందడుగు

### ఎస్సీ విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట: మంత్రి బాలవీరాంజనేయస్వామి

**సచివాలయం,జూన్ 10,ప్రభాతవార్త:** అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించడానికి విద్యనే ప్రధాన ఆయుధంగా భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తుందని సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డి.బి.వి. స్వామి తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా పబ్లిసిటీ సెల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 5.4లక్షల మంది ఎస్సీ విద్యార్థులకు రూ.1,543.17కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ అందించామని తెలిపారు.ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 2.51 లక్షల మంది విద్యార్థులకు రూ. 326.74 కోట్లు చెల్లించామని చెప్పారు. డీఎస్సీ కోచింగ్ కోసం రూ.4.78కోట్లు ఖర్చు

>>2



బుధవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్

## పోలీసులపై 'గంజాయి' దాడి

### ఆత్మరక్షణలో ఎస్ఐ గాలిలోకి కాల్పులు

### నలుగురు స్మగ్లర్లు అరెస్టు, పరారీలో నలుగురు

**పాడేరు, జూన్10,ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లర్లు తప్పించుకునీ పారిపోయే ప్రయత్నంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులపై రాద్లాడికి దిగటంతో పోలీసులు ఆత్మ రక్షణ కోసం గాల్లో కాల్పులు జరిపి..పారిపోతున్న నలుగు గంజాయి స్మగ్లర్లను చాకచక్యంగా పోలీసులు సంఘటన ప్రదేశంలో అదుపులోకి తీసుకిగా మరో నలుగురు తప్పించుకుని పారిపోయారని ఈ ఘటనలో ఒక కారును రెండు ద్విచక్ర వాహనాలతో పాటు రూ/1 కోటి నాలుగు లక్షల,52 వేల రూపాయలు విలువ గల 209 కేజీలు గంజాయి నీ పోలీసులుస్వాధీనం చేసుకున్నారు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్ వెల్లడించారు. బుధవారం పాడేరు జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఎస్పి అమిత్ బర్ధర్‌వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాచింతపల్లి మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రామారావు పాలెం జంక్షన్మేడూరు గ్రామ సమీపంలో అన్నవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్,సిబ్బందితో బుదవారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో లోతుగెడ్డ గ్రామం వైపు వెళ్తున్న ఒక కారులో ఇద్దరు వ్యక్తులు, రెండుద్విచక్ర వాహనాలపై మరో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిం చారు. దీంతో పోలీసులు వాహనాలను ఆపమని సంకేతాలు ఇవ్వగా అందులోని వ్యక్తులు పోలీసులను తప్పించుకునేందుకు ప్రయత్నించి, వాహనాలను అధిక వేగంతో పోలీసు సిబ్బంది వైపు ముందుకు దూసుకువచ్చారు.దీంతో పోలీసులు అడ్డగించడంతో వాహనాలను నిలిపివేసి అక్కడి నుంచి పరారయ్యేందుకు గంజాయి స్మగ్లర్లు యత్నించారు. అంతేకాకుండా వారు తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులపై రాళ్ళ దాడికి తెగబడ్డారని ఐతే పోలీసులు పలుమార్లు హెచ్చరించి రాళ్ళ దాడిని

>>2

# రేపు తిరుపతిలో ఎన్డీయే భారీ సభ

### హాజరు కానున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, బిజెపి చీఫ్ మాధవ్, కేంద్రమంత్రులు



బుధవారం ఎన్డీయే సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

**తిరుపతి,జూన్ 10 ప్రభాతవార్తప్రతినిధి:** టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలుతీరు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించామని విస్తృతంగా ప్రచారం చేసుకోవడానికి తిరుపతిలో శుక్రవారం ఎన్‌డిఎ పార్టీల నేతలు బహిరంగసభ జరగనుంది. తిరుపతి రూరల్ తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారి పక్కన ఈ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. 9వతేదీ ఈ సభ వాయిదా పడిన విషయం విదితమే. తిరిగి శుక్రవారం ఉదయం జరగనుండటంతో బుధవారంరాత్రి వరకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల

>>2

# మరో కొత్త ఎయిర్ పోర్టు!

### నెల్లూరు జిల్లా దగదర్తిలో ఏర్పాట్లకు రెడీ

### పది రోజుల్లో టెండరు ప్రక్రియ పూర్తి

**విజయవాడ,జూన్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదు పాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ప్రజా రవాణాతో పాటు స్థానిక వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు రవాణా వ్యవస్థే కీలకం. ఈ నేపథ్యంలోనే, నెల్లూరు జిల్లా వాసుల దశాబ్దాల నాటి కల అయిన దగదర్తి విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మరో పది రోజుల్లోనే టెండర్ల ప్రక్రియను ముగించి, కాంట్రాక్టు సంస్థకు పనులను అప్పగించేందుకు సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ప్రజా రవాణాతో పాటు స్థానిక వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు రవాణా వ్యవస్థే కీలకం. ఈ నేపథ్యంలోనే,

>>2

11-6pg2exHMNWJQE.qxd:11-6pg2exHMNWJQE.qxd 1/1/02 6:51 AM Page 1



# నేషన్ ఫస్ట్.. అదే మోడీ అజెండా

## ప్రపంచంలో భారత్‌ను ప్రాధాన్య దేశంగా నిలిపిన ఘనత ప్రధాని మోడీదే: సీఎం చంద్రబాబు



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి వెంకటేశ్వరుని ప్రతిమను అందిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్10,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశంగా భారత్‌ను నిలిపిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీ దన్నారు.వర్తమాన,భవిష్యత్తు తరాలకు ప్రయోజనం కలిగించే దిశలో ఆయన 12 పరిపాలన సాగిందని చంద్రబాబు వాఖ్యానించారు.ఢిల్లీలో ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కలిసి అభినందించారు. రికార్డు స్థాయిలో ప్రధానిగా 12 ఏళ్ల ప్రస్థానాన్ని సాగించిన నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం .ఢిల్లీలో ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలనను,రాష్ట్రాలకు అందిస్తున్న సహకారాన్ని అభినందిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో అత్యంత సుదీర్ఘ కాలం పాటు ప్రధానిగా సేవలం దించడంపై చంద్రబాబు ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతా తీర్మానాన్ని గౌరవ సభలో ప్రవేశపెట్టడం తాను గౌరవంగా భావిస్తున్నాని సీఎం చంద్రబాబు ప్రకటించారు. సరైన సమయంలో, సరైన స్థానంలో, సరైన నాయకుడిగా దేశానికి ప్రధానిగా మోదీ ఉన్నారు.ఒకవైపు దేశానికి స్థిరత్వాన్ని ఇచ్చే మార్గదర్శిగా, మరోవైపు కొత్త ఆలోచనలకు, నవ కల్పనలకు ప్రేరణనిచ్చే నాయకుడిగా పనిచేయడం మోదీ గొప్పతనం. 2001లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన నాటి నుంచి నేటి ప్రధాని పదవి వరకు 25 ఏళ్లుగా మోదీ ప్రజా జీవితంలో విశేషంగా సేవలు అందించారు. ప్రజల అంచనాలకు తగ్గట్టుగా నిలబడటం మోదీ నాయకత్వానికి ఉన్న ప్రత్యేకత. నేషన్ ఫస్ట్ అనే నినాదంతో మోదీ పరిపాలన సాగించిన విధానాన్ని సీఎం ఆవిష్కరించారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంలో మోదీ సఫలీకృతుడయ్యారని ప్రశంసించారు. తన 5 దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎందరో ప్రధానమంత్రులను చూశానని, కానీ మోదీ దేశ ప్రాచీన సాంస్కృతిక వైభవాన్ని ఆధునిక పాలనతో అనుసంధానించిన తీరు అద్భుతమని ప్రశంసించారు.వికసిత్ భారత్

**2047లక్ష్యం దిశగా:** ప్రస్తుత భౌగోళిక రాజకీయాలు, ఆర్థిక ఒప్పం దాలు వంటి విషయాల్లో భారత్‌కు అనుకూలంగా ప్రపంచ దేశాలు తీసుకుంటున్న నిర్ణయాల్లో మోదీ పాత్ర కీలకమని వ్యాఖ్యానించారు. యోగాకు అంతర్జాతీయ గుర్తింపు సాధించి పెట్టడంలో మోదీ కృషిని సీఎం వివరించారు. ప్రపంచంలో భారతదేశాన్ని తిరుగులేని ఆర్థికశక్తిగా నిలిపేందుకు మోదీ వేస్తున్న వ్యూహాత్మక అడుగుల గురించి ప్రస్తావించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ అద్భుతశక్తిగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 12 ఏళ్ల పాలనలో మోదీ తెచ్చిన డిజిటల్ విప్లవం గురించి విశ్లేషించారు. మోదీ నేతృత్వంలో దేశం వికసిత్ భారత్2047 లక్ష్యాలను చేరు కుంటుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజలే నా దేవుళ్లు

>> తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు. తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోడీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. ఇంటర్నెట్ యూజర్ల సంఖ్యను 25 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచామని అన్నారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని ఆచరణలో చేసి చూపించామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.

సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోయిస్టులను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని, ఆర్టికల్ నంబర్ 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

# గొప్ప నాయకుడు మోడీ

>> యేళ్లు పూర్తిచేసుకున్న ప్రధానిమోడీని ట్రంప్ అభినందిస్తూ "మిత్రునికి శుభాభినందనలు. భారత్‌కు సుదీర్ఘకాలం పనిచేసిన చేస్తున్న ప్రధానమంత్రి నామిత్రుడు మోడీ" ఆయన ఒక గొప్ప నాయకుడు అని శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానిమోడీ శక్తివంతమైన గొప్ప నాయకుడని, అంతేకాకుండా ఆలోచనాశక్తి ఉన్న ప్రముఖ మేధావి అని కొనియాడారు. అమెరికా భారత్‌లమధ్య ఉన్న సంబంధాలు ఈ 12 యేళ్లకాలంలో మరింత పురోగమించాయని ఆయన ఈసందర్భంగా ప్రస్తావించారు. ఆయన మరింత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగి మరింత అభివృద్ధిలోకి తీసుకురావాలని ట్రంప్ ఆకాంక్షించారు.



బుధవారం చెన్నైలో భారతీరాజా భౌతికకాయం వద్ద నివాళులర్పించి విలపిస్తున్న తమిళ సీఎం విజయ్

# దిగ్గజ దర్శకుడు భారతీరాజా ఇకలేరు

>> సినిమా రంగంలో తన ఉనికిని చాటుకోవాలని తపించేవారు. దాంతో మదరాసుకు చేరి చిత్రసీమలో చేరేందుకు పలు పాట్లు పడ్డారు. తొలుత కన్నడ దర్శకుడు పుట్టన్న కణగల్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. తరువాత తెలుగు దర్శకులు పి.పుల్లయ్య వద్ద కొన్ని చిత్రాలకు పనిచేశారు. మళయాళ దర్శకుడు ఎమ్.కృష్ణన్ నాయర్ దగ్గర, తమిళ దర్శకుడు ఎ.జగన్నాథన్ చిత్రాలకూ అసోసియేట్ గా, కోడైరెక్టర్‌గా ఉన్నారు భారతీరాజా. నాలుగు భాషల దర్శకుల వద్ద పనిచేయడంతో భారతీరాజాకు దర్శకత్వంపై మంచి పట్టు లభించింది. తన ఊరికి సమీపంలోని వారే అయిన ఇళయరాజా, వారి సోదరులను కూడా చిత్రసీమలో అడుగు పెట్టేలా చేయడానికి భారతీరాజా ఎంతగానో సహకరించారు. ఇక భారతీరాజా తాను తీసే చిత్రం రెగ్యులర్ మూవీస్‌కు భిన్నంగా ఉండాలని ఎప్పుడూ తపించేవారు. ఆ తపనతోనే 1977లో విడుదలైన 16 వయతినిలే'చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి సంచలనం సృష్టించారు. ఆ చిత్రం సాధించిన ఘనవిజయంతో భారతీరాజా వైవిధ్యం కోసం సినీజనం పరుగులు తీశారు. భారతీరాజా రెండో చిత్రం కిళక్కే పోగుం రైల్ ఈ చిత్రం ద్వారా రాధికను నాయికగా పరిచయం చేశారు. ఇందులో మన తెలుగు నటుడు సుధాకర్ హీరోగా నటించారు. ఈ సినిమా మరింత విజయం సాధించింది. సుధాకర్‌కు తమిళనాట స్టార్ హీరోగా మారడానికి కారణమయింది. మూడో చిత్రం సిగప్పు రోజాక్కల్. ఇది సంచలన విజయం సాధించింది. కమల్, శ్రీదేవి నటించిన ఈ చిత్రం తెలుగులో ఎర్ర గులాబీలుగా అనువాదమై, ఇక్కడా విజయం సాధించింది. నాల్గవ చిత్రంగా 16 వయదినిలేను హిందీలో సోల్వా సావన్‌గా తెరకెక్కించారు భారతీరాజా. ఈ సినిమాతోనే శ్రీదేవి హిందీ చిత్రసీమలో అడుగుపెట్టింది. తెలుగులో భారతీరాజా రూపొందించిన సీతాకోక చిలుక చిత్రం ఎంత ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమా ద్వారా ముచ్చెర్ల అరుణ నాయికగా పరిచయమయింది. తెలుగులో కార్తిక్‌కు ఇదే తొలిచిత్రం. ఇక భారతీరాజా రూపొందించిన సస్పెన్స్ థ్రిల్లర్ టిక్ టిక్ టిక్ కూడా అప్పటి యువతరాన్ని ఆకట్టుకుంది. తెలుగులో యువతరం పిలిచింది, ఈతరం ఇల్లాలువంటి చిత్రాలు రూపొందించారు. అవి అంతగా ఆకట్టుకోలేక పోయాయి. కృష్ణతో జమదగ్ని, చిరంజీవితో ఆరాధన రూపొందించారు భారతీరాజా. ఆరు జాతీయ పురస్కారాలు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డులు, పలు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నా రాజాను భారతీయ సినీ రంగానికిచేసిన సేవలకు గుర్తింపుగా 2004లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. నాలుగు దశాబ్దాలకు పైగా తమిళ సినీ పరిశ్రమలో తన ప్రత్యేక శైలితో ప్రేక్షకులను అలరించిన భారతీరాజా భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే దర్శకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు.

**ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు...**

భారతీరాజా అంత్యక్రియలు పూర్తిప్రభుత్వ లాంఛనాలతో జరుగుతాయనిసీఎం విజయ్‌ప్రకటించారు. తమిళ చలనచిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇదిలా ఉండగా భారతీ రాజా నివాసానికి చిత్రరంగ ప్రముఖులు, రాజకీయ నాయకులు తరలివచ్చారు. సిఎం విజయ్ భారతీరాజా నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయంవద్ద నివాళులర్పించారు. మాజీ సిఎం స్టాలిన్, ఉదయనిధి మారన్, కమల్‌హసన్,సూర్య వంటి దిగ్గజనటులు, దర్శకులు భారతీ రాజా నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఆయన దర్శకత్వంలో నటించిన హీరోహీరోయిన్లు, నేటితరం నాయికలు పలువురు భారతీరాజాకు ఘనంగా నివాళులర్పించారు.

# చరిత్రలో మోడీది కొత్త అధ్యాయం

చలమైన నమ్మకానికి ఈ సుదీర్ఘ పాలనే నిదర్శనమని రాష్ట్రపతి కొనియాడారు. ఆయన హయాంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా దూసుకుపోతోందని, అట్టడుగు స్థాయి ప్రజలకు సైతం సంక్షేమ ఫలాలు అందు తున్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా ఆదివాసీల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎంజన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ వంటి పథకాలకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని మోదీ దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారని, ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారత ప్రజాస్వామ్యంపై నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు. భారత రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని ప్రధానిమోడీ లిఖించారు. దేశ ప్రధానిగా నరేంద్ర దామోదరదాస్ మోడీవరుసగా అత్యధిక కాలం పాలించిన అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించి మోడీ ఈ ఘనత సాధించారు. 2014మే 26న తొలిసారి బాధ్యతలు చేపట్టిన మోదీ, నేటితో (బుధవారం) ప్రధానిగా వరుసగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. గతంలో నెహ్రూ ఎన్నికైన ప్రధానిగా వరుసగా 4,398 రోజులు (1952 మే 13 నుండి 1964 మే 27 వరకు) పనిచేయగా ఇప్పుడు మోడీఆ రికార్డును దాటేశారు. ఈ జాబితాలో ఇందిరాగాంధీ (4,077 రోజులు) మూడో స్థానంలో ఉన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో ఎన్డీయే సమావేశం సందర్భంగా అల్పాహారం స్వీకరిస్తున్న ప్రధాని మోడీ, తదితరులు

# అభివృద్ధిలో ముందడుగు

>>చేసి 2,000మందికి శిక్షణ ఇవ్వగా,వారిలో 331మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని వెల్లడించారు.ఆర్ఆర్‌బి,ఎస్ఎస్‌సీ కోచింగ్ ద్వారా మరో 32మంది ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు.సివిల్స్,గ్రూప్-1 వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలు చేపట్టామని,340మందికి ఆరు నెలల రెసిడెన్షియల్ కోచింగ్,50మందికి ఆన్‌లైన్ శిక్షణ అందించామని చెప్పారు.నర్సింగ్ పూర్తి చేసిన 200మంది విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాల కోసం జర్మన్ భాష శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,002హాస్టళ్ళలో 1.75లక్షల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని,వీరి కోసం రూ.916కోట్లు ఖర్చు చేశామని మంత్రి తెలిపారు.టెన్త్‌లో 85.32 శాతం, ఇంటర్మీడియట్‌లో 72.3శాతం ఉత్తీర్ణత సాధించడం హాస్టళ్ళలో అందిస్తున్న నాణ్యమైన విద్యకు నిదర్శనమన్నారు.

# మరో కొత్త ఎయిర్ పోర్టు!

>> నెల్లూరు జిల్లా వాసుల దశాబ్దాల నాటి కల అయిన దగదర్తి విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మరో పది రోజుల్లోనే టెండర్ల ప్రక్రియను ముగించి, కాంట్రాక్టు సంస్థకు పనులను అప్పగించేందుకు సిద్ధమైంది. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని దగదర్తి వద్ద ఈ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు 1400 ఎకరాల భూమిని కేటాయించింది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ విధానంలో రూ. 648 కోట్ల అంచనా వ్యయంతో దీనిని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల షెడ్యూల్ ఖరారు అయ్యింది. టెండర్ల దాఖలుకు చివరి తేదీ జూన్ 12గా నిర్ణయించారు. టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్లను జూన్ 17న ఓపెన్ చేయనున్నారు. పనుల కేటాయింపు ప్రక్రియ బిడ్డింగ్‌లో అర్హత సాధించిన సంస్థకు 15 రోజుల్లోగా నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తారు. దగదర్తి ఎయిర్‌పోర్ట్‌కు కేంద్ర హోంశాఖ, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖల నుంచి ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయి. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే పనులు ప్రారంభించి, 202829 ఆర్థిక సంవత్సరం నాటికి మొదటి దశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ తొలి దశలోనే రన్‌వే, ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, కార్ పార్కింగ్, షాపింగ్ ఏరియా వంటి మౌలిక వసతులను సిద్ధం చేస్తారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే కేవలం నెల్లూరు జిల్లాకే కాకుండా, పొరుగున ఉన్న ప్రకాశం, కడప జిల్లాల ప్రయాణికులకు సైతం ఎంతో అనుకూలంగా మారనుంది. రోజుకు దాదాపు 2,200 మంది ప్రయాణికులు సేవలు పొందేలా దీనిని డిజైన్ చేస్తున్నారు. నిత్యం 27 విమానాలు రాకపోకలు సాగించేలా అత్యాధునిక వసతులతో ఈ ఎయిర్‌పోర్ట్‌ను తీర్చిదిద్దనున్నారు. దగదర్తి విమానాశ్రయం సాకారమైతే దక్షిణ ఆంధ్రాలో పారిశ్రామిక ప్రగతి, ఉపాధి అవకాశాలు సరికొత్త పుంతలు తొక్కడం ఖాయం. నెల్లూరు ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు త్వరలోనే తెరపడనుంది.

# పోలీసులపై 'గంజాయి' దాడి

>> నిలిపివేసి లొంగిపోవాలని సూచించినప్పటికీ స్మగ్లర్లు తమ హింసాత్మక చర్యలను రాళ్ళ దాడిని కొనసాగించదంతో పోలీసులు ఆత్మ రక్షణ నిమిత్తం గాలిలోకి కాల్పులు జరుపుతూ స్మగ్లర్లకు హెచ్చరించడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకుని నిందితులను పట్టుకునే ఉద్దేశ్యంతో ఎస్సై గాల్లో హెచ్చరిక చేస్తూ కాల్పులు జరిపారనీ ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. సంఘటనా ప్రదేశంలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు అక్కడ నుంచి ప్రారయ్యారని ఎస్పీ తెలిపారు.రాళ్ల దాడిలో ప్రభుత్వ వాహనం కూడా నష్టం వాటిల్లిందన్నారు.గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన నలుగురు స్మగ్లర్లకు అరెస్టే చేశామని అరెస్ట్ చేసిన వారిలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అర్జున్ కుమార్,విశాఖపట్నం జిల్లా కు చెందిన ఇమ్రాన్ ఖాన్, ఒడిశా రాష్ట్రంమల్కన్గిరి జిల్లా చెందిన కిషాణ ఖారా,చింతపల్లి మండలం బలపం గ్రామానికి చెందిన పాంగి శ్రీను అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న:నలుగురు నిందితులను గుర్తించగా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుయ్నని ఎస్పీ తెలిపారు.పదిబండిల్స్ తో ఉన్న 209.04 కిలోల గంజాయి ఆస్తి విలువ కోటి నాలుగు లక్షల,52 వేల రూపాయలని ఎస్పీ తెలిపారు.అలాగే ఒక కారు,రెండు పల్సర్ బైకులు,స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. నలుగురు స్మగ్లర్లను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ,సిబ్బందిని అభిందిస్తూ త్వరలో రివార్డులు అందజేయనున్నారు ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు.జిల్లాలో గంజాయి జీరో సాగులో ఉందని అయితే గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టడంతో అంతర్ రాష్ట్రాల్లో స్మగ్లర్ల ముఠా వివరాలు బయట పడుతున్నాయని వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించ నున్నట్టు ఎస్పీ స్పష్టం చేసారు.ఈ సమావేశంలో చింతూరు ఎ ఎస్ పంకజ్ కుమార్ మీనా పాల్గొన్నారు.



కేంద్రప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయం నమూనా

# అమరావతికి వరాల జల్లు

>> ఉంటాయి. అలాగే, దివ్యాంగుల కోసం ప్రత్యే కంగా అవరోధ రహిత వాతావరణాన్ని కల్పిం చనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తా యని అంచనా. నిర్మాణ దశలో ఏటా సుమారు 7 లక్షల పనిదినాలు, ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్వహణ దశలో ఏటా 50,000 పనిదినాల ఉపాధి కలుగుతుందని కేంద్రం తెలిపింది.

# ఉపాధి హామీ కింద రూ.7,700 కోట్లు

>>స్తున్నామన్నారు. ఏపీకి ఉపాధిహామీ నిధుల కింద రూ.7,700 కోట్లు ఇచ్చారని తెలిపారు. దేశం లోనే ఎక్కువ నిధులు దక్కించుకున్న 3 రాష్ట్రంగా ఏపీ నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. తక్కువ జనాభా ఉన్నా కొన్ని కారణాల వల్ల ఎక్కువ నిధులు దక్కాయని ఆయన అన్నారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ భవనాల పూర్తికి మూడేళ్లు పట్టవచ్చన్నారు. భూమి ఒక్కటే రాష్ట్రం ఇచ్చిందని, భవనాల ఖర్చు పూర్తిగా కేంద్రానిదేనని పెమ్మసాని పేర్కొన్నారు.టైర్2, టైర్3 కింద వివిధ రకాల భవనాలను కేంద్రం నిర్మిస్తుందని, అమరావతి బిల్లు, సెంట్రల్ సెక్రటేరియట్, ఔటర్ రింగ్‌రోడ్ కీలకమని వెల్లడించారు. సీఎం చంద్రబాబుతో కలిసి ఈ 3 కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కట్టే కాంప్లెక్సులు అధునాతన భవనాలు ఇవన్నీ రాత్రికి రాత్రి రాలేదని, ఎంతో కష్టపడితేనే వచ్చాయని పెమ్మసాని తెలియజేశారు.రెండు భారీ టవర్లలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారని వివరించారు. అలాగే 1,800 కార్ల పార్కింగ్ సదుపాయంతో ఈ ఆధునిక కార్యాలయ సముదాయం నిర్మితమవుతుందని చెప్పారు. రూ.1,234 కోట్లతో 17 ఎకరాల్లో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తారని తెలిపారు. 11 టవర్లలో 1,568 నివాస క్వార్టర్లు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, కమ్యూనిటీ హాల్స్, ఆధునిక సదుపాయాలతో గేటెడ్ కమ్యూనిటీ ఏర్పాటు అవుతుందని కేంద్ర మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. 2018లో ఈ ప్రతిపాదన చేస్తే 2024 తర్వాత ఇది వేగంగా ముందుకు సాగుతుందని చెప్పారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, ఆర్థిక శాఖల సహకారంతో ఈ ప్రాజెక్ట్‌కు ఆమోద ముద్ర పడిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

# రేపు తిరుపతిలో ఎన్డీయే భారీ సభ

>> సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు ఇతర జిల్లా యంత్రాంగం స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించి పూర్తిచేశారు. సుమారు 30వేలమందికిపైగా పాల్గొనే ఈ సభలో జనానికి సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, బిజెపి చీఫ్ మాధవ్, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సవిత పాల్గొంటున్నారు. పూర్తిఏర్పాట్లులో అధికారులు తలమునకలయ్యారు. ప్రముఖుల పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగు నీరు, పారిశుద్ధం, విద్యుత్, వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు, భద్రతా చర్యలు మరియు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని అన్నారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండేళ్ళ ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం నేపథ్యంలో సభా స్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ,జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలోని వేదిక, ప్రజల కూర్చునే ప్రాంతాలు, వాహనాల పార్కింగ్, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర సేవల ఏర్పాట్లను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా పరంగా ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షి స్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# భారతీరాజా మరణం బాధాకరం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 10, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రఖ్యాత సినీ దర్శకుడు భారతీరాజా మరణం బాధాకరమని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలకు చిరస్మరణీయ చిత్రాలను ఆయన అందించారని, భారతీయ సినీ రంగానికి ఆయన మరణం తీరని లోటని అన్నారు. భారతీరాజా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని, భారతీరాజా కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సీఎం అన్నారు.

**డి.సిఎం పవన్ సంతాపం**

ప్రముఖ దర్శకులు భారతీరాజా మృతిపట్ల పవన్ కల్యాణ్‌సంతాపం ప్రకటించారు. ఆయన మృతిపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీరాజా తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన సీతాకోకచిలుక ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పవన్ తెలిపారు.

**సిపిఎం సంతాపం:** భారతీరాజా మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ ఘన నివాళులర్పించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళ, తెలుగు భాషల్లో జనాదరణ పొందిన అనేక అభ్యుదయ, సందేశాత్మక చిత్రాలను భారతీరాజా అందించారని కొనియాడారు. వెండి తెరకు ఎంతో మంది నూతన నటీనటులను పరిచయం చేసిన ఆయన కృషి మరువలేనిదని, భారతీరాజా మరణం కళారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంతాపం**

ప్రముఖ దర్శకుడు, నటుడు, నిర్మాత భారతీరాజా మృతిపట్ల తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంతాపం వ్యక్తం చేసింది. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సురేశ్‌బాబు, కార్యదర్శి అశోక్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.దక్షిణాదిచిత్రాలకు జాతీయ స్థాయి తెచ్చిన ఘనత భారతీరాజాదని వ్యాఖ్యానించింది.

# నేడు కాంగ్రెస్ అత్యవసర సమావేశం

## పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పిసిసి అధ్యక్షులకు ఆహ్వానం

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు వీలుగా గురువారం కాంగ్రెస్ పార్టీ అత్యవసరం సమావేశం ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్ 'ఎక్స్' వేదికగా తెలిపారు. "ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు రేపు, జూన్ 11, 2026న న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసిసి జనరల్ సెక్రటరీలు, ఇన్‌చార్జ్‌లు, పిసిసి అధ్యక్షుల అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కీలక సమావేశానికి ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత వహిస్తారు" అని తెలిపారు. జూన్ 8న జరిగిన ఇండియా బ్లాక్ సమావేశం జరిగిన కొద్ది రోజులకే కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించాలనే నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

## వారం - వర్జ్యం

11-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
ఏకాదశి రా.10.31
రేవతి ఉ.8.14
వర్జ్యం : రా.2.45 - తె.4.14
దు.ఉ.9.56-ఉ.10.48. 2)మ.3.11-సా.4.03
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. అనుకొని అవకాశాలు లభిస్తాయి.వివాదాలకు దూరంగా ఉండండి.

**మిథునం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కర్కాటకం:** సంతాన విద్యావిషయంలో జాగ్రత్తలు అవసరం. మంచితనంతో అందరినీ ఆకట్టుకుంటారు.వాహనసౌఖ్యం.

**సింహం:** ఆర్థిక పరిస్థితి కొద్దిపాటి ఒడిదుడుకులుగా ఉంటుంది. కుటుంబసభ్యుల సహాయం అందుకుంటారు.వస్త్రలాభం.

**కన్య :** వ్యాపారాలు పురోభివృద్ధిలో ఉంటాయి. పరిశ్రమలలో ఏర్పడిన అవరోధాలు తొలగుతాయి.

**తుల :** ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది. వస్త్రలాభం.

**వృశ్చికం:** కొన్ని పనులు అప్రయత్నంగా పూర్తి కాగలవు. వివాహయత్నాలు సాగిస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఖర్చులు అదుపు చేసుకోవడానికి ఎంత గానో కృషి చేస్తారు.శుభవార్తలు.

**మకరం:** కోపతాపాలకు దూరంగా ఉండండి. చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు.బంధువుల కలయిక.

**కుంభం:** వృత్తి ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఎదురు చూడని అవకాశాలు లాభిస్తాయి.

**మీనం:** ముఖ్య సమాచారం అందుకుంటారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

11-6Pg3exHMNWJQEOCB.qxd:11-6Pg3exHMNWJQEOCB.qxd 1/1/02 6:25 AM Page 1



## తిరుమల సమాచారం



### గరుడునిపై వేణుగోపాలుడు

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటినగరం రుక్మిణి- సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో బుధవారం రాత్రి స్వామి గరుడవాహనంపై అధిరోహించి భక్తులను కటాక్షించారు. గరుడవాహనం అత్యంత విశిష్టమైనది. గరుడునిపై వేణుగోపాలుడు కలియుగంలో భక్తులకు తానున్నానంటూ అభయమిచ్చాడు. ఉదయం స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చి అలరించారు. వాహనసేవకు ముందుగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో భక్తిరసాన్ని పంచగా, మంగళవాయిద్యాల నడుమ స్వామి ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ వాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెంగ్రలాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



### శ్రీవారి సేవలో విద్యాప్రసన్నతీర్థస్వామి

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దక్షిణ కర్ణాటక కుక్కే సుబ్రమణ్యమఠం పీఠాధిపతి విద్యాప్రసన్న తీర్థస్వామి తన శిష్యులతో బుధవారం తిరుమలకు వచ్చారు. శ్రీవారి ఆలయం మహాద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయం లోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన స్వామి ఆలయంలోపల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన మన్నెం వెంకటశ్రీకాంత్ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిని అందజేశారు.



### ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలి

● తొండవాడ ముక్కోటి ఆలయంలో మాజీ సిజెఐ ఎన్‌వి రమణ

**తిరుపతి, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం తొండవాడలోని ముక్కోటి ఆలయాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ దంపతులు దర్శించుకున్నారు. బుధవారం ఎన్వీ రమణ దంపతులు ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ వర్గాలు స్వాగతం పలికాయి. ఆనందవల్లీదేవీ సమేత అగస్త్యేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయంలో జస్టిస్ ఎన్‌వి రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం ఉన్న అగస్త్యేశ్వర స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ విశిష్టతను, ఆధ్యాత్మికతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. స్వామి కృపతో దేశ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయ అభివృద్ధికి, పరిసరాల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని జస్టిస్ ఎన్‌వి రమణ పిలుపునిచ్చారు.

# దేశ నిర్మాణంలో యువతే కీలక శక్తి

● శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ● దేశాభివృద్ధికి దోహదపడే పరిశోధనలు అవసరం: అజయ్ కుమార్ సూద్ ● ఆధునిక విద్య, పరిశోధనలో ఎస్‌వియు ముందంజ : ఉపకులపతి టాటా నరసింగరావు ● గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి



**తిరుపతి విద్య, జూన్ 10 ప్రభాతవార్త:** స్నాతకోత్సవం కేవలం పట్టాల ప్రదాన కార్యక్రమం మాత్రమే కాదని, జ్ఞానం, పట్టుదల, క్రమశిక్షణ, ఆశయాలు, విజయాల వేడుక అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఎదుగుతున్న తరుణంలో యువత భవిష్యత్ ఉద్యోగులుగానే కాకుండా ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, దేశ నిర్మాణకర్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 63వ నుంచి 68వ ఉమ్మడి స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు, బంగారు పతకాలు ప్రదానం చేశారు. ప్రపంచ విజ్ఞాన, సాంకేతిక, వైద్య, పరిశోధన రంగాల్లో భారతీయులు తమ ముద్ర వేస్తున్నారని గవర్నర్ తెలిపారు. భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, సంపాదించిన జ్ఞానాన్ని సమాజ శ్రేయస్సు, మానవాళి అభ్యున్నతికి వినియోగించాలని సూచించారు. డ్రోన్ టెక్నాలజీ, మైక్రోనానో శాటిలైట్ టెక్నాలజీ, నానోటెక్నాలజీ, భూ విజ్ఞానశాస్త్రం తదితర రంగాల్లో ఎస్‌వీయూ చేస్తున్న పరిశోధనలు ప్రశంసనీయమన్నారు. డ్రోన్ పైలట్ శిక్షణ కోసం డీజీసీఏ నుంచి రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ గుర్తింపు పొందడం విశ్వవిద్యాలయం సాధించిన మరో మైలురాయిగా అభివర్ణించారు. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు అజయ్ కుమార్ సూద్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి దోహదపడే పరిశోధనలే నేటి అవసరమన్నారు. వాతావరణ మార్పులు, ఆరోగ్య సవాళ్లు, డిజిటల్ పరివర్తన వంటి అంశాలపై అంతరశాఖ పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి ఆధ్యాత్మికతకు కేంద్రంగా ఉంటే, ఎస్‌వీయూ విజ్ఞానం, ఆవిష్కరణలు, పరిశోధనలకు వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఎస్‌వీయూ ఉపకులపతి టాటా నరసింగారావు మాట్లాడుతూ 1954లో స్థాపితమైన విశ్వవిద్యాలయం విద్య, పరిశోధన, సామాజికాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. జాతీయ విద్యా విధానం- 2020లో భాగంగా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, క్లౌడ్ టెక్నాలజీస్ వంటి ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. నాక్ ఎ+ గ్రేడ్ సాధించడం, జాతీయ స్థాయిలో పరిశోధన ర్యాంకుల్లో గుర్తింపు పొందడం విశ్వవిద్యాలయ ప్రగతికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు అజయ్ కుమార్ సూద్, భారత జాతీయ విజ్ఞాన అకాడమీ అధ్యక్షుడు శేఖర్ సి. మండే, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎం. ఎల్లాలకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు.

అలాగే తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి ఎస్‌వీయూ ఎకనామిక్స్ విభాగంలో చిత్తూరు జిల్లాలోని కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులు అంశంపై నిర్వహించిన పరిశోధనకు గాను గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. స్నాతకోత్సవంలో 502 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 260 మంది ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. మొత్తం 5,573 మంది అభ్యర్థులకు పట్టాలు, 143 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి, రెక్టార్ ఆచార్య సిహెచ్.అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు, వివిధ విభాగాల డీన్లు ఆచార్య సుందరవల్లి, ఆచార్య రామకృష్ణారెడ్డి, ఆచార్య రాజేశ్వరమ్మ, ఆచార్య విజయం సారథిరెడ్డి, ఆచార్య మల్లికార్జున రావు, ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య శివశంకర్ రెడ్డి, ఆచార్య మోహన్ రెడ్డి, యస్వీయూ పాలకమండలి ఆచార్య సుగుణమ్మ, ఆచార్య సుమకిరణ్, ఆచార్య మంజుల, డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, జ్యోతి, సంధ్య, నారాయణ బాబు, అకడమిక్ సెనేట్ మెంబర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆచార్య రాళ్ళపల్లి రామమూర్తి, ఆచార్య ప్రభాకరరావు, ఆచార్య ఎం.ఎం. నాయుడు తదితరులు హాజరయ్యారు. పరీక్షల డీన్ ఆచార్య సురేంద్ర బాబు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాజమాణిక్యం పాల్గొన్నారు.

# ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం విధ్వంసం

● మెగా డిఎస్సీపై వైకాపా కుట్రలు ● ప్రజలకు జవాబుదారితనంగా కూటమి పాలన: మంత్రి కొల్లు రవీంద్ర

**కాణిపాకం, జూన్ 10 ప్రభాతవార్త:** ఐదేళ్ళ వైకాపా పాలనలో రాష్ట్రం విధ్వంసం అయిందని రాష్ట్ర భూగర్భ గనులు, ఆబ్కారిశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులతో కలసి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకునా న్నరు. అనంతరం పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్‌లతో కలసి విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ళ వైకాపా పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యమై పోయాయయని, రైతులు, యువత తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అయితే ఈరెండేళ్ళలో కూటమి ప్రభుత్వం అన్ని అధిగమించి అని న వర్గాలకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు ఈమేరకు గత ఏడాది మామిడి రైతులకు ప్రభుత్వం ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి పంటను కొనుగోలు చేసి ఆదుకున్నట్లు తెలిపారు. అయితే కుట్రపూరితమైన మనస్థత్వం కలిగిన మాజీ సీఎం జగనో మ్హన్‌రెడ్డి దీన్ని కూడా రాజకీయం చేయాలని ప్రయత్నించినట్లు మంత్రి తెలిపారు. అలాగే చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి 16,300 మందికి ఉపాధ్యాయులుగా ఉద్యోగ అవకాశాలు కలి ్పస్తే వైకాపా మెగా డిఎస్సీపై లేనిపోని రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర దుయ్యబట్టారు. అలాగే మెగా డీఎస్సీ అని, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అని జగన్ ప్రకటించినా ఐదేళ్ళలో ఏమి చేయలేదని అన్నారు. అయితే ప్రతి కార్యక్రమంలో ఉద్దేశ్య పూర్వకంగా కులాలు, మతాలు మధ్య లేనిపోని రెచ్చగొటే ్ట కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి, శ్రీసిటి వంటి ప్రాంతాల్లో పెద్దఎత్తున పరిశ్రమల స్థాపనకు లక్షల కోట్లు పెట్టుబడులు వస్తునా న్నయని తద్వారా యువతకు ఉదో ్యగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో సాధించిన విజయాలు, సూపర్‌సిక్స్, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించేందుకు తిరుపతిలో త్వరలో సీఎం సభను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఎన్నికల మ్యానిపెస్టో మేరకు 90 శాతం హామీలను అమలు చేశామని, రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు దృష్ట్యా మిగిలిన కార్యక్రమాలను త్వరలో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇదిలా వుండగా జిల్లాలో మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున ప్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు జవాబుదారితనంగా వుండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల నుండి వచ్చిన అర్జీలను పారదర్శకంగా ఆన్‌లైన్‌లో వుంచుతున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే గత ప్రభుత్వంలో ఎక్సైజ్‌శాఖను విచ్చలివిడి చేశారని తెలిపారు. దీనితో నూతన ఎక్సైజ్‌పాలసీని తీసుకురావడంతో ఆదాయం గణనీయంగా పెరిగిందని. అలాగే వినియోగదారులకు నాణ్యమైన మద్యాన్ని తక్కువ రేటుకు అందిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈవిలేకరుల సమావేశంలో పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బిసి సంక్షేమ సంఘం నాయకులు షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.




కాణిపాకంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

#### నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష

పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల అభివృద్ధిపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్‌లు చర్చించారు. కాణిపాకం పర్యటను విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యేలు స్థానిక దేవస్థానం అతిథి గృహంలో కలసి ఆలయ అభివృద్ధి, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పురోభివృద్ధికి అధికార, ప్రతిపక్షాలు సహకరించుకోవాలి

● రాష్ట్రం కోసం రాజకీయాలకు అతీతంగా సమష్టి కృషి అవసరం
● శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు

**జగ్గయ్యపేట,పెనుగంచిప్రోలు, జూన్ 10 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రయోజనాలకై అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలకు అతీతంగా సమిష్టి కృషి చెయ్యాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసివున్న గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానానికి స్పీకర్ కుటుంబ సమేతంగా బుధవారం విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి బ్యాంక్ చైర్మన్, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ స్పీకర్‌కు ఘనస్వాగతం పలికారు. స్పీకర్ కుమారుడు చింతకాయల విజయ్ కూడా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటిన అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రెండు దశాబ్దాల కాలంగా తిరుపతమ్మతల్లి క్షేత్రానికి రావాలన్న కోరిక నేడు తీరటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసౌఖ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. అన్న ఎన్టీఆర్ ఆశీస్సులతో టిడిపిలోకి వచ్చిన తాను నాటి నుండి నేటి వరకు అదే పార్టీలో కొనసాగుతూ ప్రజల ఆదరణతో ఈస్థాయికి చేరుకున్నానన్నారు. అనంతరం స్పీకర్ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా తన ఇంటికి ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజగోపాల్ వారికి ప్రేమ విందు ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ, అమ్మవారి ఆలయట్రస్టీ రమేష్, మాజీమున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, యువనేత శ్రీరాం ధనుంజయ, శ్రీరాం సాయిప్రసాద్, నూకల కుమారరాజ, కెవి నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, టిడిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. కాగా యువనేత ధనుంజయ ఆధ్వర్యంలో నటకిరీటి నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల అభివృద్ధికి నవచేతన కార్యక్రమంలో భాగంగా ఏఇ



స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులను సన్మానిస్తున్న టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కెడిసిసి బ్యాంక్ చైర్మన్, మాజీమంత్రి నెట్టెం రఘురామ్

సాధనాల వినియోగంపై మండల కేంద్రమైన చిల్లకల్లు ఐసిడిఎస్ సిడిపిఓ సత్యవతి ఆధ్వర్యంలో బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిబద్ధతతో నిర్వహించారు. బాల్యారంభ అభివృద్ధి బీబీ స్ట్రీమింగ్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నవచేతన పేరుతో ప్రారంభించిందని తెలిపారు. సభలో అంగన్‌వాడీలకు పలు విలువైన సూచనలిచ్చారు. ఏసిడిపిఓ సరళ, ప్రభుత్వవైద్యాధికారి షై ్టలా, సూపర్‌వైజర్లు సువర్ణ, రజనీ జ్వాల, బీబీ జాన్, భాగ్యలక్ష్మి, వెంకటకుమారి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## రాజధాని అమరావతిలో సెంట్రల్ గవర్నమెంట్ సెక్రటేరియట్

● కేంద్ర కేబినెట్ నిర్ణయంపై సిఎం చంద్రబాబు హర్షం
● ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకామడేషన్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్‌కు ప్రధాని నరేంద్రమోడీకి 'ఎక్స్' వేదికగా సిఎం చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాతినిధ్యాన్ని మరింత పెంచేలా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆధునిక, పర్యావరణ అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఆమోదం తెలపడం అమరావతి అభివృద్ధిలో మరొక కీలకమైన అంశం' అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాజధానిగా అమరావతి అభివృద్ధికి, భవిష్యత్తు వృద్ధికి అవసరమైన పరిపాలనా మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ప్రాజెక్ట్ ఊతమిస్తుంది. ఎపిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోటకు తీసుకరావడం ద్వారా పాలనను సులభతరం అవుతుందన్నారు. అమరావతికి కేంద్రం అందిస్తున్న చేయూతను, సహకరిస్తున్న తీరుకు ఈ నిర్ణయం అద్దం పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

## రాజధాని ప్రాంతంలోని అన్ని గ్రామాలకు పైపులైన్ల ద్వారా ఇళ్లకు గ్యాస్ సరఫరా

● సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంతంలోని అన్ని గ్రామాలకు పైపులైన్ల ద్వారా ఇళ్లకు గ్యాస్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు చెప్పారు. విద్యుత్ సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. గ్రామస్థులు అడిగిన సమస్యలన్నీ నెల రోజుల్లో పూర్తి చేస్తామని కమిషనర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తుళ్లూరు మండలం వెలగపూడిలో రహదారుల నిర్మాణం కోసం భూసేకరణ కింద తీసుకుని పొలాలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గ్రామంలో సక్రమంగా మంచి నీరు విద్యుత్ సరఫరా జరగడం లేదని ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్లాట్ల అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు సక్రమంగా చేయటం లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తారు. తన ఛాంబర్‌కు వచ్చి కలవాలని కాంట్రాక్ట్ సంస్థకు చెందిన సిబ్బందిని ఆదేశించారు.

## విబి జి రామ్ జి పథకం కింద ఎపికి రూ.7,707.21 కోట్ల నిధులు కేటాయింపు

● కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపిన డి.సిఎం



**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విబి జి రామ్ జి పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,707.21 కోట్ల తాత్కాలికంగా కేంద్రం కేటాయించింది. డిప్యూటీ సిఎం పవన్ ఎక్స్ వేదికగా స్పందించారు. దేశంలోనే మూడో అత్యధిక నిధులను ఎపి పొందిందని తెలిపారు. ఇది పారదర్శక పాలన, సమర్థవంతమైన అమలు పట్ల తమ నిబద్ధతకు ఓ బలమైన నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ మద్దతు గ్రామీణ పరివర్తనను వేగవంతం చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుందని, జీవనోపాధిని మెరుగుపరుస్తుందని చెప్పారు. ఎపి, దేశాభివృద్ధి కోసం కఠోర శ్రమతో ఊపిరి పోస్తున్న రైతులు, మహిళలు, యువత, శ్రామికులకు ఇది మరింత మెరుగైన అవకాశాలను కల్పిస్తుందని పవన్ అన్నారు. దూరదృష్టితో కూడిన నాయకత్వం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రధానమంత్రికి పవన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌పై నిరంతర మద్దతు, నమ్మకాన్ని ఉంచినందుకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దివ్యాంగురాలిపై దాడి... నిందితుడు అరెస్టు

**విశాఖపట్నం(భీమునిపట్నం), జూన్ 10 ప్రభాతవార్త:** గ్రామదేవత ఉత్సవాల ఆనందం ఓ కుటుంబానికి విషాదంగా మారింది. మేధో వైకల్యం కలిగిన 24 ఏళ్ల యువతి పండుగ సందడిలో కనిపించకుండా పోవడం, అనంతరం ఆమెపై దారుణం జరిగినట్లు వెలుగులోకి రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఆ యువతి గ్రామదేవత ఉత్సవాలకు వెళ్లిన సమయంలో కనిపించకుండా పోయింది. కుమార్తె కనిపించకపోవడంతో తల్లి కుటుంబ సభ్యులు రాత్రంతా గాలింపు చేపట్టారు. పోలీసు సిబ్బంది కూడా అన్వేషణలో పాల్గొన్నారు. యాతకుమారిపాలెంలోని సుఖీభవ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో యువతి గుర్తించబడింది. బాధితురాలి వాంగ్మూలం మేరకు ఇద్దరు వ్యక్తులు ఆమెను ఉత్సవాల వద్ద నుంచి బలవంతంగా తీసుకెళ్లి దాడికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పోలీసులు ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది. బాధితురాలికి అవసరమైన వైద్య, న్యాయ సహాయ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


भारत सरकार
कारपोरेट कार्य मंत्रालय
त्वरित कॉर्पोरेट समापन प्रसंस्करण केंद्र (सी-पेस),
आई.आई.सी.ए. बिल्डिंग, 7वी मंज़िल,
प्लाट P-6,7,8, से.-5, आई.एम.टी. मानेसर, गुड़गाँव,
हरियाणा - 122050.
Email: roc.cpace@mca.gov.in

భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (C-PACE)
IICA బిల్డింగ్, 7వ అంతస్తు, ప్లాట్ P-6,7,8, సెక్టార్-5, IMT మనేసార్, గుర్‌గావ్, హర్యానా-122050
ఇ-మెయిల్: roc.cpace@mca.gov.in

ఫారం నం. STK-6
బహిరంగ ప్రకటన

(2013, కంపెనీల చట్టం యొక్క సెక్షన్ 248 యొక్క ఉప సెక్షన్ (4) మరియు ఉప సెక్షన్ (2)కు అనుసరించి మరియు కంపెనీల యొక్క నిబంధన 7 (కంపెనీల యొక్క రిజిస్టర్ నుండి కంపెనీల యొక్క పేర్లు తొలగింపు) నిబంధనలు, 2016)

బహిరంగ : ROC/C-PACE/STK-2/248(2)/2026-27/382 తేది :- 02.06.2026

రిఫరెన్స్:
కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 248 క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కంపెనీలు (11) యొక్క పేర్లు తొలగింపు లేదా కొట్టివేయడం విషయంలో. వాటికి సంబంధించి:

| క్ర.సం. | పని ఐటమ్ | CIN | కంపెనీ పేరు |
|---|---|---|---|
| 1 | AC3322308 | U62013AP2023PTC112004 | VYST సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 2 | AC3407464 | U15549AP2022PTC123310 | విశ్వేశ్వర స్పైసెస్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 3 | AC3415992 | U72900AP2022PTC122219 | శ్లోక టెక్ఇన్ఫో ప్రైవేట్ లిమిటెడ్ |
| 4 | AC3466265 | U74900AP2015PTC096069 | కాయితి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 5 | AC3600099 | U85500AP2025OPC122318 | మన్‌సిన్నోవియాన్ (OPC) ప్రైవేట్ లిమిటెడ్ |
| 6 | AC3487346 | U01229AP1994PTC017091 | M.S. హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 7 | AC3525987 | U74999AP2018PTC107628 | బయా వీవర్స్ హార్డ్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 8 | AC3520135 | U19115AP2015PTC097970 | క్రాంతి టాన్నెర్స్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 9 | AC3545859 | U93290AP2025PTC122234 | వివెన్సియా ప్రైవేట్ లిమిటెడ్ |
| 10 | AC3562048 | U59141AP2023PTC110716 | పిక్సెల్ సినిమాస్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 11 | AC3608573 | U62013AP2023PTC111892 | ఫెలినో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ |

2) పైన పేర్కొనబడిన కంపెనీల నుండి కంపెనీల యొక్క రిజిస్ట్రార్‌కు కంపెనీల చట్టం 2013 యొక్క 248(2) సెక్షన్ క్రింద కంపెనీల యొక్క రిజిస్టర్ నుండి వారి పేరు(లు) తొలగించడానికి దరఖాస్తులు అందాయని ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమైనది. వారి కంపెనీ ఇన్‌కార్పొరేషన్ తర్వాత ఒక సంవత్సరంలోపుగా వ్యాపారం ప్రారంభించడంలో విఫలమైన కారణం కానీ లేదా ముందు వెనువెంట వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల కాలానికి ఎటువంటి వ్యాపారం లేదా నిర్వహణ నిర్వర్తించకపోవడం కారణం కానీ, మరియు అటువంటి కాలంలో నిద్రాణమైన కంపెనీ స్థితి పొందడానికి కారణంగా కానీ కంపెనీల చట్టం 2013 యొక్క 455 సెక్షన్ క్రింద ఎటువంటి దరఖాస్తు(లు) పెట్టకపోవడం కారణంగా కానీ లేదా కంపెనీ(లు) నిద్రాణ కంపెనీ/ చందాదారులుగా నిద్రాణ స్థితి పొంది మెమొరాండంకు కంపెనీ ఇన్‌కార్పొరేషన్ సమయంలో చెల్లించవలసిన చందా చెల్లించకపోవడం వలన కారణంగా కానీ మరియు దాని ప్రభావం కలిగించే డిక్లరేషన్ ఇన్‌కార్పొరేషన్ నుండి ఒక వంద మరియు ఎనభై రోజులలోపుగా ఫైల్ చేయకపోవడం వలన కానీ సెక్షన్ 10A/యొక్క సబ్ సెక్షన్ (1) క్రింద ఎటువంటి వ్యాపారం లేదా నిర్వహణ నిర్వర్తించకపోవడం వలన గానీ, సెక్షన్ 12 యొక్క సబ్ సెక్షన్ (9) క్రింద భౌతికంగా తనిఖీ తెలిపిన ప్రకారం ఎటువంటి వ్యాపారం లేదా నిర్వహణ చేయకపోవడం వలన కానీ, వారికి దాని/వారి కంపెనీలుగా రిజిస్ట్రేషన్ కొనసాగింపునకు ఒక కోర్కెలేదని మరియు తొలగింపు/కొట్టివేయడానికి అర్థించారని ఇందుమూలముగా ప్రకటించడమైనది.
3) ఆ ప్రకారం, కంపెనీల యొక్క రిజిస్ట్రార్ పైన పేర్కొన్న కంపెనీల పేర్లు, కంపెనీల రిజిస్టర్ నుండి తొలగించుట లేదా కొట్టివేయడం ప్రతిపాదిస్తున్నారు.
4) కంపెనీల రిజిస్టర్ నుండి కంపెనీల పేర్లు తొలగింపు లేదా కొట్టివేయడం ప్రతిపాదనపై ఏ వ్యక్తికైనా అభ్యంతరం ఉంటే అతడు లేదా ఆమె అభ్యంతరాన్ని ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి ముప్పై రోజులలోగా పైన పేర్కొనబడిన కార్యాలయం చిరునామాకు పంపవచ్చును.

ఇర్ఫాన్ టిర్కీ
డిప్యూటీ రిజిస్ట్రార్
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్

CBC 07123/11/0168/2627

11-6Pg7exHMNWJQE.qxd:11-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:34 AM Page 1



# దుర్గమ్మ గుడిలో మెరుగైన పారిశుద్ధ్యం



ఆలయ ప్రాంగణంలో పరిశీలిస్తున్న ఇఓ శీనానాయక్

**ఇంద్రకీలాద్రి, జూన్ 10 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో మెరుగైన పారిశుద్ధ్య విధానాలు పాటించాలని ఇఓ వికె శీనానాయక్ ఆదేశాలిచ్చారు. బుధవారం ఆలయ ప్రాంగణమంతా కలియ తిరిగి శానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. ఆలయంలో పలు ప్రాంతాల్లో పర్యటించి నపుడు క్యూలైన్లు, మెట్లమార్గంలో పాతమ్యాట్లు, వాడేసిన ఇనుప పైపులుండడాన్ని గమనించి వెంటనే వాటిని అక్కడి నుండి సరైన ప్రాంతానికి తరలించాలని, ఆ ప్రదేశాన్ని పరిశుభ్రం చేయాలని, శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం సహించమని హెచ్చరించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన వేమూరి సుబ్బారావు, వీర రాఘవమ్మ దంపతులు రు. 2,01,116ల విరాళం బుధవారం ఇఓ వికె శీనా నాయక్‌కు అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



## మందుబాబులకు జైలుశిక్ష

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడిపిన 10మందికి కోర్టు జైలుశిక్ష విధించింది. విజయవాడ 1, 2, 4, 5 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అధికారులు తమ సిబ్బందితో కలిసి ఈనెల ఒకటవ తేదీ నుండి 9వతేదీ వరకు ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 127 మందిపై కేసులు నమోదు చేసి, న్యాయస్థానాల్లో నిందితులను బుధవారం హాజరు పరచారు. ఈసందర్భంగా విచారించిన కోర్టు వీరిలో ఒకరికి మూడురోజుల జైలుశిక్ష, తొమ్మిదిమందికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు, 117 మందికి రూ.11.95లక్షల జరిమానా విధించింది.

## అనుమానంతో భార్యను చంపిన భర్త

● మార్కాపురం జిల్లా సర్విరెడ్డిపల్లిలో ఘటన



సంఘటన స్థలంలో డిఎస్పీ నాగరాజు, గిద్దలూరు సిఐ రామకోటయ్య

**కొమరోలు, జూన్ 10 ప్రభాతవార్త:** అనుమానంతో భార్యను భర్త గొడ్డలితో అతి కిరాతకంగా నరికి చంపిన సంఘటన మండలంలోని సర్విరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం తెల్లవారుఝూమున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మార్కాపురం జిల్లా కొమరోలు మండలం సర్విరెడ్డిపల్లి గ్రామంలోని పందీటి మరియా జ్యోతికి గిద్దలూరు పట్టణంలోని ఏబీఎం పాలెంకు చెందిన దావీదుకు సుమారు 20 సం. కిందట వివాహం జరిగింది. వీరికి 16సం. అమ్మాయి, 13సం. అబ్బాయి ఉన్నారు. వీరు గత కొన్ని సంవత్సరాలుగా విడివిడిగా నివాసం ఉంటున్నారు. మరియ జ్యోతి తల్లి గ్రామమైన సర్విరెడ్డిపల్లిలో వెలుగు కార్యాలయంలో గ్రామసమైఖ్య సభ్యురాలు(వీఏఓ)గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. మృతురాలి అక్కకు బాగాలేదని తల్లి మరియమ్మ రెండు రోజుల కిందట హైదరాబాదుకు వెళ్ళటంతో ఇదే అదునుగా చేసుకున్న దావీదు గురువారం తెల్లవారు ఝూమున మరియజ్యోతి, చెల్లెలుతో కలసి బహిర్భూమికి వెళ్ళారు. ఇంతలో కంపచెట్ల మధ్యలో పొంచిఉన్న దావీదు గొడ్డలితో కనిపించడంతో వీరు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గొడ్డలితో ఎక్కడ పడితే అక్కడ నరకడంతో సుమారు పది నిమిషాలు పెనుగులాట జరిగింది, అప్పటికే తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

మృతురాలి చెల్లెలు అరుపులు, కేకలతో చుట్టుప్రక్కల ప్రజలు రావటంతో సంఘటనా స్థలం నుంచి దావీదు పారిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలానికి మార్కాపురం డి.ఎస్.పి నాగరాజు, గిద్దలూరు సీఐ రామకోటయ్య, రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## విస్సన్నపేటలో తల్లిని చంపిన తనయుడు

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో దారుణం చోటుచేసుకుంది. తల్లి రమాదేవిని కుమారుడు రఘువంశీ చంపాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హత్య జరిగిన రెండవ రోజున ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. హైదరాబాద్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్న కుమారుడు రఘువంశీ తాను చేసిన అప్పులు తీర్చడానికి ఇల్లు అమ్మాలంటూ తల్లిని ఒత్తిడి చేయగా దానికి ఆమె నిరాకరించింది. దీంతో తల్లిపై కక్ష పెంచుకుని హత్యచేసినట్లు పోలీసులు గుర్తించారు. విస్సన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రమాదేవి చిన్న కుమారుడు రఘువంశీ హైదరాబాద్‌లో నివసిస్తుంటారు. ఆయనే ఈ హత్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది. అప్పుల బాధలో ఉన్న అతను, వాటిని తీర్చుకోవడం కోసం ఇంటిని అమ్మేయాలని తన తల్లిపై ఒత్తిడి తెచ్చాడు. ఆమె అందుకు నిరాకరించడంతో ఆమెపై కోపం పెంచుకుని, పథకం ప్రకారం ఆమెను హత్య చేశాడు. దీనితో మేము అతన్ని అదుపులోకి తీసుకున్నామని తిరువూరు సీఐ గిరిబాబు తెలిపారు. ఈ నెల 7న తల్లి ఒంటరిగా ఉన్న సమయం చూసి కుమారుడు ఆమెపై దాడి చేశాడు. అనంతరం తన చేతులతోనే గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత ఏమీ జరగనట్లుగా అతను హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయాడు. రమాదేవి సోదరి ఆమె మృతదేహాన్ని చూసినప్పుడు, అది సహజ మరణం కాదని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనితో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి రమాదేవికి సంబంధించిన వివరాలు సేకరించారు. అతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ప్రశ్నించగా తానే ఆ హత్య చేశానని రఘువంశీ అంగీకరించాడు. దాంతో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు."హత్య జరిగిన మరుసటి రోజే రమాదేవి సోదరి ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బీహార్ బస్సు ప్రమాదంలో మరొకరు మృతి



**సంగం (నెల్లూరు), జూన్ 10 ప్రభాతవార్త:** బీహార్‌లో ఆంధ్ర యాత్రికుల బస్సుకు జరిగిన ఘోర ప్రమాదంలో మరో ప్రాణం అనంతవాయువులలో కలిసి పోయింది. ఐసియులో చికిత్స పొందుతున్న నెల్లూరు జిల్లా సంగంకు చెందిన బొమ్మిశెట్టి లక్ష్మమ్మ మృతి చెందింది. ఈ సంఘటనతో సంగంలో మరింత విషాద ఛాయలు అలము కున్నాయి. లక్ష్మమ్మ మృతితో కేవలం సంగంలోనే ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఆత్మకూరుతో కలిపితే మొత్తం నలుగురు మృత్యువాత పడ్డారు.

## చికిత్స పొందుతూ మరో కార్మికుడు మృతి
### కన్నీరు పెట్టిస్తున్న తండ్రి చివరి మాటలు

**విశాఖపట్నం, జూన్ 11 ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడు పైడిరాజు బుధవారం ఉదయం మృతి చెందడంతో దుర్ఘటనలో మృతుల సంఖ్య 9కు చేరింది. ప్రాణాలతో పోరాడుతూ తన కుటుంబ సభ్యులకు చెప్పిన చివరి మాటలు ఇప్పుడు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. ఈ నెల 8న స్టీల్ మెల్టింగ్ షాప్‌లో సలసల మరుగుతున్న ఉక్కు ద్రవం ఒక్కసారిగా లావాలా ఎగసిపడి కార్మికులపై చెలరేగడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం కన్నుమూశారు. గాయాలతో ఆసుపత్రి మంచంపై చికిత్స పొందుతున్న సమయంలో తన కుమారుడు వర్మతో మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "వర్మా... తమ్ముడి మీద చిరాకు పడకు... వాడిని బాగా చదివించు... నువ్వు కూడా బాగా చదువుకో... అమ్మను బాగా చూసుకోండి... ఉంటాను డాడీ" అంటూ కన్నీటి గొంతుతో చెప్పిన మాటలు హృదయాలను కలచివేస్తున్నాయి. తన ప్రాణాల కంటే కుటుంబ భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ పిల్లలకు బాధ్యతలు అప్పగించిన ఆ తండ్రి ప్రేమ, ఆవేదన అందరినీ భావోద్వేగానికి గురిచేస్తోంది. మృత్యువుతో పోరాడుతూనే కుటుంబానికి ధైర్యం చెప్పిన పైడిరాజు చివరి సందేశం ఇప్పుడు ఒక కుటుంబానికే కాకుండా సమాజానికే మానవీయతను గుర్తు చేస్తున్న విషాద గాథగా మారింది.

ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అలాగే క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించింది. మృతి చెందిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు వివిధ ప్రయోజనాలు కలిపి రూ.1.72 కోట్ల వరకు, ఒప్పంద ఉద్యోగుల కుటుంబాలకు సుమారు రూ.45 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనపై కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మిగిలిన క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

# ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి

● పెండింగ్ పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం

● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ● ప్రశాంతంగా నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



**నెల్లూరు (కలెక్టరేట్), జూన్ 10 ప్రభాతవార్త:** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, రహదారుల మరమ్మత్తులు, సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, సిఇవో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపిపిలు, అధికారులు హాజరయ్యారు. తొలుత సమావేశంలో పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా విద్యాశాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సభలో చర్చించారు. ప్రధాన రహదారుల మరమ్మత్తులు, నూతన రోడ్ల మంజూరుపై సభ్యులు ప్రశ్నించారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా సచివాలయాల బిల్డింగులు అసంపూర్తిగా ఉన్నాయని, బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, నాడు నేడు కింద పాఠశాలలో చేపట్టిన పనులు కూడా మధ్యలో నిలిచిపోయి ఉన్నాయని పలువురు సభ్యులు మంత్రుల దృష్టికి తీసు కొచ్చారు. తమకు మరో మూడు నెలలు మాత్రమే ఉందని, ఈ సమయంలోగా తాము ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు జడ్పిటిసి లు కోరారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యకేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశం సజావుగా జరిగిందని తెలిపారు. మరో మూడు నెలల్లో జిల్లా ప్రజాపరిషత్ పాలక మండలి పదవీ కాలం ముగుస్తుందని, మొట్టమొదటి జిల్లా పరిషత్ సమావేశంలో తాను పాల్గొన్నానని, చివరి సమావేశంలో కూడా తాను పాల్గొని జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ చేసిన సేవలను గుర్తు చేసుకోవడంలో పాలు పంచుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా పరిషత్ సాధారణ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, కొన్ని సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రధానంగా రహదారుల మరమ్మత్తులపై సభ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సచివాలయాలను పూర్తిస్థాయి లో నిర్మించడం, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, పాఠశాల లు మొదలైన అంశాలపై కూడా చర్చించామని, వీటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తుందన్నారు. కోవూరు నియోజకవర్గంలో చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు భోజనం తినడానికి సరైన వసతులు లేవన్నారు. పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా చోట్ల వంట గదులు భోజనశాలలను సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనాన్ని అధికారులు బాధ్యతగా తీసుకొని చేపట్టాలన్నారు. వంటలు వడ్డించేటప్పుడు విద్యార్థులకు ఇబ్బందులులేకుండా చూడాలన్నారు. కోవూరు నియోజక వర్గంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు ఎక్కువ ఉంటాయని, ఆయా ప్రాంతాల్లో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్స్, స్మశానాలు గడిచిన 24 నెలలుగా చాలా ప్రాంతాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఇంకా చాలా వరకు చేయాల్సి ఉందన్నారు. వాటికి సంబంధించిన పనులకు జడ్పీ నిధులు మంజూరు చేయాలని కోరారు.

జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను ఆయాశాఖాల అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రధానంగా రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ విజయభాస్కర్, డిఇఓ ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటసుబ్బయ్య, డిఆర్‌డిఎపిడి నాగరాజు కుమారి, జిల్లా వ్యవసాయా ధికారి సత్యవేణి, జలవనరులశాఖ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, డిఎంఅండ్‌హెచ్ఓ సుజాత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 400 చెరువుల్లో పూడికతీత పనులు



పులివాగు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త:** భూగర్భజలాల పెంపు, జలవనరుల సంరక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార-జలహారతి కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లాలో చురుగ్గా సాగుతుందని, ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 400 చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. జి.కొండూరు మండలం పినపాక గ్రామంలో రైతులు, ప్రజల భాగస్వామ్యంతో పులివాగులో పూడికతీత పనులను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధిహామీ అనుసంధానంతో జలవనరుల సంరక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పులివాగు ఫీడర్ ఛానల్ అభివృద్ధి పనులను శ్రామికులతో చేయించేందుకు వీలులేకపోవటంతో జేసిబి సాయంతో పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈపనులు చేపట్టడం సంతోషకరమని, ఇందులో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సైతం తన వంతు చేయూతనివ్వటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని మిగిలిన నియోజక వర్గాల్లోనూ ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు వస్తే జిల్లాను జలధారలో అగ్రగామిగా నిలపవచ్చని కలెక్టర్ అభిప్రాయం వ్యక్తంచేసారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం తోడైతే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ప్రభుత్వం, ప్రజలు కలిసి చేపట్టిన మంచి పని నూతన అధ్యాయానికి నాంధి కానుందన్నారు. ఈకార్యక్రమంలో డ్వామా పిడి రాము, పలువురు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ భూములను ఆదాయవనరుగా మార్చాలి

● పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్




అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ పై వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలకు చెందిన భూములను విక్రయించవద్దని వాటిని ఆదాయ వనరుగా మార్పుచేయాలని రాష్ట్రమున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ పై రెండురోజుల వర్క్‌షాప్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సి పాలిటీల భూముల్లో వాణిజ్య సముదాయాలు, మార్కెట్‌లు, పెట్‌పార్కులు, స్పోర్ట్స్ ఎరీనాలుగా అభివృద్ధి చేసి ఆదాయ వనరుగా మార్చాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమీషనర్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, సోషల్‌మీడియా వేదికగా ఉపయోగించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రోడ్లు, డ్రైనేజి, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం జరిగే ప్రాంతాల్లో సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలన్నారు. పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం రూపొందించిన 30రోజుల కార్యాచరణ ప్రణాళికను అర్బన్ మున్సిపాలిటీల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీ కనీసం ఒక లాభదాయ ప్రాజెక్టును పెద్దకార్పోరేషన్లు ఒకటి కంటే ఎక్కువ ప్రాజెక్టులను ప్రతిపాదించాలని కోరారు. వీటిలో డిపిఆర్, ఆర్థిక అంచనాలు, ఆదాయ వనరులు, నిర్వహణ ప్రణాళికలు ఉండాలన్నారు. మున్సిపాలిటీల్లో మౌలిక వసతులను కల్పనను ముఖ్యమంత్రి ప్రశంసించారని తెలిపారు. ప్రతినెలా మున్సిపాలిటీలపై ముఖ్యమంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నారని సురేష్‌కుమార్ చెప్పారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ వివేక్, జివియంసి కమీషనర్ కేతన్‌గార్గ్, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ యండి అనీల్‌కుమార్‌రెడ్డి, పబ్లిక్ ఈఎన్‌సి యం.ప్రభాకరరావు, సీఈ ఏ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో ఘరానా చోరీ కేసు ఛేదన

● నలుగురు నిందితులు అరెస్ట్ ● రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

**నెల్లూరు (క్రైం), జూన్ 10 ప్రభాతవార్త:** నగరంలోని పెద్దబజార్‌లో జరిగిన చోరీ కేసును చిన్నబజార్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులతో పాటు ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 145.300 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను బుధవారం ఏఎస్పీ దీక్ష మీడియాకు వెల్లడించారు. ఈనెల 2వ తేదీ పెద్దబజార్ ప్రాంతానికి చెందిన షేక్ అజ్మత్ తన ఇంటికి రాగా, బీరువా లాకర్ తెరిచి ఉండటాన్ని గమనించారు. అందులోని బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి, ఆమె వెంటనే చిన్నబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సౌజన్య పర్యవేక్షణలో, నెల్లూరు టౌన్ ఏఎస్పి దీక్ష ఆధ్వర్యంలో చిన్న బజార్ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు, 9న పెద్దబజార్, డైకస్ రోడ్ సెంటర్ సమీపంలోని చేపల మార్కెట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్ ఇర్ఫాన్ (19), మొహమ్మద్ ఆబిద్(20)లతో పాటు ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో, వారి నుంచి బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన చిన్నబజార్ సీఐ ఎస్. శ్రీనివాసరావు, ఎస్ఐలు రజాక్, అయ్యప్ప, వారి క్రైమ్ సిబ్బందిని జిల్లా ఇంచార్జి ఎస్పీ, టౌన్ ఏఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు.

# స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

● ఉద్యోగాలు కల్పించాలి.. లేకపోతే అధికారంలోకి రాగానే మేమే అమలు చేస్తాం ● చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు



**విశాఖపట్నం, జూన్ 10 ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించి, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం ఆ పని చేయకపోతే, తమ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే కోటి రూపాయల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో గాయపడి సెవెన్ హిల్స్, కిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను బుధవారం పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రమాదంలో ఇప్పటివరకు తొమ్మిది మంది మరణించగా, మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందన్నారు. ప్రమాద బాధితుల కుటుంబాలకు రూ.1.72 కోట్లు వస్తాయని ప్రభుత్వం చెబుతోందని, అయితే అది వారి హక్కుగా రావాల్సిన సొమ్మేనని జగన్ పేర్కొన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, పీఎఫ్, గ్రాట్యుటీ, ఇతర బెనిఫిట్స్ రూపంలో మరో రూ.1.45 కోట్లు కూడా వారికి హక్కుగా లభిస్తాయని చెప్పారు. "వారి హక్కుగా వచ్చే డబ్బును ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకోవడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ఏమి ఇస్తోంది?" అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడేందుకు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అన్ని విధాలా పోరాడిందని జగన్ గుర్తు చేశారు. 2021లో ప్రధానికి రెండు లేఖలు రాశామని, అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ సమక్షంలో కూడా ప్రైవేటీకరణను వ్యతిరేకించినట్లు తెలిపారు. ప్రస్తుతం చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి స్టీల్ ప్లాంట్‌పై చిత్తశుద్ధి ఉంటే వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో స్టీల్ ప్లాంట్‌లో 28 వేల మంది ఉద్యోగులు ఉండగా, గత రెండేళ్లలో 10 వేల మందికిపైగా ఉద్యోగాలు తగ్గిపోయాయని ఆరోపించారు. 6,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, 1,800 మందిని వీఆర్ఎస్ ద్వారా పంపించివేశారని, మరో 2,500 మంది పదవీ విరమణ చేశారని పేర్కొన్నారు. నాలుగున్నర నెలలుగా ఉద్యోగులకు జీతాలు అందడం లేదని, బోనస్, హెచ్‌ఆర్ఏ, ఎల్‌టీసీ, వైద్య సదుపాయాలు వంటి అనేక ప్రయోజనాలు నిలిపివేశారని విమర్శించారు. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీని కూడా సంస్థ అభివృద్ధి లేదా భద్రత కోసం కాకుండా, వీఆర్ఎస్, రుణాలు, జీఎస్టీ బకాయిల చెల్లింపులకే వినియోగించారని ఆరోపించారు. ప్రమాదంలో కార్మికుల తప్పిదం ఏమాత్రం లేదని, ముడి పదార్థాల నాణ్యత లోపాలు, సాంకేతిక కారణాల వల్లే ప్రమాదం జరిగిందని జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

### స్టీల్ ప్లాంట్ బాధితులకు జగన్ పరామర్శ



విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల చోటు చేసుకున్న విషాదకర ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైఎస్ జగన్ స్వయంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స విధానం, బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ప్రమాదంలో గాయపడిన కార్మికుల కుటుంబ సభ్యులతో కూడా జగన్ మాట్లాడారు. వారికి ధైర్యం చెబుతూ, ఈ క్లిష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను ఓపికగా విన్నారు. స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా జగన్ పేర్కొన్నారు. బాధితులను పరామర్శించిన అనంతరం వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారి ఆరోగ్య పరిస్థితిపై మరిన్ని వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

11-6Pg5.qxd:11-6Pg5.qxd 1/1/02 5:54 AM Page 1



# పశ్చిమాసియా రణరంగం
# అమెరికా - ఇరాన్ మధ్య భీకర దాడులు



**వాషింగ్టన్, జూన్ 10:** పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. హోర్ముజ్ సమీపంలో అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. దీనికి టెహ్రాన్ కూడా గట్టిగా ప్రతిస్పందిస్తోంది. గల్ఫ్ ప్రాంతాల్లో అగ్రరాజ్య స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తోంది. అమెరికా దాడులను దురాక్రమణ చర్యగా ఐఆర్‌జిసి అభివర్ణించింది. బహ్రెయిన్‌లోని అమెరికా నావికా ఫ్లీట్‌తోపాటు, జోర్డాన్‌లోని ఆ దేశానికి చెందిన అల్ అజ్రాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కువైట్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా ఉత్తర ఇరాక్‌లతో పలు పేలుడు శబ్దాలు వినిపించాయి. తమ భూభాగంపై దాడులు ఇలానే కొనసాగితే.. తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. దీనికి ముందు దక్షిణ ఇరాన్‌లోని జాస్క్, సిరిక్, ఖేష్మ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా యుఎస్ దళాలు దాడులు చేశాయి. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు ప్రారంభించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పేర్కొంది. ఈ దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రతిస్పందనలు చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. వారు మా హెలికాప్టర్‌ను కూల్చివేశారు. వారు చేసిన దానికి ఇది మా ప్రతిస్పందన. ఇది చాలా బలంగా.. అత్యంత శక్తిమంతంగా ఉండాలని అనుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**అమెరికా ఎంక్యు-9 రీపర్ డ్రోన్ కూల్చేశాం: ఇరాన్**

వైమానిక ఘర్షణ నేపథ్యంలో.. బుషెహర్ ప్రావిన్స్‌పై ఒక అమెరికా ఎంక్యు-9 రీపర్ డ్రోన్ కూల్చివేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ విడియోను కూడా విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనను అమెరికా ఇంకా ధ్రువీకరించలేదు.

# పశ్చిమాసియా రౌడీ ఇకలేడు.. చనిపోయాడు!

## ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ పోస్టు!



**వాషింగ్టన్,జూన్ 10:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయని అనుకుంటే అనూహ్యంగా మళ్లీ పెరుగుతున్నాయి. గల్ఫ్ దేశాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండగా ప్రతీకారంగా అమెరికా దాడులు చేయడంతో మళ్లీ టెన్షన్ వాతావరణం నెలకొంది. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలపై ప్రపంచ దేశాలు భయాందోళన చెందుతున్నాయి. తాజాగా ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మధ్యప్రాచ్య రౌడీ ఇక చనిపోయాడు అంటూ ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గల్ఫ్ ప్రాంతంలో అమెరికాఇరాన్ మధ్య తాజా సైనిక ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ట్రంప్ ఇరాన్ సైన్యం పూర్తిగా ఓడిపోయిందని వారి నౌకాదళం, వైమానిక దళ సామర్థ్యాలు దాదాపు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునే విషయంలో టెహ్రాన్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసిందని ఆరోపిస్తూ ఇప్పుడు దానికి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్ సైన్యం పూర్తిగా గందరగోళంలో ఉంది. వారు పూర్తిగా ఓడిపోయారు. ఇరాన్ మాటలు మాత్రమే చెబుతుంది చర్యలు ఉండవు. మధ్యప్రాచ్య రౌడీ ఇక చనిపోయాడు అని ట్రంప్ తన పోస్టులో వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో ఇరాన్‌పై ట్రంప్ చేసిన అత్యంత తీవ్రమైన వ్యాఖ్యలలో ఇది ఒకటిగా పరిగణిస్తున్నారు. కొన్ని గంటల ముందే ఇరాన్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. అమెరికాతో ప్రయోజనకరమైన ఒప్పందం చేసుకునే అవకాశాన్ని ఇరాన్ కోల్పోయిందని చర్చలు జరపడంలో చాలా ఆలస్యం చేసిందని అన్నారు. 'వారికి ఎంతో ఉపయోగపడే ఒప్పందంపై నిర్ణయం తీసుకోవడానికి చాలా సమయం తీసుకున్నారు. ఇప్పుడు దానికి మూల్యం చెల్లించాల్సిందేనని హెచ్చరించారు. ఇటీవల అమెరికా.. ఇరాన్‌కు చెందిన పలు సైనిక స్థావరాలపై ప్రతీకార దాడులు నిర్వహించగా దానికి ప్రతిస్పందనగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలో ఉన్న అమెరికా సైనిక కేంద్రాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# కుప్పకూలిన పాక్ సైనిక హెలికాప్టర్: 21 మందిమృతి

**ముజఫరాబాద్,జూన్ 10:** పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ17 హెలికాప్టర్ ముజఫరాబాద్ సమీపంలో టేకాఫ్ అవుతున్న సమయంలో కూలిపోయింది. సాంకేతిక లోపం కారణంగా కూలిపోయింది. హెలికాప్టర్‌లో ఉన్న సిబ్బంది అందరూ అమరులయ్యారని పాకిస్థాన్ మీడియా తెలిపింది. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్‌ను ఉటంకిస్తూ పాకిస్థాన్ డాన్ పత్రిక వెల్లడించింది. హెలికాప్టర్‌లో 21 మంది సైనికులు ఉన్నట్లుగా తెలుస్తోంది. అందరూ చనిపోయినట్లుగా సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు వెల్లడించారు. హెలికాప్టర్‌లో ఉన్న సైనిక సిబ్బంది దేశ సేవలో అమరులయ్యారని పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పాకిస్థాన్ ఆర్మీ దర్యాప్తు ప్రారంభించింది. సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ముజఫరాబాద్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన పాకిస్థాన్ సైనిక వర్గాల్లో విషాదాన్ని నింపింది. ఈ ఆధునిక విమానం ఎంఐ17, ఇసిఎం8 కొత్త వెర్షన్ మిల్ మాస్కో హెలికాప్టర్ ప్లాంట్ ద్వారా నిర్మించారు. రష్యాలో తయారైన అత్యధిక బరువు మోసే రవాణా హెలికాప్టర్ ఇది.

# మీనాక్షి నామినేషన్ తిరస్కరణ ఉపసంహారించండి



సిఇసి జ్ఞానేష్‌కుమార్‌కు కాంగ్రెస్ వినతి

ఇసి చర్యలో చట్టపరమైన లోపముందని వాదన

ఒత్తిడితోనే ఆ నిర్ణయం : మీనాక్షి ఆరోపణ

**న్యూఢిల్లీ, జూన్ 10:** చట్టప్రకారం ఉనికిలో లేని ఒక క్రిమినల్ కేసు ఆధారంగా రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌ఒ) నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపిస్తూ, సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ బుధవారం ఎన్నికల కమిషన్ (ఇసి)ని కలిసింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం, ఇందులో అభ్యర్థి నటరాజన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అభిషేక్ సింఘ్వీ, జైరామ్ రమేష్, భూపేష్ బఘేల్, దీపా దాస్‌మున్షి, రణదీప్ సింగ్ సుర్జేవాలా కూడా ఉన్నారు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లను కలిసింది. ఎన్నికల అధికారి (ఆర్‌ఒ) నిర్ణయం చట్టబద్ధంగా నిలవదని, ఓటింగ్ జరగకముందే ఎన్నికల ప్రక్రియను వక్రీకరించిందని వారు వాదించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33ఎను ప్రస్తావిస్తూ, రెండేళ్లకు పైగా జైలు శిక్ష విధించదగిన క్రిమినల్ కేసులను, కోర్టు ఇప్పటికే అభియోగాలు నమోదు చేసిన కేసులను మాత్రమే అభ్యర్థులు వెల్లడించాల్సి ఉంటుందని సింఘ్వీ అన్నారు. నటరాజన్ కేసు ఆ దశకు చాలా దూరంలో ఉందని ఆయన అన్నారు. "మొదట విచారణకు స్వీకరించడం, ఆ తర్వాత దర్యాప్తు, ఆపై ఛార్జిషీట్, చివరకు అభియోగాలు నమోదు చేయడం జరుగుతుంది. అభియోగాలు నమోదు చేసిన తర్వాతే వివరాలు వెల్ల డించాలని చట్టం నిర్దేశిస్తుంది" అని ఆయన అన్నారు. ఇలాంటి కారణాలతో ఒక నామినేషన్‌ను తిరస్కరించడం అసమాన పోటీ వాతావరణాన్ని సృష్టిస్తుందని, ఒక అభ్యర్థికి ఎన్నికలలో పోటీ చేసే అవకాశాన్ని నిరాకరిస్తుందని కాంగ్రెస్ ఇసికి తెలిపింది. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతాన్ని ప్రభావితం చేస్తాయని ఆ పార్టీ వాదించింది. దీనిని ఒక తీవ్రమైన చట్టపరమైన లోపంగా అభివర్ణిస్తూ, దానిని సరిదిద్దడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద తన అధికారాలను ఉపయోగించాలని కూడా ఆ ప్రతినిధి బృందం కమిషన్‌ను కోరింది. రిటర్నింగ్ అధికారుల నిర్ణయాలను సమీక్షించేందుకు, రద్దు చేసేందుకు ఇసికి పూర్తి అధికారం ఉందని, ఎన్నికల పిటిషన్ల ద్వారా న్యాయపరమైన పరిష్కారాల కోసం అభ్యర్థులను సంవత్సరాల తరబడి వేచి ఉండేలా బలవంతం చేయకూడదని సింఘ్వీ అన్నారు. ఆర్‌ఒ ఉత్తర్వును "తీవ్రమైనది", "స్పష్టంగా చట్టవిరుద్ధమైనది" "చట్టబద్ధమైన అధికారం లేనిది"గా అభివర్ణిస్తూ, ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతాన్ని పునరుద్ధరించడానికి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను రద్దు చేయడానికి ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పేర్కొంది. ఆర్‌ఒ ఉత్తర్వు లోపభూయిష్టం: ఇసి అధికారులతో సమావేశం అనంతరం అభిషేక్ సింఘ్వీ మీడియాతో మాట్లాడుతూ, ఆర్‌ఒ ఆ ఉత్తర్వు ఎంత లోపభూయిష్టంగా ఉందంటే అది "రెండు ప్లస్ రెండు సమానం ఏడు" అని రాయడం లాంటిదని అన్నారు. తన నామినేషన్ పత్రాలలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసును వెల్లడించడంలో విఫలమైనందున నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని ఆయన అన్నారు. నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసు పెండింగ్‌లో లేదని సింఘ్వీ స్పష్టం చేశారు. ఒక ప్రైవేట్ ఫిర్యాదుపై ఎందుకు విచారణ చేపట్టకూడదో వివరించడానికి హాజరు కావాలని కోరుతూ ఆమెకు కేవలం కోర్టు నోటీసు మాత్రమే అందిందని ఆయన చెప్పారు. క్రిమినల్ చట్టం ప్రకారం, ఒక మేజిస్ట్రేట్ కేసును విచారణకు స్వీకరించిన తర్వాతే అది ఉనికిలోకి వస్తుందని ఆయన అన్నారు. "మేజిస్ట్రేట్ కేసును విచారణకు స్వీకరించలేదు. విచారణకు స్వీకరించకుండా, క్రిమినల్ కేసు ఉండదు. అందువల్ల, ఆమె వెల్లడించడానికి ఏమీ లేదు" అని సింఘ్వీ అన్నారు. రిటర్నింగ్ అధికారులపై ఒత్తిడితోనే: రిటర్నింగ్ అధికారులు ఒత్తిడికి లోనయ్యారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరించారని మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఇది కేవలం రాజకీయ దురుద్దేశం మాత్రమే. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు జరిగిన ప్రయత్నాలను నిన్న ప్రతి దశలోనూ తాము చూశామన్నారు.

# కాంగ్రెస్‌లో టిఎంసి విలీనం?

- సోనియాగాంధీతో మమత సమావేశం - మరుసటి రోజే రాహుల్‌తో అభిషేక్ భేటీ
- మమతకు మరో షాక్... రాజ్యసభకు, పార్టీకి సుస్మితా దేవ్ రాజీనామా
- తిరుగుబాటు శిబిరంలో చేరిన లోక్‌సభ ఎంపి సాయోని ఘోష్



**న్యూఢిల్లీ, జూన్ 10:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తేరుకుంటున్న మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్‌ను దాని మాతృ పార్టీ అయిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో విలీనం చేస్తారా? 1998 జనవరి 1న పార్టీని చీల్చి, 15 యేళ్లపాటు తాను కోరుకున్న విధంగా రాష్ట్రాన్ని పాలించిన ఫైర్‌బ్రాండ్ నాయకురాలి రాజకీయ వలయం ఇప్పుడు పూర్తయినట్లు కనిపిస్తోంది. 20యేళ్ల వయసులో కళాశాల విద్యార్థినిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, ఇటీవలి వరకు రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొన్న మమత, ఇప్పుడు 72 యేళ్ల వయసులో తాను ప్రయాణం మొదలుపెట్టిన చోటికే తిరిగి వెళ్తున్నట్లు కనిపిస్తోంది. 1976లో జైప్రకాష్ నారాయణ్ ప్రయాణిస్తున్న కారు ముందు దూకి తొలిసారిగా వెలుగులోకి వచ్చిన దీదీ, 1984లో సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు సోమనాథ్ ఛటర్జీని ఓడించి సంచలనం సృష్టించి మరోసారి వార్తల్లో నిలిచారు. సోనియాతో మమత భేటీ: ఇండియా బ్లాక్ సమావేశానికి హాజరైన అనంతరం, మమతా బెనర్జీ రాహుల్ గాంధీ సమక్షంలో సోనియా గాంధీ నివాసంలో ఆమెను కలిశారు. కాంగ్రెస్ అధినేత్రితో ఆమె విడిగా చర్చలు జరిపిన సరిగ్గా అదే సమయంలో, అరెస్ట్ వారెంట్‌తో సిఐడి ఆమె కోల్‌కతా నివాసానికి చేరుకోవడంతో ఈ పుకార్లు జోరుగా వ్యాపించాయి. బుధవారం మమత మేనల్లుడు, టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో సమావేశం అయ్యారు. దీంతో ఈ వార్తలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరుపక్షాలు విలీనం గురించి ఎలాంటి సూచనలు ఇవ్వనప్పటికీ, ఇటు ఢిల్లీలో అటు బెంగాల్‌లో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మమతకు షాక్‌ల మీద షాక్‌లు: 294 స్థానాలున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. అయితే, మమతా బెనర్జీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలలో సుమారు 62 మంది పార్టీని వీడారు, ఈ సంఖ్య ఇంకా పెరుగుతోంది. లోక్‌సభలో టిఎంసికి 29 మంది సభ్యులు ఉన్నారు. అయితే, వారిలో 20 మంది పార్టీ మారడానికి ఒక వర్గంగా ఏర్పడ్డారు. రాజ్యసభలో పార్టీకి 13 మంది సభ్యులు ఉన్నారు, వారిలో సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్ రాజీనామా చేశారు, మరికొందరు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారు. అయితే, అధిర్ రంజన్ చౌదరి వంటి సొంత రాష్ట్ర నాయకుల నుండి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో చౌదరిపై క్రికెటర్ యూసుఫ్ పఠాన్‌ను పోటీకి దింపడం ద్వారా మమతా బెనర్జీ ఆయన రాజకీయ జీవితాన్ని ముగించారని ఆరోపణలు ఉన్నాయి.

# ప్రధాని మోడీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ శుభాకాంక్షలు



**రోమ్,జూన్ 10:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ బుధవారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. భారత చరిత్రలో అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానిగా మోడీ నిలవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు మోడీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె తన సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. బుధవారం నాటికి ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్న మోడీ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించారు. భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచిన నరేంద్ర మోడీకి అభినందనలు. ఇటీవల రోమ్‌లో మరోసారి మిమ్మల్ని కలవడం సంతోషాన్నిచ్చింది. మన దేశాలు, మన ప్రజల కోసం భవిష్యత్తులో కొత్త అవకాశాలు సృష్టించేలా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది అని మెలోనీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. గత నెల మేలో ప్రధాని మోడీ ఇటలీలో రెండు రోజుల పాటు పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో ఆయన ఇటలీ ప్రధాని మెలోనీ, అధ్యక్షుడు సెర్గియో మట్టరెల్లాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచాలని నిర్ణయించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విద్య, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని నేతలిద్దరూ అంగీకరించారు.

## సంక్షిప్తంగా..

### బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై ఐఆర్జీసి దాడులు!

**టెహ్రాన్,జూన్ 10:** ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అమెరికా నేవీ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై మిస్సైల్, డ్రోన్ దాడులు చేసినట్లు ప్రకటించింది. ఇది యూఎస్ దాడులకు ప్రతీకారంగా జరిగినట్లుఐఆర్జీసీ తెలిపింది. యూఎస్ దళాలు ఖేష్మ్ ద్వీపం సమీపంలో ఇరాన్ టెలికమ్యూనికేషన్స్ టవర్‌పై, స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ సమీపంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్‌పై దాడి చేశాయని ఐఆర్జీసీ చెప్పింది. ఇందుకు ప్రతిగా బహ్రెయిన్‌లోని 5వ ఫ్లీట్ హెడ్‌క్వార్టర్స్, ప్రాంతీయ ఎయిర్‌బేస్‌లు, హెలికాప్టర్ బేస్‌లపై దాడులు జరిపినట్లు ప్రకటించింది. బహ్రెయిన్‌లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగాయని, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత పెరిగిందని నివేదికలు వచ్చాయి. యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ క్లెయిమ్‌లను తప్పు అని తోసిపుచ్చింది.

### ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి ఇద్దరు సైనికులు మృతి



**శ్రీనగర్,జూన్ 10:** ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలిన ఘటనలో ఇద్దరు భారత జవాన్లు దుర్మరణం పాలయ్యారు. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్లోగల కమాల్‌కోట్ సైనిక శిబిరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శిబిరంలోని సైనికులు ఆయుధ పరికరాలను ఒకరి నుంచి మరొకరికి అప్పగిస్తున్న సమయంలో గ్రెనేడ్ అకస్మాత్తుగా పేలింది.

ఈ పేలుడు ధాటికి ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే సైన్యానికి చెందిన 92 బేస్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, వారు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

### జోహాన్స్‌బర్గ్‌లో కాల్పులు, 12 మంది మృతి

**జోహాన్స్‌బర్గ్, జూన్ 10:** దక్షిణాఫ్రికాలోని జోహాన్నెస్‌బర్గ్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఈ ఘటనలో 12 మంది మరణించారు. ఈ ఘటన తూర్పు జోహాన్నెస్‌బర్గ్‌లోని, క్లీవ్‌ల్యాండ్‌లో ఉన్న జంపర్స్ ఇన్‌ఫార్మల్ సెటిల్‌మెంట్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సెటిల్‌మెంట్ ఏరియాలోకి పది మంది వరకు దుండగులు టొయోటా వాహనంలో వచ్చారు. ఆయుధాలు కలిగిన ఈ దుండగులు అక్కడ ఉన్న వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ సెటిల్‌మెంట్ పరిధిలోని రెండు యాక్సెస్ పాయింట్లను ఎంచుకుని,

అక్కడి నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పో యారు. మరో 9 మంది గాయపడ్డారు. కాల్పుల అనంతరం దుండగులు అక్కడినుంచి పారిపోయారు.

### దర్గా ఉన్నంత మాత్రాన వక్ఫ్ ఆస్తిగా పరిగణించలేం: మద్రాస్ హైకోర్టు

**చెన్నై, జూన్ 10:** కేవలం దర్గా లేదా సమాధి ఉండటం వల్ల ఆ భూమి వక్ఫ్ ఆస్తిగా పరిగణించలేమని మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వక్ఫ్ హోదా పొందాలంటే ముస్లిం వ్యక్తి ఆస్తిని శాశ్వతంగా మత, ధార్మిక లేదా దాతృత్వ కార్యక్రమాల కోసం అంకితం చేసినట్లు చట్టబద్ధమైన ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. చెన్నైలోని ట్రిప్లికేన్ ప్రాంతంలో ఉన్న 240 ఏళ్ల చరిత్ర కలిగిన సర్కార్ సయ్యద్ హబీబుల్లా షా ఖాదరీ ఆరిఫ్ రబ్బానీ హజ్రత్ దర్గాకు కొత్త ముతవల్లీని నియమిస్తూ వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని జస్టిస్ కె.జి. తిలకవాడి రద్దు చేశారు. దర్గాకు ముత వల్లీగా వ్యవహరిస్తున్నానని వ్యక్తి కోర్టును ఆశ్రయించారు.

### కెనడాలో భారత సంతతి పోలీస్ అధికారి మృతి



**ఒంటారియో,జూన్ 10:** కెనడాలో భారత సంతతికి చెందిన ఒక పోలీస్ అధికారి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. ఒంటారియో ప్రావిన్షియల్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ తరుణ్ బాలి, మంగళవారం ఒక దర్యాప్తు సందర్భంగా తీవ్రంగా గాయపడి మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒంటారియోలోని హియర్స్ సమీపంలో ముందురోజు మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. కెండల్ కన్సెషన్ రోడ్ 7, కన్సెషన్ రోడ్ 6 వద్ద అధికారులు ఒక కేసు దర్యాప్తు చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన తరుణ్ బాలిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. రెండున్నరేళ్ల సర్వీసు ఉన్న తరుణ్ బాలి, డఫెరిన్ డిటాచ్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

# ఉత్తర ఐర్లాండ్‌లో భారీ విధ్వంసం - చెలరేగిన ముసుగువీరులు



**బెల్‌ఫాస్ట్,జూన్ 10:** ఉత్తర ఐర్లాండ్ రాజధాని బెల్‌ఫాస్ట్‌లో హింసతో అట్టుడికింది. ముసుగులు ధరించిన ఆందోళనకారులు చెలరేగిపోయారు కార్లు, నివాసాలను టార్గెట్‌గా చేసుకుని తగలబెట్టారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు దగ్ధం కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. వలసదారులను లక్ష్యంగా చేసుకుని ఈ అల్లర్లు చెలరేగాయి. భారీ సంఖ్యలో నిరసనకారులు రోడ్లపైకి వచ్చి బీభత్సం సృష్టించారు. కత్తిపోటు ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బెల్‌ఫాస్ట్‌లో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ ఘటనలకు సూడాన్ దేశస్థుడే కారణంగా తెలుస్తోంది. కత్తితో వీరంగం సృష్టించాడు. ఒక వ్యక్తిని కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అయ్యింది. దీంతో ముసుగు ధరించిన వ్యక్తులు రోడ్లపైకి వచ్చి వీరంగం సృష్టించారు. కార్లు, ఇళ్లు తగలబెట్టారు. ఇక కత్తిపోటు కేసులో సూడాన్‌కు చెందిన 30 ఏళ్ల హాది అలోడిడ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. హత్యాయత్నం కేసులో అతడిని కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్‌కు తరలించింది. ఈ దాడిలో బాధితుడు ఒక కన్ను కోల్పోయినట్లు, ముఖం, వెన్నుపైన తీవ్ర గాయాలు అయినట్లు కోర్టులో వెల్లడైంది. సోషల్ మీడియా వేదికగా హింసాత్మక నిరసనలకు పిలుపు ఇవ్వడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఆగ్రహంతో వీధుల్లోకి వచ్చిన గుంపులు పలు ప్రాంతాల్లో పోలీసులపై రాళ్లు రువ్వి, వాహనాలు, బస్సులకు నిప్పంటించారు. కొన్ని కుటుంబాలు తమ ఇళ్లలో చిక్కుకుపోగా, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుని వారిని సురక్షితంగా బయటకు తరలించారు. అనేక కార్లు పూర్తిగా కాలిపోయాయి. స్థానిక రాజకీయ నాయకులు, మతపెద్దల ప్రకారం దాడులకు గురైన వారిలో ఎక్కువ మంది నల్లజాతీయులు, వలసదారులే ఉన్నట్లు తెలుస్తోంది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా స్పందిస్తూ. ప్రజలను వారి జాతి, నేపథ్యం కారణంగా లక్ష్యంగా చేసుకోవడం అస్సలు సహించం. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్రిటన్‌లో వలసదారుల అంశంపై వివాదాలు పెరుగు తున్నాయి. ఆశ్రయం విధానాల కారణంగా ప్రమాదకర వ్యక్తులు దేశంలోకి ప్రవేశిస్తున్నారంటూ కొన్ని పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి.

# బెంగాల్‌లో మంత్రులకు పోర్టుఫోలియోలు కేటాయింపు!

**కోల్‌కత్తా,జూన్ 10:** పశ్చిమబెంగాల్‌లో మంత్రులకు శాఖలు కేటాయించారు. సీఎం సువేందు అధికారి హోంశాఖను తన వద్దే ఉంచుకున్నారు. గతంలో ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం గడిపి, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మంత్రి పదవి దక్కించుకున్న కలితా మాఝికి గృహనిర్మాణ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. బెంగాల్ ఎన్నికల్లో తూర్పు వర్ధమాన్ జిల్లా ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి కలితా టీఎంసీ అభ్యర్థిపై 12,535 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మరోవైపు జర్నలిస్ట్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన స్వపన్ దాస్‌గుప్తాకు ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు కట్టబెట్టారు. ఇక మిగతావాళ్లలో తపస్ రాయ్‌కి పరిశ్రమలు, వాణిజ్య శాఖలు అప్పగించారు. దిలీప్ ఘోష్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలను కట్టబెట్టారు. ఇక సీనియర్ నాయకురాలు అగ్నిమిత్ర పాల్‌కు పట్టణాభివృద్ధి, పురపాలక వ్యవహారాల శాఖల బాధ్యతలు అప్పజెప్పారు. డాక్టర్ శరద్వత్ ముఖర్జీకి ఆరోగ్య శాఖ కేటాయించారు. జగన్నాథ్ ఛటోపాధ్యాయకు ఉన్నత విద్యాశాఖ. దూద్ కుమార్ మండల్‌కు వ్యవసాయ శాఖ బాధ్యతలు అప్పగించారు. దీపక్ బర్మన్‌కు పాఠశాల విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టారు. శంకర్ ఘోష్‌కు పర్యాటక, పార్లమెంటరీ వ్యవహారాల శాఖలు అప్పగించారు. అర్జున్ సింగ్‌కు కార్మిక శాఖ, రవాణా శాఖలను కట్టబెట్టారు. ఇంద్రనీల్ ఖాన్‌కు క్రీడలు, యువజన, వినియోగదారుల వ్యవహారాల శాఖలను కేటాయించారు.

# అఫ్ఘాన్‌పై పాక్ బాంబుల వర్షం - నిద్రలోనే 11 మంది చిన్నారులు మృతి



**ఇస్లామాబాద్, జూన్ 10:** అఫ్ఘానిస్థాన్-పాకిస్థాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. అర్ధరాత్రి వేళ.. అఫ్ఘాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై పాక్ బాంబులతో విరుచుకుపడింది. ఈ ఘటనలో 11 మంది చిన్నారులు నిద్రలోనే కన్నుమూశారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌లలోని పౌర నివాసాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు అఫ్ఘాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. సెర్పా జిల్లాలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలోనే 9 మంది చనిపోయారని, మరో 10 మంది గాయపడ్డారని ఖోస్ట్ ప్రావిన్స్‌కు చెందిన అధికారి తెలిపారు. పక్తికా ప్రావిన్స్‌లోని బర్మల్ జిల్లాలో జరిగిన మరో దాడిలో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిన్నారులేనని స్థానికులు తెలిపారు. బాధితులు నిద్రిస్తున్న సమయంలో ఈ దాడులు జరగడంతో.. వారు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ దాడి ఘటనలో మొత్తం 11 మంది చిన్నారులతో సహా ఓ మహిళ, ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడగా.. వారిలో అనేకమంది మహి ళలు, చిన్నారులో ఉన్నారు. మృతి చెందిన చిన్నారుల ఫొటోలను జబి హుల్లా ఎక్స్‌లో పంచుకున్నారు. కాగా.. ఈ దాడుల విషయంపై పాక్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అఫ్ఘాన్ సరిహద్దులోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని ఓ సెక్యూరిటీ పోస్టుపై ఇటీవల దాడి జరిగింది. తాలిబన్ మిలిటెంట్లు ఈ దాడి చేసినట్లు పాక్ అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

11-6Pg6exHMNWJQE.qxd:11-6Pg6exHMNWJQE.qxd 1/1/02 5:55 AM Page 1



# 15 గిగావాట్ల డేటా సెంటర్ విద్యుత్ అవసరాలకు సమగ్ర ప్రణాళిక

## • దేశ డిజిటల్ భవిష్యత్తుకు శక్తివంతమైన విద్యుత్ మౌలిక వసతుల కల్పనకు ఎపి శ్రీకారం • సిఎంఒ, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ • విశాఖపట్నం గ్లోబల్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా అవతరణ

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యాధునిక, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విద్యుత్ ప్రసార (ట్రాన్స్ మిషన్) రోడ్ మ్యాప్ రూపొందించిందని ఎపి సిఎంఒ, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. ఈ చర్యలతో ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక వసతుల పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మరింత బలోపేతమవు తోందన్నారు. విశాఖపట్నం, పరిసర ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌కు మద్దతు అందించేందుకు ఈ చర్యలు ఉపకరిస్తాయని వివరించారు. బుధవారం విద్యుత్ సౌధ నుండి ఎపి ట్రాన్స్‌కో, ఐటి, ఎపిఐఐసి అధికారులతో విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, మాట్లాడుతూ, హైపర్‌స్కేల్ డేటా సెంటర్లు, కృత్రిమ మేధస్సు (ఎఐ) మౌలిక వసతులు, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాలు, తదుపరి తరం డిజిటల్ సేవలను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ప్రపంచ ప్రముఖ సాంకేతిక సంస్థలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయని తెలిపారు. గతంలో పారిశ్రామిక వృద్ధికి ఓడరేవులు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు ఎంత కీలక పాత్ర



పోషించాయో, భవిష్యత్తులో డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు డేటా సెంటర్లు అంతే కీలకమైన వెన్నెముకగా నిలుస్తాయని అంచనా వేస్తున్నామని, ఈ రంగంలో అవసరమైన ప్రపంచ స్థాయి విద్యుత్ మౌలిక వసతులను ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రేపటి అవకాశాల కోసం నేటి నుంచే సిద్ధమవుతోందని చెప్పారు. కేవలం విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం మాత్రమే కాకుండా దానికంటే ముందుండి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విశాఖపట్నం ప్రాంతం ఇప్పటికే గూగుల్, రిలయన్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (హైపర్ వాల్ట్), సిటిఆర్ఎల్ఎస్, జిఎంఆర్ వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి పెట్టుబడి ప్రతిపాదనలను ఆకర్షించిందని, దీంతో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక వసతుల క్లస్టర్లలో ఒకటిగా విశాఖపట్నం అవతరిస్తోందని ఆయన వివరించారు.

ఎపి ట్రాన్స్‌కో అంచనాల ప్రకారం ప్రస్తుతం ఈ ప్రాంతంలో 16 ప్రధాన డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటి విద్యుత్ లోడ్ ఏర్పడనుందని, అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ నిర్వహణ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటే, 2036-37 ఆర్థిక సంవత్సరం నాటికి మొత్తం విద్యుత్ డిమాండ్ దాదాపు 15 గిగావాట్లకు చేరుకోనుందని ఆయన తెలిపారు. ఈ అవసరాలను తీర్చేందుకు ఎపి ట్రాన్స్‌కో దశలవారీగా అమలు చేసే సమగ్ర విద్యుత్ ప్రసార వ్యూహాన్ని రూపొందించిందని, ఇందులో పెందుర్తి, మరాడం, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవరిపాలెం వంటి కీలక సబ్‌స్టేషన్లను అనుసంధానించే 765 కెవి, 400 కెవి, 220 కెవి ప్రసార వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ నెట్వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకు పైగా స్థిరమైన డేటా సెంటర్ లోడ్‌ను సమర్థవంతంగా అమలు చేసేలా, భవిష్యత్ విస్తరణకు అనువుగా రూపకల్పన చేయబడిందని ఆయన తెలిపారు.

ఈ ప్రణాళికలో ప్రధానంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడ ప్రతిపాదిత భారీ పెట్టుబడులకు మద్దతుగా కొత్త 400/220 కెవి సబ్‌స్టేషన్‌తో పాటు అధిక సామర్థ్యమున్న ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు విజయానంద్ తెలిపారు. తార్లువాడ, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న డేటాసెంటర్ కేంద్రాలకూ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి అని, బలమైన, విస్తరించ గల, భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేవిధంగా ఉండే విద్యుత్ ప్రసార వ్యవస్థను నిర్మించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రేపటి ఆవిష్కరణలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు పునాది వేస్తోందన్నారు. ఆసియాలోనే అత్యంత ప్రాధాన్యమున్న డిజిటల్ మౌలిక వసతుల గమ్యస్థానాల్లో ఒకటిగా ఎపిని నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అని ఆయన తెలిపారు.

---

## నిధి పేరోల్ అప్లికేషన్‌లో మైగ్రేషన్, ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తిచేయాలి

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు తమ పరిధిలోని సంస్థల్లో నిధి పేరోల్ అప్లికేషన్‌లో మైగ్రేషన్, ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తిచేయాలని ఆర్థికశాఖ కార్యదర్శి వాడ్రేవు వినయ్‌చంద్ ఆదేశించారు. సమస్యలున్న శాఖలు వెంటనే ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందేలా అన్ని శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. నిధి పేరోల్ అప్లికేషన్‌లో అన్ని కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, తాత్కాలిక ఉద్యోగుల వివరాలను నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని శాఖలు ఆ ప్రక్రియను పూర్తి చేయలేదని ప్రభుత్వం గుర్తించింది. పోస్టుల కొనసాగింపునకు సంబంధించిన ఉత్తర్వులు లేకపోవడం, మంజూరు ఉత్తర్వుల ప్రతులు అందుబాటులో లేకపోవడం, రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి కేటాయించిన పోస్టుల సంఖ్యపై స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో ప్రక్రియ ఆలస్యమవుతోందని పేర్కొంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖాధిపతులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ జాప్యం వల్ల కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు తమకు రావాల్సిన వేతనాలకు దూరమవుతున్నారని, ఇది ప్రభుత్వ దృష్టిలో ఆందోళనకరమైన అంశమని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అలాగే ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్, ఎపిసిఎఫ్ఎస్ఎస్ సిఇఒ అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని ఆదేశించారు. సిఎఫ్ఎంఎస్ ద్వారా సమర్పించే వేతన బిల్లులను అత్యవసర ప్రాతిపదికన ప్రాసెస్ చేసి ఉద్యోగులకు ఎటువంటి జాప్యం లేకుండా వేతనాలు అందేలా చూడాలన్నారు.

---





## అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.2,460 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు

**15.8 టన్నుల బియ్యంతో మహాయజ్ఞంలా కొనసాగుతున్న అన్నప్రసాద**

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిత్యం మహా యజ్ఞంలా కొనసాగుతోంది. దేశ విదేశాల నుండి తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తూ టిటిడి సేవాభావానికి ప్రతీకగా నిలుస్తోంది. 1985 ఏప్రిల్ 6న ప్రారంభమైన నిత్య అన్నదాన పథకం ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో నిర్వహించబడుతోంది. సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుండగా, వారాంతాల్లో ఈ సంఖ్య 3 లక్షల వరకు ఉంటుంది. గత మూడు నెలల సగటు గణాంకాల ప్రకారం రోజుకు సుమారు 70 వేల మందికి పాలు, టీ, కాఫీ వంటి పానీయాలు అందిస్తున్నారు. అలాగే 60,200 మందికి అల్పాహారం, 99,500 మందికి మధ్యాహ్న భోజనం, 56,700 మందికి రాత్రి భోజనం వడ్డిస్తున్నారు. ఇలా రోజుకు దాదాపు 3 లక్షల మందికి సేవలందిస్తున్నారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో రోజుకు 82వేల మందికి పైగా భోజనాలు అందుతుండగా, అక్షయ కిచెన్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్ల వెలుపల ఏర్పాటు చేసిన కేంద్రాలు, టిటిడి అన్నప్రసాద భవనాలు తదితర ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులకు ఆహారం, పానీయాలు అందిస్తున్నారు. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం వినియోగిస్తున్నారు. 3,110 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 1,729 కిలోల మినప్పప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 497 కిలోల చింతపండు, రోజుకు 4,375 కొబ్బరికాయలు, 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 209 కిలోల ధనియాలు తదితర ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నారు.

**ఐదునెలల్లో 4.40 కోట్లకు పైగా సర్వింగ్స్**

2026 జనవరి నుండి మే 31 వరకు తిరుమలలోని వివిధ అన్నప్రసాద కేంద్రాల ద్వారా మొత్తం 4.40 కోట్ల సర్వింగ్స్ భక్తులకు అందించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో జనవరిలో కోటి, ఫిబ్రవరిలో 71.39 లక్షలు, మార్చిలో 84.85 లక్షలు, ఏప్రిల్‌లో 85 లక్షలు, అలాగే మే నెలలో 92 లక్షలకు పైగా భక్తులకు అన్నప్రసాదం, అల్పాహారం, పానీయాలు అందించారు. అన్నప్రసాదం నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు టిటిడి పలు ఆధునిక చర్యలు చేపట్టింది. చట్నీలు, కూరల తయారీలో తాజా కొబ్బరికాయల వినియోగాన్ని ప్రవేశపెట్టింది. 2024లో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ప్రారంభించి అదనంగా 28 ప్రాంతాలకు ఆహార పంపిణీ సేవలను విస్తరించింది.

రోజుకు 2 లక్షల మంది భక్తులకు ఆహారం తయారు చేయగల సామర్థ్యంతో కొత్త శాటిలైట్ ఆటోమేటెడ్ కిచెన్ నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయి. భక్తుల విరాళాలతో నిర్వహించబడుతున్న వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ వద్ద ప్రస్తుతం రూ.2,500 కోట్లలకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తూ టిటిడి 'అన్నదానం మహాదానం' అనే భారతీయ సనాతన సంప్రదాయాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తోంది.

---

## తిరుమల అన్నప్రసాదంలో అదనంగా 'పప్పు' మెనూ!

### • భక్తుల అభిప్రాయాలతో బోర్డు నిర్ణయం దిశగా అడుగులు



**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** 'గోవిందా... గోవింద' నామస్మరణతో దేశవిదేశాల నుండి ఏడుకొండలస్వామి దర్శనార్థం లక్షలాదిగా తరలివస్తున్న శ్రీవారి భక్తులకు ఆకలి అనే మాట వినిపించకుండా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదంలో త్వరలో 'పప్పు' మెనూ చేర్చేందుకు టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఇందుకోసం ఈ పప్పు చేర్చడానికి అవకాశాలు పరిశీలించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం తిరుమలలో రైస్‌మిల్లర్ల, పప్పులు సరఫరా చేసే వ్యాపారులతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఈ విషయంగా చర్చించడం ఇప్పుడు అన్నప్రసాదంలో పప్పు మెనూ చేరనుంది. దీనికోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నప్రసాదం విభాగం అధికారులను ఆయన ఆదేశించడం చర్చకు తావిచ్చింది. భక్తుల అభిప్రాయ సేకరణలో కొందరు అన్నప్రసాదంతోబాటు అదనంగా పప్పును కూడా వడ్డిస్తే మరింత బాగుంటుందని భక్తులు సూచించడం ఆ దిశగా టిటిడి అధికారులు కార్యాచరణ రూపొందించడం జరుగుతోంది.

'అన్నం పరబ్రహ్మ స్వరూపం'గా భావిస్తూ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్నప్రసాదాలు అందిస్తున్న విషయం తెలిసిందే. రోజువారీగా 1.60లక్షల మంది నుండి 2లక్షల మంది వరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం విశేషం. అన్నప్రసాదంలో అదనంగా మసాలవడ అందిస్తుండటం, అన్నప్రసాదాల నాణ్యత వందశాతం మెరుగుపడటంతో ధనవంతులైన భక్తుల నుండి సామాన్యభక్తుల వరకు అన్నప్రసాదాలను దేవుని ప్రసాదంగా భావించి స్వీకరిస్తున్నారు. తిరుమలలో నిరంతరాయంగా ఉదయం 8.30గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెర పొంగలి, తాలింపు(కర్రీ)ని, మసాలవడ రుచికరంగా వడ్డిస్తున్నారు. రానున్న రోజుల్లో పప్పు కూడా చేరనుంది. ఒక లక్ష నుండి 1.40లక్షల మంది వరకు భక్తులు ప్రతిరోజూ అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు టిటిడి అధికారుల అంచనా. దాతలు కూడా అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరివిగా విరాళాలందిస్తున్నారు. ప్రస్తుతం రూ.2,500 కోట్ల రూపాయల పైగానే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు నిధులు డిపాజిట్లు రూపంలో ఉన్నాయి. దీని ద్వారా వచ్చే వడ్డీతోనే ప్రతిరోజూ తిరుమలలో భక్తులకు నాణ్యమైన రుచికరంగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్నారు. తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు అన్నప్రసాదాలను భక్తివిశ్వాసంతో స్వీకరిస్తున్నారు. రోజువారీగా 14 టన్నుల బియ్యం, 8టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు. దాతలు కూడా రోజుకు 44లక్షలు రూపాయలు విరాళమిస్తే వారి పేరున అన్నప్రసాదాలు భక్తులకు వడ్డిస్తున్నారు. ఉదయం అల్పాహారం 12లక్షలు, మధ్యాహ్నం, రాత్రి భోజనం 32లక్షలు రూపాయలు వ్యయమవుతోంది. ఇప్పుడు అదనంగా మెనూలో పప్పు చేర్చినా భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తారు.

---

## 22న వైభవంగా పుష్పయాగ మహోత్సవం

### • సుగంధ పుష్పాలతో స్వామివారికి విశేష ఆరాధన

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 22న పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 21న సాయంత్రం 5.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, పుష్పయాగ అంకురార్పణ కార్యక్రమాలు జరగనున్నాయి. 22న ఉదయం 9.30గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించగా, మధ్యాహ్నం 1గంట నుండి సాయంత్రం 4గంటల వరకు పుష్పయాగం ఘనంగా జరుగుతుంది. ఈ సందర్భంగా వివిధ రకాల సుగంధ పుష్పాలు, పవిత్ర పత్రాలతో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు వీధి ఉత్సవం వైభవంగా జరగనుంది. లోప పరిహారార్థం పుష్పయాగం వార్షిక బ్రహ్మోత్సవాలు, నిత్యకైంకర్యాల నిర్వహణలో అర్చకులు, పరిచారకులు, అధికారులు, భక్తుల వల్ల తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ పుష్పయాగాన్ని నిర్వహిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.

---




## తిరుపతిలో టిడిఆర్ బాండ్ల అక్రమాల్లో నోటీసులు

### • రాజకీయ ప్రకంపనలు

**తిరుపతి, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** గత వైసిపి ప్రభుత్వంలో తిరుపతి స్మార్ట్‌సిటీలో మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి వెనుక భారీగా కుంభకోణం జరిగిందనేది సంచలనం మారింది. తిరుపతిలో రూ.414 కోట్ల మేరకు టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో అధికారులు పాత్ర, గత వైసిపి పెద్దలు, నగరపాలక కౌన్సిల్ పాత్ర ఉందని ప్రభుత్వానికి అందిన నివేదికలు. ఈ నివేదికలు ఇప్పుడు సంచలనం కలిగిస్తున్నాయి. తిరుపతి నగరంలో గత వైసీపీ హయాంలో టిడిఆర్ బాండ్ల కుంభకోణం న్యాయ, రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ పేరుతో 2020-24 మధ్య రూ.414 కోట్ల మేర భారీ దోపిడీ జరిగినట్లు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్ధారించారు. వైసిపి సీనియర్ నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు, తిరుపతి మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డిలు ఈ స్కామ్‌లో ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు విజిలెన్స్ నివేదికలో తేలింది.

మాస్టర్ ప్లాన్ పేరుతో తిరుపతి నగరాభివృద్ధి కోసం రోడ్లను అడ్డం పెట్టుకుని భూమన కుటుంబం కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టినట్లు అధికారులు ఆధారాలతో సహా గుర్తించారు. సామాన్యులకు సంబంధించిన సాధారణ ఇళ్ల స్థలాలను రికార్డుల్లో రాత్రికి రాత్రే భారీ విలువైన వాణిజ్య భూములుగా మార్చేశారనేది విజిలెన్స్ నివేదికలు. దీనివల్ల ఆ భూములకు మార్కెట్ ధర కంటే వందల రెట్లు ఎక్కువ విలువ వచ్చేలా చూసి, తప్పుడు లెక్కలతో భారీ మొత్తంలో టిడిఆర్ బాండ్లను సృష్టించారనేది నివేదికల్లో సారాంశం. తాము చెప్పిన ధరకే భూములు రాసివ్వాలని, లేదంటే ఇళ్లు కూల్చేస్తామంటూ బెదిరించి ల్యాండ్ మాఫియా తరహాలో దందా సాగించారనేది పేర్కొన్నారు. ఈ భారీ స్కామ్‌లో నగరపాలక సంస్థ, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన అధికారులు కీలక పాత్ర పోషించారని విజిలెన్స్ తేల్చింది.

గత వైసిపి హయాంలో పనిచేసిన నలుగురు మున్సిపల్ కమిషనర్లపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేశారు. తప్పుడు డాక్యుమెంట్లను కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్ చేసిన ఆరుగురు సబ్ రిజిస్ట్రార్లపై విచారణకు ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ (పట్టణ ప్రణాళిక) విభాగంలో అవినీతికి పాల్పడిన 20 మంది సిబ్బందిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. మరీ రానున్న రోజుల్లో ఈ కేసు ఎక్కడకు దారితీస్తుందనేది మాత్రం సంచలనంగా మారింది.

---

## మోడీ నేతృత్వంలో దేశం శక్తివంతం

### • డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ సేవలో ప్రధాని మోడీ 4,399 రోజుల పాలన పూర్తి అయ్యిందని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ, మోడీ సేవలను కొనియాడారు. 'మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం.. దేశానికే అంకితమైన జీవితం' అని అన్నారు. దేశానికి నిస్వార్థ సేవ చేస్తున్న ప్రధానమంత్రి మోడీ, ఎన్‌డియే ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గత 12యేళ్లలో ఎన్‌డియే ప్రభుత్వం ప్రధాని మోడీ నాయకత్వంలో భారత్‌ను బలమైన దేశంగా తీర్చిదిద్దిందని అన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశ భద్రత మరింత పటిష్ఠమైందని, ఆధునీకరణ దిశగా భారత సాయుధ దళాలకు కొత్త శక్తి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌కు కీలక స్థానం లభించిందని, జి20 సమ్మిట్ విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రపంచ దృష్టి భారత్ వైపు మళ్లిందని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్‌కు బలమైన స్వరంగా భారత్ ఎదిగిందని వ్యాఖ్యానించారు.

డిజిటల్ ఇండియా విప్లవం ద్వారా ప్రజలకు సేవలు చేరువయ్యాయని పవన్ అన్నారు. జనధన్, ఆధార్- మొబైల్ అనుసంధానంతో పారదర్శక పాలన సాధ్యమైందని చెప్పారు. యుపిఐ, డిబిటి వ్యవస్థలతో డిజిటల్ చెల్లింపులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కింద కోట్ల మందికి వైద్య భరోసా లభిస్తోందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు సొంత ఇళ్ల కల సాకారమవుతోందని పవన్ ప్రస్తావించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు సదుపాయం కల్పించారన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల్లో భారీ అభివృద్ధి సాధించారని చెప్పారు. వందే భారత్ రైళ్లతో రవాణా రంగంలో కొత్త శకం మొదలైందని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రధాని మోడీ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వికసిత భారత్ 2047 సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామ్యం వహిస్తుందన్నారు. భిన్నత్వమే భారతదేశ బలమని, భాషలు భారత గర్వకారణమన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటామని, విభజన శక్తులను ధీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. జై హింద్.. జై భారత్ అంటూ పవన్ కళ్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

---



## 'మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై అగ్రస్థానంలో నిలుస్తోంది'

### తిరుపతిలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు

**తిరుపతి, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దైవానుగ్రహం, ప్రజల ఆశీస్సులతో మరింత కాలం దేశానికి నాయకత్వం వహించి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ తిరుపతిలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానమంత్రిగా అత్యధిక కాలం 12 సంవత్సరాల పాలన సాగించిన నేతల్లో ఒకరిగా నరేంద్ర మోడీ రికార్డు సృష్టించిన సందర్భంగా దేశవ్యాప్తంగా బిజెపి శ్రేణులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తిరుపతిలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దకాపు వీధిలోని శ్రీరామ భజన మందిరంలో సీతారాముల వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆయురారోగ్యాలు, శక్తి, ధైర్యం, మనోబలం ప్రసాదించి దేశసేవకు మరింతకాలం అవకాశం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై తన ప్రత్యేకతను చాటుకుంటోందని అన్నారు. దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెంపులో ప్రభుత్వం విశేష కృషి చేసిందని పేర్కొన్నారు. భజన అనంతరం విచ్చేసిన భక్తులకు భజన కళాకారులకు శ్రీవారి లడ్డు ప్రసాదాలు, అన్నప్రసాదాలు వితరణ చేశారు.

---

## ప్రధాని మోడీకి మంత్రి లోకేష్ శుభాకాంక్షలు

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానిగా వరుసగా ఎన్నికై, అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును సాధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి హృదయపూర్వక శుభాకాంక్షలంటూ 'ఎక్స్' వేదికగా మంత్రి లోకేష్ వ్యాఖ్యానించారు. మన దేశ తొలి ప్రధానమంత్రి నెహ్రూని అధిగమించి మోడీ నెలకొల్పిన ఈ రికార్డు అనితరసాధ్యం. 12యేళ్ల పాలనలో నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలో అజేయశక్తిగా సగర్వంగా నిలిపింది. ప్రజలకు అవకాశాలు, గౌరవం కల్పించడం, స్వావలంబన, సాధికారత దిశగా దేశాన్ని నడిపించిన మోడీ సమర్థ నాయకత్వానికి జేజేలని పేర్కొన్నారు.

---

## కార్మిక సంఘాలపై డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ వ్యాఖ్యలు ఆక్షేపణీయం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య



**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించే క్రమంలో కార్మిక సంఘాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయమని సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఆరోపించారు. బాధిత కుటుంబాల తరఫున నిలబడుతున్న యూనియన్ నాయకులను తూలనడటం సమంజసం కాదని పేర్కొన్నారు. కార్మిక సంఘాలు రాజకీయాలు చేస్తున్నాయంటూ పవన్ కళ్యాణ్ చౌకబారు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే స్టీల్ ప్లాంట్లో ప్రమాదం జరిగిందని నిలదీసిన కార్మిక సంఘాలకు మంత్రి నారా లోకేష్ సమాధానం చెప్పకుండా, మీ కుటుంబంలో ఎవరూ చనిపోలేదు కదా? అంటూ కార్మికసంఘాల నేతల్ని ఉద్దేశించి వెటకారంగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. ఘోర ప్రమాదంపై స్టీల్ ప్లాంట్ యాజమాన్యం బాధ్యతారహితంగా వ్యవహరిస్తుందని, కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నదని తెలిపారు. స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే ఇంతటి పెద్ద ప్రమాదం జరగడం మునుపెన్నడూ లేదని, ఇది ముమ్మాటికీ డబుల్ ఇంజన్ సర్కార్ ప్రైవేటీకరణ విధానాలు, యాజమాన్య నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదమేనని ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

---

## పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో పలువురికి పదోన్నతులు

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో ఐదుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 ప్యానెల్ సంవత్సరానికి సంబంధించిన ఉద్యోగోన్నతుల జాబితాలో భాగంగా ఎన్ఆర్ రాజశేఖర్, జి.మధుప్రకాష్ రెడ్డి, ఇ.భాస్కర్, జి.వెంకటరత్నం, జివి సత్యనారాయణకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హోదాలో ఉద్యోగోన్నతి లభించింది. ఈ ఉద్యోగోన్నతులు సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996లోని రూల్ 10(ఎ) ప్రకారం తాత్కాలిక, అడ్హాక్ ప్రాతిపదికన మంజూరు చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కోర్టులు లేదా ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల తుది తీర్పులకు లోబడి ఈ ఉద్యోగోన్నతులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగోన్నతి పొందిన అధికారులు రూ.76,730 నుంచి రూ.1,62,780 వరకు వేతన శ్రేణిలో విధులు నిర్వర్తించనున్నారు. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఇఎన్‌సికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

---

## ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

**తిరుపతి, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం నుండి అక్రమంగా ఎర్రచందనం రవాణా చేస్తున్న స్మగ్లర్లను అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారినుండి తిరుపతి జిల్లా తాయి మమాంబపురం వద్ద 77 ఎర్రచందనం దుంగలతో పాటు, ఒక కారు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లును అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎఎస్పీ జె.కులశేఖర్, డిఎస్పీ ఎండీ షరీఫ్, ఆర్ఎస్ఐ కెఎస్‌కె లింగాధర్ టీమ్, ఎఫ్ఆర్ఒ సుభాష్‌తో కలిసి తిరుపతి డివిజన్ పుత్తూరు రేంజ్ నారాయణవనం బీటుకు మంగళవారం రాత్రి చేరుకున్నారు. పుత్తూరు-నేసనూరు మార్గంలోని తాయి మమాంబపురం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. బుధవారం తెల్లవారుజామున ఒక మోటారు సైకిల్, దాని వెనుక ఒక కారు వేగంగా రావడంతో అనుమానం వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ వాహనాలను అడ్డగించే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరిని పుత్తూరు మండలానికి చెందిన వ్యక్తిగా, మరొకరిని తమిళనాడు తిరువన్నామలైకు చెందిన వారిగా గుర్తించి అరెస్టు చేశారు. కారులోని 77 ఎర్రచందనం దుంగలను, మోటారు సైకిల్, కారును స్వాధీనం చేసుకున్నారు.



### స్టీల్ ప్లాంట్‌పై మాట్లాడే ముందు

# కార్మికులకు క్షమాపణ చెప్పాలి

- విశాఖ ఉక్కును కాపాడిన చరిత్ర టీడీపీదే: మంత్రి నారా లోకేష్

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసి, ఆ భూములను రాజధాని నిర్మాణం పేరుతో వినియోగించాలన్న ఆలోచన గత వైసీపీ ప్రభుత్వానికి ఉందని, అలాంటి చరిత్ర ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు స్టీల్ ప్లాంట్ కార్మికుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విమర్శించారు. "విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు" అనే నినాదంతో స్టీల్ ప్లాంట్‌ను రెండుసార్లు కాపాడిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని ఆయన పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు టీడీపీ నిరంతరం పోరాడిందని, కానీ వైసీపీ హయాంలో ప్లాంట్ భవిష్యత్తుపై అనేక అనుమానాలు తలెత్తాయని అన్నారు. స్టీల్ ప్లాంట్ వల్ల కాలుష్యం పెరుగుతోందంటూ కార్మికుల జీవనోపాధిపై ప్రభావం చూపే వ్యాఖ్యలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు అదే (తరువాయి 8వ పేజీలో)

### స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు

# కోటి పరిహారం ఇవ్వాలి



- ఉద్యోగాలు కల్పించాలి.. లేకపోతే అధికారంలోకి రాగానే మేమే అమలు చేస్తాం
- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించి, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం ఆ పని చేయకపోతే, తమ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే కోటి రూపాయల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో గాయపడి సెవెన్ హిల్స్, కిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను బుధవారం పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రమాదంలో ఇప్పటివరకు తొమ్మిది మంది మరణించగా, మరో (తరువాయి 8వ పేజీలో)




### స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో

# నడిపించడమే లక్ష్యం

- బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం.. శవ రాజకీయాలు మానుకోవాలి: పల్లా శ్రీనివాసరావు
- జగన్‌కు స్టీల్ ప్లాంట్‌పై మాట్లాడే నైతిక హక్కు లేదు: వంగలపూడి అనిత

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త:

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం అత్యంత దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలుస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించి, భవిష్యత్తులో 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి విషాద సమయంలో రాజకీయాలు చేయడం సరికాదని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ప్రజల ధనం రూ.40 వేల కోట్లకు పైగా వెచ్చించబడిందని, అలాంటి సంస్థను కాపాడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించేందుకు రూ.3,500 కోట్లతో పాటు రూ.11 వేల కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించిందన్నారు. మృతుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించే వరకు ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ప్రమాదాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శిం చారు. స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడే నైతిక అర్హత కూడా ఆయనకు లేదన్నారు. ప్రమాదం జరిగిన రోజు ఉదయం 7.15 గంటలకే తాము సంఘటన స్థలానికి చేరుకున్నామని, అప్పటికే అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారని తెలిపారు.

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమార స్వామి ప్రమాదం జరిగిన ఆరు గంటల్లోనే విశాఖ చేరుకుని బాధిత కుటుంబాలకు భరోసా కల్పిం చారని, జీవితాంతం అండగా ఉంటామని హామీ ఇచ్చారని చెప్పారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్య మాలు నిర్వహించిన సమయంలో జగన్ ఒక్కరోజు కూడా వారి వద్దకు వెళ్లలేదని, వారిని విమానా శ్రయానికి పిలిపించుకుని మాట్లాడారని ఆరోపిం చారు. మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు బీమా తదితర రూపాల్లో రూ.60 లక్షల నుంచి కోటి రూపాయల వరకు అందుతా యని, తొలిసారిగా మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబ సభ్యుల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించే నిర్ణయాన్ని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి తీసుకున్నారని వెల్లడించారు. ఎల్‌జీ పాలిమర్స్ ఘటనలో బీమా రూపంలో వచ్చిన నిధులను పూర్తిస్థాయిలో బాధితులకు అందించలేదని, గంగవరం పోర్టులో రాష్ట్రానికి రావాల్సిన వాటాను కూడా వైసీపీ ప్రభుత్వం వదులుకుందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించడం, కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ఈ విషయంలో రాజకీయ విమర్శల కంటే బాధిత కుటుంబాలకు అండగా నిలవడమే ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో చోడే వెంకట పట్టాభిరామ్, కృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

### విశాఖ పోర్టు అభివృద్ధిని ప్రశంసించిన

# ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గౌరవ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ బుధవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)ని సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టు చైర్‌పర్సన్ జస్‌మీత్ సింగ్ బింద్రా, కార్యదర్శి ఎం. శంకర్ బాబు ఆమెకు ఘన స్వాగతం పలికారు. సందర్శన సందర్భంగా విశాఖపట్నం పోర్టు కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై పోర్టు అధికారులు ప్రధాన న్యాయమూర్తికి సమగ్ర వివరాలు అందించారు. కార్గో నిర్వహణ సామర్థ్యాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆధునికీకరణ కార్యక్రమాలు, పోర్టు సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు చేపడుతున్న వ్యూహాత్మక చర్యలను వివరించారు. సముద్ర వాణిజ్యం, లాజిస్టిక్స్ రంగాల (తరువాయి 8వ పేజీలో)

**విశాఖపట్నం పోర్టును సందర్శించిన జస్టిస్ లీసా గిల్**



## స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో 9కు చేరిన మృతుల సంఖ్య

- చికిత్స పొందుతూ కార్మికుడు పైడిరాజు మృతి
- కన్నీరు పెట్టిస్తున్న తండ్రి చివరి మాటలు

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త:

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడు పైడిరాజు బుధవారం ఉదయం మృతి చెందడంతో దుర్ఘటనలో మృతుల సంఖ్య 9కు చేరింది. ప్రాణాలతో పోరాడుతూ తన కుటుంబ సభ్యులకు చెప్పిన చివరి మాటలు ఇప్పుడు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. ఈ నెల 8న స్టీల్ మెల్టింగ్ షాప్‌లో సలసల మరుగుతున్న ఉక్కు (తరువాయి 8వ పేజీలో)

### స్టీల్ ప్లాంట్ బాధితులను

# పరామర్శించిన జగన్

**జగన్ వెంట తిప్పల నాగిరెడ్డి, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి**



విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం షీలానగర్‌లోని కిమ్స్ ఆసుపత్రిని సందర్శిం చారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరి స్థితిని అడిగి తెలుసుకున్న జగన్, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాదంలో (తరువాయి 8వ పేజీలో)

### ఉత్సవాల సందడిలో తప్పిపోయిన కుమార్తె...

## అర్ధరాత్రి దారుణ స్థితిలో లభ్యం

విశాఖపట్నం (భీమునిపట్నం), జూన్ 10 ప్రభాతవార్త

గ్రామదేవత ఉత్సవాల ఆనందం ఓ కుటుంబానికి విషాదంగా మారింది. మేధో వైకల్యం కలిగిన 24 ఏళ్ల యువతి పండుగ సందడిలో కనిపించకుండా పోవడం, అనంతరం ఆమెపై దారుణం జరిగినట్లు వెలుగులోకి రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది (తరువాయి 8వ పేజీలో)

### ఉక్కు ప్రమాదంలో మృతుల కుటుంబికులను

## పరామర్శించిన పల్లా, వెలగపూడి



అగనంపూడి ప్రభాత వార్త

ఉక్కు ప్రమాదంలో మరణించిన శనివాడ గ్రామానికి చెందిన భాను, దొంకాడ గ్రామానికి చెందిన నక్కరాజు అప్పలరాజు కుటుంబాలను బుధవారం రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా (తరువాయి 8వ పేజీలో)

### సంతృప్తికరమైన

# రెవెన్యూ సేవలను అందించాలి



**రెవెన్యూ కాన్ఫరెన్స్ సమీక్షలో జిల్లా కలెక్టర్**

విశాఖపట్నం, జూన్ 10 (ప్రభాత వార్త)

ప్రజలు సంతృప్తి చెందేరీతిలో స్నేహపూర్వక వాతావరణంలో రెవెన్యూ సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం జరిగిన రెవెన్యూ కాన్ఫరెన్స్ లో ఆయన వివిధ అంశాలపై సూచనలు చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాల (తరువాయి 8వ పేజీలో)

### అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల్లోనూ..

# వీఎస్ఈజెడ్ ఎగుమతుల దూకుడు

- రూ.2.42 లక్షల కోట్ల ఎగుమతులు
- 6 శాతం వృద్ధి నమోదు
- 6 లక్షల మందికి ఉపాధి.
- కొత్త ఎస్ఈజెడ్ యూనిట్లకు గ్రీన్ సిగ్నల్



(ప్రభాతవార్త -విశాఖపట్నం)

అమెరికా సుంకాల విధానం, ఇరాన్ యుద్ధం వంటి అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలి (వీఎస్ఈజెడ్) 2025-26 ఆర్థిక సంవత్సరంలో అద్భుతమైన ఎగుమతి పనితీరును కనబరిచింది. మొత్తం రూ.2,42,486.82 కోట్ల ఎగుమతులు నమోదు చేసి గత ఏడాదితో పోలిస్తే 6 శాతం వృద్ధిని సాధించినట్లు వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల తెలిపారు. వీఎస్ఈజెడ్ (తరువాయి 8వ పేజీలో)



## స్టీల్ ప్లాంట్ ప్రమాదం బాధాకరం

**పైడిరాజు కుటుంబానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

8లో

## వైషమ్యాలు లేని సమాజాన్ని నిర్మించండి

**ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధన సమితి ఉభయ రాష్ట్రాలకు విజ్ఞప్తి..**

8లో






## సత్తెమ్మ తల్లి దేవాలయానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు 'హెటిరో'

8లో

### పోలీసులపై రాళ్ళదాడికి తెగబడిన

# గంజాయి స్మగ్లర్లు

- ఆత్మరక్షణలో ఎస్ఐ గాల్లో కాల్పులు
- నలుగురు స్మగ్లర్లు అరెస్ట్
- పరారీలో మరి నలుగురు
- రూ. కోటి నాలుగు లక్షల 52 వేలు విలువ కలిగిన గంజాయి స్వాధీనం
- కారు, రెండు బైకులు సీజ్
- జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడి

పాడేరు, జూన్10, ప్రభాతవార్త,:

గంజాయి స్మగ్లర్లు తప్పించుకునీ పారిపోయే ప్రయత్నంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులపై రాళ్ల దాడికి దిగటంతో పోలీసులు ఆత్మ రక్షణ కోసం గాల్లో కాల్పులు జరిపి పారిపోతున్న నలుగు గంజాయి స్మగ్లర్లను చాకచక్యంగా పోలీసులు సంఘటన ప్రదేశంలో అదుపులోకి తీసుకిగా మరో నలుగురు తప్పించుకుని పారిపోయారని ఈ ఘటనలో ఒక కారును రెండు ద్విచక్ర వాహనాలతో పాటు కోటి నాలుగు లక్షల, 52 వేల రూపాయలు విలువ గల 209 కేజీలు గంజాయి నీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు. బుధవారం పాడేరు జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అమిత్ బర్దర్ వివరించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రామారావుపాలెం జంక్షన్కే దూరు గ్రామ సమీపంలో అన్నవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్,సిబ్బందితో బుద వారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో లోతుగెడ్డ గ్రామం వైపు వెళు న్న ఒక కారులో ఇద్దరు వ్యక్తులు, రెండు ద్విచక్ర వాహనాలపై మరో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వాహనాలను ఆపమని సంకేతాలు ఇవ్వగా అందులోని వ్యక్తులు పోలీసులను తప్పించుకునేందుకు ప్రయత్నించి, వాహనాలను అధిక వేగంతో పోలీసు సిబ్బంది వైపు ముందుకు దూసుకువచ్చారు. పోలీసులు అడ్డగించడంతో వాహనా లను నిలిపివేసి అక్కడి నుంచి పరారయ్యేందుకు గంజాయి స్మగ్లర్లు యత్నించారు. అంతేకాకుండా వారు (తరువాయి 8వ పేజీలో)











## కార్మికులకు క్షమాపణ చెప్పాలి

(7వ పేజీ తరువాయి)

కార్మికుల పట్ల సానుభూతి వ్యక్తం చేయడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని లోకేష్ వ్యాఖ్యానించారు.

ప్రమాద బాధితులను పరామర్శించడం తప్పు కాదని, అయితే గతంలో స్టీల్ ప్లాంట్ ఉనికికే ముప్పు తెచ్చే విధంగా వ్యవహరించిన నాయకుడు ముందుగా కార్మికులకు క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖకు వచ్చి బాధితులను పరామర్శించే ముందు, స్టీల్ ప్లాంట్ కార్మికుల మనోభావాలను దెబ్బతీసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధి, పరిరక్షణకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు కొనసాగుతాయని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

## స్టీల్ ప్లాంట్ ప్రమాదం బాధాకరం

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు పైడిరాజు కుటుంబ సభ్యులను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు. కేజీహెచ్ మార్చురీ వద్ద కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చిన ఆయన, ఈ విషాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు పెద్ద కుమారుడు వర్మతో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రమాదం తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో తన కుమారుడికి పైడిరాజు చెప్పిన చివరి మాటలు ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయని అన్నారు. "తమ్ముడిపై కోపపడకు... వాడ్ని బాగా చదివించు... అమ్మను బాగా చూసుకో... బై డాడీ" అంటూ తన కుమారుడికి చెప్పిన మాటలు కుటుంబం ఎదుర్కొంటున్న విషాదాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

పైడిరాజు మృతితో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య తొమ్మిదికి చేరిందని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, జనసేన పార్టీ తరపున కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను కోరినట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు.

## వైషమ్యాలు లేని సమాజాన్ని నిర్మించండి

ప్రభాత వార్త – విశాఖపట్నం

భారతదేశానికి తెలుగు జాతికి పేరు తీసుకురండి తెలంగాణ గ్రామీణ పాఠశాలల్లో టాపర్స్ నీ కోరిన దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్. ఈరోజు విశాఖ పట్నం ద్వారకా నగర్ లో హోటల్ బుదిలిపార్క్ లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధన సమితి ఏర్పాటు చేసినటువంటి తెలంగాణ గ్రామీణ పాఠశాలలో పదో తరగతిలో టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధన సమితి అధ్యక్షులు జి.ఎ నారాయణరావు సభకి అధ్యక్షత వహిస్తూ మాట్లాడుతూ తెలుగుజాతి తెలుగు ప్రజలు చిరకాలం ఐక్యంగా ఉండాలని భారతదేశ అభివృద్ధికి ప్రాంతాల మధ్య విద్వేషాలు రాకూడదని దీనికి రాబోయే తరం విద్యార్థులు మంచి మార్గాన్ని నిర్మించుకోవాలని తెలంగాణ టాపర్స్ ని కోరారు. ఉభయ రాష్ట్రాలలో నూతన విద్యా విధానం పాలసీలు వలన గ్రామీణ పాత్రలోనే ఎక్కువ ఉత్తీర్ణత శాతం పెరిగిందని ఈ రెండు రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కన్నా ప్రమాదకరమైందని దీనిని సమాజం నుంచి పారద్రోలా లని ఉభయ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా పెరగాలని క్రమశిక్షణతో ఉపాధ్యాయుని తల్లిదండ్రులని గౌరవించాలని విద్య మాత్రమే ప్రతి మనిషిని ఉన్నత స్థాయికి తీసుకు వెళ్తుందని కావున ఉన్నత విద్యను దాకా పోటీ తత్వంతో చదవాలని విద్యార్థులను కోరారు. చదువుకోడానికి పేదరికం ఆటంకం కాకూడదని అలాంటి అవసరం వస్తే తాను ఎవరికైనా సహాయం చేయటానికి ముందు ఉంటానని వంశీకృష్ణ తెలియజేశారు.

## సత్తెమ్మ తల్లి దేవాలయానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు "హెటిరో"

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని ఉపమాక సత్తెమ్మ పల్లి యాజమాన్యానికి అభినందనలు వారి సౌజన్యంతో ఉప్మాక సత్తెమ్మ తల్లి దేవాలయానికి విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన హెట్టిరో యాజమాన్యానికి ఉపమాక గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఆలయం వద్ద ఎలక్ట్రికల్ లైన్ ఏర్పాటు చేయాలని చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి కి ఉపమాక గ్రామస్తులు వినతి పత్రం అందజేసిన విషయం తెలిసినదే.! ఈ మేరకు స్పందించిన చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి తో పాటు యాజమాన్యం స్పందించి ముందుకు రావడంతో సుమారుగా నాలుగు లక్షల రూపాయల చెక్కును హెటిరో సంస్థ వైస్ చైర్మన్ యస్. కుల్లాయ్య రెడ్డి చేతుల మీదుగా బుధవారం ఉపమాక సబ్‌స్టేషన్ ఏఈ సత్యనారాయణకు గ్రామ పెద్దలు కొప్పిశెట్టి బుజ్జి , కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి శ్రీను తోలేటి శ్రీను తో పాటు పలువురు సమక్షంలో చెక్కు ను అందజేశారు. ఎస్టిమేషన్ ప్రకారం పనులు ప్రారంభిస్తామని ఏ ఈ గ్రామస్తులకు తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి ముందుకు వచ్చిన హెటిరో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఉపమాక గ్రామ అభివృద్ధికి సహకరిస్తూ వస్తున్నారని వారు చేసిన సేవలు మరువలేను అని బుజ్జి అన్నారు. సి ఎస్ ఆర్ ప్రతినిధి శ్రీనివాసరావు ఉన్నారు.

## విశాఖ పోర్టు అభివృద్ధిని ప్రశంసించిన ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

(7వ పేజీ తరువాయి)

అభివృద్ధిలో విశాఖపట్నం పోర్టు పోషిస్తున్న కీలక పాత్రతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని చైర్‌పర్సన్ జస్మీత్ సింగ్ బింద్రా వివరించారు. పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ రూపాంతరం, నిర్వహణ సామర్థ్యాల పెంపు కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి కూడా తెలియజేశారు. విశాఖపట్నం పోర్టులో కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పోర్టు చైర్‌పర్సన్, అధికారులను అభినందించారు. పోర్టు ఆధునికీకరణ, సామర్థ్య వృద్ధి, అభివృద్ధి దిశగా చేపడుతున్న చర్యలను ప్రశంసిస్తూ భవిష్యత్‌లో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భన విశాఖపట్నం పోర్టు అభివృద్ధి ప్రస్థానానికి మరింత ప్రోత్సాహాన్ని అందించనుందని అధికారులు పేర్కొన్నారు.

## స్టీల్ ప్లాంట్ బాధితులను పరామర్శించిన జగన్

(7వ పేజీ తరువాయి)

గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు. జగన్ వెంట వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి తదితరులు ఉన్నారు. బాధితులకు పార్టీ తరఫున అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.

## అర్ధరాత్రి దారుణ స్థితిలో లభ్యం

(7వ పేజీ తరువాయి)

ఆ యువతి గ్రామదేవత ఉత్సవాలకు వెళ్లిన సమయంలో కనిపించకుండా పోయింది. కుమార్తె కనిపించకపోవడంతో తల్లి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై రాత్రంతా గాలింపు చేపట్టారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది కూడా అన్వేషణలో పాల్గొన్నారు. గంటల తరబడి సాగిన గాలింపు తర్వాత యాతకుమారిపాలెం సమీపంలోని సుఖీభవ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో యువతి గుర్తించబడింది. బాధితురాలి వాంగ్మూలం మేరకు ఇద్దరు వ్యక్తులు ఆమెను ఉత్సవాల వద్ద నుంచి బలవంతంగా తీసుకెళ్లి దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది. బాధితురాలికి అవసరమైన వైద్య, న్యాయ సహాయ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# కోటి పరిహారం ఇవ్వాలి

(7వ పేజీ తరువాయి)

ఐదుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందన్నారు.

ప్రమాద బాధితుల కుటుంబాలకు రూ.1.72 కోట్లు వస్తాయని ప్రభుత్వం చెబుతోందని, అయితే అది వారి హక్కుగా రావాల్సిన సొమ్మేనని జగన్ పేర్కొన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, పీఎఫ్, గ్రాట్యుటీ, ఇతర బెనిఫిట్స్ రూపంలో మరో రూ.1.45 కోట్లు కూడా వారికి హక్కుగా లభిస్తాయని చెప్పారు. "వారి హక్కుగా వచ్చే డబ్బును ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకోవడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ఏమి ఇస్తోంది?" అని ప్రశ్నించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడేందుకు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అన్ని విధాలా పోరాడిందని జగన్ గుర్తు చేశారు. 2021లో ప్రధానికి రెండు లేఖలు రాశామని, అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో కూడా ప్రైవేటీకరణను వ్యతిరేకించినట్లు తెలిపారు. ప్రస్తుతం చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి స్టీల్ ప్లాంట్‌పై చిత్తశుద్ధి ఉంటే వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో స్టీల్ ప్లాంట్‌లో 28 వేల మంది ఉద్యోగులు ఉండగా, గత రెండేళ్లలో 10 వేల మందికిపైగా ఉద్యోగాలు తగ్గిపోయాయని ఆరోపించారు. 6,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, 1,800 మందిని వీఆర్ఎస్ ద్వారా పంపించివేశారని, మరో 2,500 మంది పదవీ విరమణ చేశారని పేర్కొన్నారు.

నాలుగున్నర నెలలుగా ఉద్యోగులకు జీతాలు అందడం లేదని, బోనస్, హెచ్ఆర్ఏ, ఎల్‌టీసీ, వైద్య సదుపాయాలు వంటి అనేక ప్రయోజనాలు నిలిపివేశారని విమర్శించారు. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీని కూడా సంస్థ అభివృద్ధి లేదా భద్రత కోసం కాకుండా, వీఆర్ఎస్, రుణాలు, జీఎస్టీ బకాయిల చెల్లింపులకే వినియోగించారని ఆరోపించారు.

ప్రమాదంలో కార్మికుల తప్పిదం ఏమాత్రం లేదని, ముడి పదార్థాల నాణ్యత లోపాలు, సాంకేతిక కారణాల వల్లే ప్రమాదం జరిగిందని జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

# వీఎస్ఈజెడ్ ఎగుమతుల దూకుడు

(7వ పేజీ తరువాయి)

ఎగుమతుల్లో సేవల ఎగుమతులు రూ.1,81,868.83 కోట్లు, వస్తు ఎగుమతులు రూ.60,617.99 కోట్లుగా నమోదయ్యాయి. దువ్వాడ ఎస్ఈజెడ్ పరిధిలో రూ.4,935.39 కోట్ల ఎగుమతులు జరగగా, ఇందులో వస్తు ఎగుమతులు రూ.4,916.99 కోట్లు, సేవల ఎగుమతులు రూ.18.40 కోట్లుగా ఉన్నాయని వెల్లడించారు. మార్చి 31, 2026 నాటికి వీఎస్ఈజెడ్ రూ.1,26,635 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 6,03,474 మందికి ఉపాధి కల్పించిందని పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో వీఎస్ఈజెడ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

2025-26లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఒక కొత్త ఎస్ఈజెడ్‌కు ఆమోదం లభించిందని, రూ.17.54 కోట్ల పెట్టుబడులతో 91 మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందన్నారు. అలాగే తెలంగాణలో 12, ఆంధ్రప్రదేశ్‌లో 5, ఛత్తీస్‌గఢ్‌లో ఒక కొత్త ఎస్ఈజెడ్ యూనిట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. వీటి ద్వారా రూ.6,245.29 కోట్ల పెట్టుబడులు వచ్చి 6,876 మందికి ఉపాధి లభించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో సబ్‌స్ట్రేట్ వాల్యూమెట్రిక్ మ్యానుఫ్యాక్చరింగ్, హిల్టన్ టొబాకోస్, మిసో రిబ్బన్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్, అరోకెమా ఇన్‌గ్రిడియెంట్స్ వంటి సంస్థలకు అనుమతులు మంజూరయ్యాయి. తెలంగాణలో కీలోప్ ఇండియా, గుడ్‌ఇయర్ టెక్నాలజీ సెంటర్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, ఎంటీఏఆర్ టెక్నాలజీస్, హిటాచీ డిజిటల్, ఎక్స్‌డిలింక్స్ స్పేస్ ల్యాబ్స్ తదితర సంస్థలకు ఆమోదం లభించింది. ఐటీ/ఐటీఈఎస్ రంగంలో ఛత్తీస్‌గఢ్‌లోని రాక్‌బ్యాంక్ డేటా సెంటర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కూడా ఎస్ఈజెడ్ అనుమతులు మంజూరు చేసినట్లు శ్రీనివాస్ ముప్పాల వెల్లడించారు. వీఎస్ఈజెడ్ పనితీరు దేశ ఆర్థికాభివృద్ధికి, విదేశీ మారకద్రవ్య ఆదాయ పెరుగుదలకు బలమైన తోడ్పాటునిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# జోల్ల గ్ర్వాలి బాళయిఖీ జె భూఖ్సీ జుద్బా గ్గ్టి పెజ్బోగు

(7వ పేజీ తరువాయి)

తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులపై రాళ్ళ దాడికి తెగబడ్డారని ఐతే పోలీసులు పలుమార్లు హెచ్చరించి రాళ్ళ దాడిని నిలిపివేసి లొంగిపోవాలని సూచించినప్పటికీ స్మగ్లర్లు తమ హింసాత్మక చర్యలను రాళ్ళ దాడిని కొనసాగించదంతో పోలీసులు ఆత్మ రక్షణ నిమిత్తం గాలిలోకి కాల్పులు జరుపుతూ స్మగ్లర్లకు హెచ్చరించడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకుని నిందితులను పట్టుకునే ఉద్దేశ్యంతో ఎస్పై గాల్లో హెచ్చరిక చేస్తూ కాల్పులు జరిపారనీ ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. సంఘటనా ప్రదేశంలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు అక్కడ నుంచి ప్రారయ్యారని ఎస్పీ తెలిపారు.రాళ్లు దాడిలో ప్రభుత్వ వాహనం కూడా నష్టం వాటిల్లిందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన నలుగురు స్మగ్లర్లకు అరెస్టే చేశామని అరెస్ట్ చేసిన వారిలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అర్జున్ కుమార్, విశాఖపట్నం జిల్లా కు చెందిన ఇమ్రాన్ ఖాన్, ఒడిశా రాష్ట్రం మల్కన్గిరి జిల్లా చెందిన కిషాణ ఖారా,చింతపల్లి మండలం బలపం గ్రామానికి చెందిన పాంగి శ్రీను అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న నలుగురు నిందితులను గుర్తించగా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నయని ఎస్పీ తెలిపారు. పదిబండిల్స్ తో ఉన్న 209.04 కిలోల గంజాయి ఆస్తి విలువ కోటి నాలుగు లక్షల,52 వేల రూపాయలని ఎస్పీ తెలిపారు.అలాగే ఒక కారు,రెండు పల్సర్ బైకులు, స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. నలుగురు స్మగ్లర్లను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ,సిబ్బందిని అభిందిస్తూ త్వరలో రివార్డులు అందజేయనున్నారు ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు.జిల్లాలో గంజాయి జీరో సాగులో ఉందని అయితే గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టడంతో అంతర్ రాష్ట్రాల్లో స్మగ్లర్ల ముఠా వివరాలు బయట పడుతున్నాయని వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించ నున్నట్టు ఎస్పీ స్పష్టం చేసారు.ఈ సమావేశంలో చింతూరు ఎ ఎస్ పంకజ్ కుమార్ మీనా పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో 9కు చేరిన మృతుల సంఖ్య

(7వ పేజీ తరువాయి)

ద్రవం ఒక్కసారిగా లావాలా ఎగసిపడి కార్మికులపై చెలరేగడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం కన్నుమూశారు.

గాయాలతో ఆసుపత్రి మంచంపై చికిత్స పొందుతున్న సమయంలో తన కుమారుడు వర్మతో మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "వర్మా... తమ్ముడి మీద చిరాకు పడకు... వాడిని బాగా చదివించు... నువ్వు కూడా బాగా చదువుకో... అమ్మను బాగా చూసుకోండి... ఉంటాను డాడీ" అంటూ కన్నీటి గొంతుతో చెప్పిన మాటలు హృదయాలను కలచివేస్తున్నాయి.

తన ప్రాణాల కంటే కుటుంబ భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ పిల్లలకు బాధ్యతలు అప్పగించిన ఆ తండ్రి ప్రేమ, ఆవేదన అందరినీ భావోద్వేగానికి గురిచేస్తోంది. మృత్యువుతో పోరాడుతూనే కుటుంబానికి ధైర్యం చెప్పిన పైడిరాజు చివరి సందేశం ఇప్పుడు ఒక కుటుంబానికే కాకుండా సమాజానికే మానవీయతను గుర్తు చేస్తున్న విషాద గాథగా మారింది.

ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అలాగే క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించింది. మృతి చెందిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు వివిధ ప్రయోజనాలు కలిపి రూ.1.72 కోట్ల వరకు, ఒప్పంద ఉద్యోగుల కుటుంబాలకు సుమారు రూ.45 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు.

స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనపై కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మిగిలిన క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

### సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో..

# స్టీల్ ప్లాంట్ బాధితులకు వైఎస్ జగన్ పరామర్శ



విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల చోటు చేసుకున్న విషాదకర ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైఎస్ జగన్ స్వయంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స విధానం, బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ప్రమాదంలో గాయపడిన కార్మికుల కుటుంబ సభ్యులతో కూడా జగన్ మాట్లాడారు. వారికి ధైర్యం చెబుతూ, ఈ క్లిష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను ఓపికగా విన్నారు. స్టీల్ ప్లాంట్ లో జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా జగన్ పేర్కొన్నారు. వైఎస్ జగన్ పర్యటనతో సెవెన్ హిల్స్ ఆసుపత్రి పరిసరాల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన వారి ఆరోగ్య పరిస్థితిపై మరిన్ని వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# విద్యతో పాటు విలువలు, క్రీడల్లోనూ రాణించాలి

**విద్యార్థులకు ప్రముఖుల పిలుపు**

విశాఖపట్నం, జూన్ 10 (ప్రభాత వార్త)

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ విద్య, క్రీడలు, పర్యావరణ పరిరక్షణపై ప్రముఖులు విలువైన సూచనలు చేశారు.

విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ అధ్యక్షుడు కొమ్మరాజు వాసుదేవ్ మాట్లాడుతూ, తెలంగాణలో గ్రామీణ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ప్రాంత ప్రభుత్వ పాఠశాలలను కూడా దత్తత తీసుకుని విద్యార్థులకు తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని వెల్లడించారు. ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంబాబు మాట్లాడుతూ, మంచి నడవడిక, క్రమశిక్షణ, దేశభక్తి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని చెప్పారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మాజీ వైస్ ఛాన్సలర్ సుంకర రామకృష్ణారావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం కాలుష్య నియంత్రణ, ప్రకృతి సంరక్షణ బాధ్యతను విద్యార్థులు గుర్తించాలని కోరారు. భారత బ్యాడ్మింటన్ స్టార్ లింగేశ్వరరావు మాట్లాడుతూ, దేశంలో అనేక మంది క్రీడాకారులు గ్రామీణ పాఠశాలల నుంచే ఎదిగి అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నారని చెప్పారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అర్జున అవార్డు గ్రహీత, ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి పూజారి శైలజ మాట్లాడుతూ, చదువులతో పాటు క్రీడల్లోనూ అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని ఆమె పేర్కొన్నారు.

# ఓటీగడ్జ వ్రేశ్రీచ్చు్య్ర్యీ్ర్యు చ్చుఱు్బా వ్రేగ్గ భౌశ్రీ

**స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర విజన్-2026 అమలుపై అధికారులకు మార్గదర్శనం**




విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :

స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర విజన్--2026 లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామీణ పారిశుధ్య కార్యక్రమాల అమలుపై రాష్ట్రస్థాయి కార్యశాలను విశాఖపట్నం జిల్లా పరిషత్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, జిల్లాల అధికారులు, స్వచ్ఛత కార్యక్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కార్యశాలలో పంచాయతీరాజ్ శాఖ అదనపు కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య విధానాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర విజన్--2026ను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

జూలై 10 నుంచి ప్రారంభమయ్యే "45 రోజుల కార్యాచరణ ప్రణాళిక" అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో స్వచ్ఛతను పెంపొందించేందుకు "స్వచ్ఛ రథాలు", పర్యావరణ పరిరక్షణకు "స్వచ్ఛ పథం" కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. మహిళా సంఘాలు, గ్రామ సంస్థల భాగస్వామ్యంతో ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా 2025--26 సంవత్సరానికి సంబంధించిన ఉత్తమ పద్ధతులు, విజయవంతమైన కార్యక్రమాలను ప్రదర్శించే ఎగ్జిబిషన్‌ను కూడా నిర్వహించారు. గ్రామీణ పారిశుధ్య రంగంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా స్థాయి అధికారులు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యశాలలో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, డీపీఓలు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, డీపీఆర్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబీకులను పరామర్శించిన పల్లా, వెలగపూడి



(7వ పేజీ తరువాయి)

వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఇప్పుడు ఏ సమస్య వచ్చినా మమ్మల్ని స్వయంగా కలవచ్చని భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలన్నీ అందేటట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డైరెక్టర్ ప్రసాదల శ్రీను, వేజు బోర్డు డైరెక్టర్ విల్లా రామ్మోహన్ కుమార్. మాజీ కార్పొరేటర్ వరలక్ష్మి ప్రసాదు,85వ వార్డు టిడిపి అధ్యక్షులు కర్రి దశంద్ర, గవర సోమశేఖర్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కర్ణం సత్య రావు, బలి రెడ్డి సత్యనారాయణ, డొక్కా రమేష్, దాసరి త్రినాథ్, కోసూరు తాతారావు, విందుల రాజు, చందు రమేష్, ఎలమంచిలి రమణ, జనసేన నాయకులు లక్ష్మణ, పెంటరావు తదితరులు పాల్గొన్నారు.

## సంతృప్తికరమైన రెవెన్యూ సేవలను అందించాలి

(7వ పేజీ తరువాయి)

పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ఆక్రమణల నివారణ, కన్వేయన్స్ డీడ్ల అమలు, రీ-సర్వే, 22-ఏ డీ-నోటిఫికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జి.ఓ.ఎం.ఎస్. నెం. 296, 388, 30 ప్రకారం కన్వేయన్స్ డీడ్ల అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని, వాటి పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. గాజువాక ప్రాంతంలో భూముల క్రమబద్ధీకరణ, యు.ఎల్.సి. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన జి.ఓ. నెం. 27, 84 అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

రెవెన్యూ శాఖ సేవలపై ప్రజల్లో సానుకూల అభి ప్రాయం పెంపొందేలా అధికా రులు పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చొరవ చూపాలని సూచిం చారు. ఎఫ్-లైన్, ఆర్.ఓ.ఆర్. సేవలకు సంబంధించిన పెం డింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని నిర్దేశించారు. అందిస్తున్న సేవలపై జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రత్యేకంగా ఫోన్లు చేసి ప్రజలతో మాట్లాడాలని, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని, ఎక్కడైనా లోపం ఉంటే తక్షణమే సరిదిద్దాలని చెప్పారు. ఎఫ్.లైన్, ఆర్.ఓ.ఆర్., మ్యుటేషన్ తదితర సేవల్లో అధికారులు ప్రజలతో సఖ్యతగా వ్యవహరించాలని, లంచాలు డిమాండ్ చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, పలువురు డిప్యూటీ కలెక్టర్లు, సర్వే శాఖ ఏడీ రామకృష్ణ, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, తహశీల్దార్లు, డీటీలు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో నాల్గవ రోజు యోగాభ్యాస శిబిరం



విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :

బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్న యోగాభ్యాస శిబిరం గురువారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు వై. సత్య సూర్యనారాయణ మూర్తి, యోగ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో పాల్గొన్న వారికి వివిధ యోగాసనాలు, ప్రాణాయామ విధానాలను అభ్యసింపజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన వేదపండితులు, అర్చక స్వాములు, ఉద్యోగులు, స్థానికులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని యోగ సాధన చేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని శిక్షకులు వివరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యోగాభ్యాస శిబిరానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ యోగ సాధనను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సంకల్పించారు.

### కార్డెలియా ఎంప్రెస్ క్రూయిజ్ రాకతో..
## విశాఖ పర్యాటక రంగానికి కొత్త ఊపు
### క్రూయిజ్ టూరిజం ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు :ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయమోహన్



విశాఖపట్నం, జూన్ 9, ప్రభాతవార్త

కార్డెలియా ఎంప్రెస్ క్రూయిజ్ నౌక విశాఖ పట్నానికి రానుండటంతో నగర పర్యాటక రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకోనున్నాయని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. విజయమోహన్ తెలిపారు. క్రూయిజ్ టూరిజం అభివృద్ధి ద్వారా విశాఖకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని ఆయన పేర్కొన్నారు. జూన్ 22 నుంచి చెన్నై--విశాఖ మధ్య ప్రారంభమయ్యే కార్డెలియా ఎంప్రెస్ క్రూయిజ్ సేవలు సముద్ర పర్యాటక రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకనున్నాయని విజయమోహన్ చెప్పారు. 692 అడుగుల పొడవు, 11 డెక్స్, 796 కేబిన్లతో రూపొందిన ఈ విలాసవంతమైన నౌకలో ఒకేసారి సుమారు 1,600 మంది ప్రయాణించే అవకాశం ఉందన్నారు. జూన్ 22 నుంచి జూలై 18 వరకు చెన్నై--విశాఖ మధ్య మొత్తం ఎనిమిది ట్రిప్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. చెన్నై నుంచి విశాఖకు నాలుగు, విశాఖ నుంచి చెన్నైకి నాలుగు ప్రయాణాలు ఉండనున్నాయని చెప్పారు. తొలి ట్రిప్ జూన్ 22న చెన్నైలో ప్రారంభమై జూన్ 24న విశాఖకు చేరుకుంటుందని వివరించారు. ప్రయాణ ఖర్చుల విషయానికి వస్తే, రెండు రాత్రుల ప్రయాణానికి ఇద్దరికి సుమారు రూ.48 వేలు, మూడు రాత్రుల ప్రయాణానికి ఇద్దరికి సుమారు రూ.70 వేలు వ్యయం అవుతుందని తెలిపారు. ఈ ప్రయాణానికి సంబంధించిన టికెట్లు అన్ని ప్రధాన ట్రావెల్ ఏజెన్సీలలో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. క్రూయిజ్‌లో ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సదుపాయాలు అందుబాటులో ఉంటాయని విజయమోహన్ తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, ఈవెనింగ్ స్నాక్స్, టీ, మిడ్‌నైట్ బ్రంచ్‌తో పాటు నాలుగు డైనింగ్ హాల్స్, లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు, క్యాసినో, తొమ్మిది బార్స్ అండ్ లాంజ్‌లు, రాక్ క్లైంబింగ్, గేమింగ్ జోన్, ఓషన్ స్పా, వెల్‌నెస్ సెంటర్ వంటి అనేక ఆకర్షణలు ప్రయాణికులను అలరిస్తాయని చెప్పారు.

## ప్రాణాలు అర్పించి పలువురిని కాపాడిన అప్పారావు
### -కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి: బి.వి.రామ్

గాజువాక,జూన్ 10,ప్రభాతవార్త



విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ఘోర ప్రమాదంలో క్రేన్ ఆపరేటర్ జి.వి.అప్పారావు చూపిన సాహసం వల్ల పలువురు కార్మికుల ప్రాణాలు దక్కాయని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పేర్కొన్నారు. ప్రమాద స్థలాన్ని ఉక్కు నాయకులు, మంత్రి రాజశేఖర్‌తో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రమాదం సంభవించిన సమయంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తోటి కార్మికులను అప్రమత్తం చేస్తూ అప్పారావు వ్యవహరించారని తెలిపారు. ఆయన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాల వల్ల పెద్ద ఎత్తున ప్రాణనష్టం తప్పిందన్నారు. అలాంటి ఉద్యోగి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. అప్పారావు కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు వారి పిల్లల విద్యాభ్యాసం, కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవలి కాలంలో ఉక్కు కర్మాగారం నుంచి అనుభవజ్ఞులైన ఉద్యోగులు, నిపుణులు పెద్ద సంఖ్యలో వెళ్లిపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఈ పరిస్థితికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని ఆరోపించారు. ప్రమాద ఘటనపై కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చించి భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఉక్కు కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలి
### పదో వార్డ్ ఇంచార్జ్ మద్దిల రాజశేఖర్



ఆరిలోవ, జూన్ 10, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి అందేలా కృషి చేయాలని పదో వార్డ్ ఇంచార్జ్ మద్దిల రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం, తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలతో జూన్ నెలలో రెండు బుధవారాలు సమావేశం కార్యక్రమం భాగంగా రెండవ బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డులో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు విషయమై కూటమి నాయకులతో చర్చించారు. పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బిసి వెల్ఫేర్ నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్, వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి వేముల వెంకట్రావు, సిహెచ్ శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జి మద్దిల రాజేష్, యువత అధ్యక్షులు ప్రకాష్ రావు, తాళాడు లక్ష్మణరావు, మహిళా నాయకులు, కిల్లంపల్లి రమణి, కుందూరు కొండమ్మ, కనకమహాలక్ష్మి, రమాదేవి, వార్డు మెయిన్ కమిటీ సభ్యులు యూనిట్ ఇన్చార్జులు బూత్ కన్వీనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరు వికెట్ల తేడాతో తుంగభద్ర వారియర్స్‌పై అమరావతి రాయల్స్ విజయభేరి
### కట్టుదిట్టమైన బౌలింగ్‌తో తుంగభద్ర బ్యాటింగ్ను కంగు తినిపించిన అమరావతి బౌలర్స్ -సీజన్లో తొలిగి గెలుపు నమోదు చేసిన అమరావతి -9 ఓవర్లు మిగిలి ఉండగానే మ్యాచ్ పూర్తి చేసిన అమరావతి బ్యాటర్స్

విశాఖపట్నం, జూన్ 10 ప్రభాతవార్త






విశాఖపట్నం (ఏసిఏవిడిసిఏ స్టేడియం) విశాఖపట్నం వేదిక ఏపీఎల్ 2026 సీజన్ 5 రెండో రోజు తొలి మ్యాచ్లో తుంగభద్ర వారియర్స్ వర్సెస్ క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్లు తలపడ్డాయి ముందుగా టాస్ గెలిచిన క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది మొదట బ్యాటింగ్కు దిగిన తుంగభద్ర వారియర్స్ జట్టు ఆది నుంచి వికెట్లు కోల్పోతూ తడబడుతూ పవర్ ప్లే ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 41 పరుగులు మాత్రమే చేసింది అటు ఏ దశలో కూడా తుంగభద్ర జట్టు భాగస్వామ్యం నెలకొల్ప లేదు దీంతో ఆ జట్టు కేవలం 15.5 ఓవర్లలో 105 పరుగుల స్వల్ప స్కోరును మాత్రమే నమోదు చేయగలిగింది కేవలం ముగ్గురు బ్యాటర్లు మాత్రమే రెండు అంకెల స్కోరు అందుకోగలిగారు అటు బౌలింగ్లో టోషిత్ యాదవ్ మూడు వికెట్లు తీసి తుంగభద్ర బ్యాటర్స్ ను పెవిలియన్ కు పంపాడు యాదవ్ కు సహకారులుగా యశ్వంత్ వెంకట శశికాంత్ బండారు అయ్యప్ప రెండేసి వికెట్లు పడగొట్టి తుంగభద్ర టీం ను ఆల్ అవుట్ చేశారు. అనంతరం బ్యాటింగ్కు దిగిన క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు ఆది నుంచే ధాటిగా ఆడుతూ పవర్ ప్లేలో మంచి స్కోరును నమోదు చేసింది ఆది నుండే తుంగభద్ర బౌలర్లపై అమరావతి బ్యాటర్లు విరుచుకుపడ్డారు దీంతో అమరావతి గెలుపు సునాయాసమైంది అమరావతి బ్యాటర్స్ లో ఎస్ వి రాహుల్ 21 బంతుల్లో 40 పరుగులు 6 ఫోర్లు ఒక సిక్సర్ మరియు వై సందీప్ 13 బంతుల్లో 30 పరుగులు నాలుగు ఫోర్లు 2 సిక్సర్లతో అమరావతి జట్టును ఇంకా తొమ్మిది ఓవర్లు మిగిలి ఉండగానే మ్యాచ్ను ముగించారు దీంతో అమరావతి రాయల్స్ జట్టు 11 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 108 పరుగులతో గెలుపును నమోదు చేసింది. ఈ మ్యాచ్ అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసి తుంగభద్ర టీం ను కంగు తినిపించిన టోషిత్ యాదవ్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది విశాఖపట్నం సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ టో షిత్ యాదవ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందించారు విజయవాడ సన్ షైనర్స్, భీమవరం బుల్స్ తలబడ్డాయి. శతకంతో చెలరేగి అశ్విన్ హెబ్బార్ ఆడారు. ఓపెనర్ గా వచ్చి చివరి ఓవర్ వరకు ఆడి టీం బ్యాటింగ్ ను ముందుండి హెబ్బార్ నడిపారు. భీమవరం బౌలర్లను అశ్విన్ ఊచకోత కొసరు. 58 బంతుల్లో 124 పరుగుల తోఅశ్విన్ చెలరేగి ఆడారు దీంతో విజయవాడ బ్యాటర్స్ బౌండరీల వరద చేశారు. 20 ఓవర్ల లో విజయవాడ టీం స్కోర్ 214/6 కాగా భీమవరం గెలుపు కోసం 215 పరుగులు కావలసి వచ్చింది.

## ఉత్సవాల సందడిలో తప్పిపోయిన కుమార్తె...
### అర్ధరాత్రి దారుణ స్థితిలో లభ్యం

విశాఖపట్నం , జూన్ 10 ప్రభాతవార్త

గ్రామదేవత ఉత్సవాల ఆనందం ఓ కుటుంబానికి విషాదంగా మారింది. మేధో వైకల్యం కలిగిన 24 ఏళ్ల యువతి పండుగ సందడిలో కనిపించకుండా పోవడం, అనంతరం ఆమెపై దారుణం జరిగినట్లు వెలుగులోకి రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆ యువతి గ్రామదేవత ఉత్సవాలకు వెళ్లిన సమయంలో కనిపించకుండా పోయింది. కుమార్తె కనిపించకపోవడంతో తల్లి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై రాత్రంతా గాలింపు చేపట్టారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది కూడా అన్వేషణలో పాల్గొన్నారు. గంటల తరబడి సాగిన గాలింపు తర్వాత యాతకుమారిపాలెం సమీపంలోని సుఖీభవ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో యువతి గుర్తించబడింది. బాధితురాలి వాంగ్మూలం మేరకు ఇద్దరు వ్యక్తులు ఆమెను ఉత్సవాల వద్ద నుంచి బలవంతంగా తీసుకెళ్లి దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది. బాధితురాలికి అవసరమైన వైద్య, న్యాయ సహాయ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## నవభారత పథ నిర్దేశకుడు ప్రధానమంత్రి మోడీ
### 12 ఏళ్ల పాలన శుభ పరిణామాన్ని గుర్తు చేసుకున్న బిజెపి జనతా వారధి కోకన్వీనర్ మూల వెంకటరావు



మాధవధార, జూన్ 10, ప్రభాతవార్త

భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ ప్రస్థానం ఎన్నో చారిత్రాత్మక సంఘటనలలో స్ఫూర్తిదాయకమైనదని మూల వెంకటరావు అన్నారు. దేశ రాజకీయ ఆలోచనా సరళిని పూర్తిగా మార్చివేసి దానిని మళ్లీ వెనక్కి తిప్పలేని కొత్త మార్గంలోకి తీసుకెళ్లిన చరితార్థుడు మోదీ అని, ఆయన ప్రజా జీవితం సామాన్య కార్యకర్తగా ప్రారంభమై అసాధారణ స్థాయికి ప్రస్థానించిందన్నారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలతో మమేకమవడం ద్వారా మోడీ పొందిన క్షేత్రస్థాయి అనుభవం, భారత సమాజం, ఆందోళనలు, వారి ఆకాంక్షల పట్ల ఆయనకు అసాధారణమైన అవగాహనను ప్రసాదించిందన్నారు. ఆశయ సాధనలో ఆయనకు వ్యక్తిగత జీవితంలో నిరాడంబరత, ప్రజాజీవితంలో ఆచరణాత్మకత అనే రెండు శక్తివంతమైన వ్యక్తిత్వ లక్షణాలు ఏర్పడ్డాయని మూల వెంకటరావు తెలిపారు కరోనా తర్వాత దేశంలో ఎవరు ఆకలితో అలమటించకుండా చూసేందుకు ప్రధానమంత్రిగా ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రతా కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఆయన ప్రవేశపెట్టిన సామాజిక గృహ నిర్మాణ పథకం, ఆయుష్మాన్ భారత్ వంటి బీమా పథకాలు, సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు రక్షణగా నిలుస్తూ ప్రజలకు ప్రాథమిక అవసరాలు అయినా కూడు, గూడు, గుడ్డ తీర్చడంలో ఆరోగ్య భద్రతకు పూచీ పడుతున్నాయన్నారు. చరిత్రకు భావోద్వేగాలు, పక్షపాతం ఉండవని అంటారని, మహాత్మా గాంధీ తన కాలంలో విమర్శలను, ప్రశంసలను రెండింటిని ఎదుర్కొన్నారన్నారు. గాంధీ లాంటి వ్యక్తి ఈ భూమిపై నడిచాడంటే రాబోయే తరాలు అసలు నమ్మలేవని గాంధీ గురించి ఆల్బర్ట్ ఐన్స్టీన్ గొప్పగా రాశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. చరిత్రను అంత ఖచ్చితమైన పదాలతో అంచనా వేయడానికి ఐన్స్టీన్‌కి ఉన్న దూరదృష్టి అవసరమని, కానీ భవిష్యత్ తరాల కోసం మోడీ గుర్తించిన చారిత్రక పరిశీలన కూడా అంతే అవసరం సంతరించుకుంటుందని అనడంలో ఎలాంటి సందేహము లేదని మూల వెంకటరావు అన్నారు.

## సంతృప్తికరమైన రెవెన్యూ సేవలను అందించాలి
### రెవెన్యూ కాన్ఫరెన్స్ సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త



ప్రజలు సంతృప్తి చెందేరీతిలో స్నేహపూర్వక వాతావరణంలో రెవెన్యూ సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం జరిగిన రెవెన్యూ కాన్ఫరెన్స్ లో ఆయన వివిధ అంశాలపై సూచనలు చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ఆక్రమణల నివారణ, కన్వేయన్స్ డీడ్ల అమలు, రీ-సర్వే, 22-ఏ డీ-నోటిఫికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జి.ఓ.ఎం.ఎస్. నెం. 296, 388, 30 ప్రకారం కన్వేయన్స్ డీడ్ల అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని, వాటి పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. గాజువాక ప్రాంతంలో భూముల క్రమబద్ధీకరణ, యు.ఎల్.సి. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన జి.ఓ. నెం. 27, 84 అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. రెవెన్యూ శాఖ సేవలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందేలా అధికారులు పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చొరవ చూపాలని సూచించారు. ఎఫ్-లైన్, ఆర్.ఓ.ఆర్. సేవలకు సంబంధించిన పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని నిర్దేశించారు. అందిస్తున్న సేవలపై జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రత్యేకంగా ఫోన్లు చేసి ప్రజలతో మాట్లాడాలని, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని, ఎక్కడైనా లోపం ఉంటే తక్షణమే సరిదిద్దాలని చెప్పారు. ఎఫ్.లైన్, ఆర్.ఓ.ఆర్., మ్యుటేషన్ తదితర సేవల్లో అధికారులు ప్రజలతో సఖ్యతగా వ్యవహరించాలని, లంచాలు డిమాండ్ చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, పలువురు డిప్యూటీ కలెక్టర్లు, సర్వే శాఖ ఏడీ రామకృష్ణ, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, తహశీల్దార్లు, డీటీలు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భారీ ఈదురు గాలులు..
## నేలకొరిగిన భారీ వృక్షాలు..

ఎలమంచిలి, జూన్ 10, ప్రభాతవార్త




మండలంలోని పులపర్తి గ్రామంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడం భారీ ఈదురు గాలులు వర్షంతో వృక్షాలు నేలకొరిగాయి. మామిడి చెట్టు ఒక మేడపై పడడంతో ఇల్లు ధ్వంసం అయింది, మరొకచోట కొబ్బరి చెట్టు మరొక మెడపై పడటంతో రెండేళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

## నిబంధనలను అతిక్రమించిన ఐదు లారీలకు జరిమానా



నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని వేంపాడు కాగిత టోల్ ప్లాజాను తప్పించుకునేందుకు పరిమితిని మించిన అధిక లోడుతో వెళుతున్న ఐదు లారీలను నక్కపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పట్టుకున్న ఐదు లారీలను ఆర్టీవో కు తగూ చర్యలు నిమిత్తం కేసు నమోదు చేసి పంపించగా 5 లారీలకు మూడు లక్షల 26 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ జూరెడ్డి మురళి స్థానిక విలేకరులకు తెలిపారు. ఆ రహదారిలో అధిక లోడుతో నడుస్తున్న వాహనాలపై ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని సీఐ తెలిపారు.

## మోదీకి అరుదైన రికార్డు.. ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ శ్రేణులు
### -దేశ అభివృద్ధికి మరింత శక్తి ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించిన నేతలు



పీఎం పాలెం, జూన్ 10, ప్రభాతవార్త

వరుసగా మూడోసారి భారత ప్రధానమంత్రిగా ఎన్నికై విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ, స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా కొత్త రికార్డు నెలకొల్పిన సందర్భంగా విశాఖలో బీజేపీ శ్రేణులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండాడ మండల ఆధ్వర్యంలో పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలోని శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి కెవెన్‌పీ చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, పుష్పాభిషేకం, మంగళహారతులు నిర్వహించి ప్రధాని నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, దేశానికి మరింత సమర్థవంతమైన నాయకత్వం అందించే శక్తిని ఇవ్వాలని ప్రార్థించారు. అనంతరం కెవెన్‌పీ చక్రవర్తి మాట్లాడుతూ, స్వతంత్ర భారతదేశంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా పనిచేసిన 4,388 రోజుల రికార్డును అధిగమించి, నరేంద్ర మోదీ 4,389 రోజులు పూర్తి చేసి అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించారని అన్నారు. దేశ అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠను పెంచడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. వార్డు అధ్యక్షుడు జి.ఆర్.ఎస్.ఎన్. రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సి.హెచ్. నాగరాజు, మండల ఇన్‌చార్జి ధోని నాగరాజు, మాజీ మండల అధ్యక్షుడు సురేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి కామేష్ అయ్యగారి, సీనియర్ నాయకులు శివాజీ రాజు, బీఎంఎస్ నాయకులు రవిశంకర్, పెంద్యాల శ్రీనివాస్, మహిళా మోర్చా నాయకులు రుక్మిణీ దేవి, గౌరీ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోస్ట్ రఘు, పోతిన అప్పలరాజు, కళ్లేపిల్లి మహేష్, సూరిబాబు, హనుమంత్, జి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు
### ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా




పిఎం పాలెం, జూన్ 10, ప్రభాతవార్త

మధురవాడ జోన్-2 పరిధిలోని 6వ వార్డులో పీఎం పాలెం, ప్రతివాడ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానిక ప్రజలు భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు 6వ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ పర్యవేక్షణలో వాటర్ సప్లై సిబ్బంది, ఏఈ రవితేజ ఆధ్వర్యంలో లక్ష్మీపాలెం, ఆర్‌హెచ్ కాలనీ తదితర నీటి ఎద్దడి ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ నీటి పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యపై వెంటనే స్పందించి తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## పైడితల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న పాశర్ల, కనకల



పిఎం పాలెం, జూన్ 10, ప్రభాతవార్త:

అడివివరం శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి దేవాలయంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, అడివివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్‌తో పాటు దేవస్థానం ప్రస్తుత ధర్మకర్తల మండలి సభ్యుడు కనకల మురళీమోహన్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి, ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ప్రార్థించారు. అనంతరం ఆలయ విశిష్టత, అభివృద్ధి కార్యక్రమాలపై ఆలయ ప్రతినిధులతో వారు చర్చించారు. స్థానిక భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పీఎంస్వనిధి లోక్ కళ్యాణ్ మేళా ద్వారా వీధి విక్రయదారులకు రుణాలు
### అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి. రమణ

విశాఖపట్నం, జూన్ 10 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం, మెప్మా ఆధ్వర్యంలో జీవీఎంసీ యూసీడీ సంయుక్తంగా నిర్వహిస్తున్న పీఎంస్వనిధి లోక్ కళ్యాణ్ మేళా ద్వారా వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులు రుణ సదుపాయాలను పొందాలని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి. రమణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎన్‌యూఎల్ఎం 2.0 పథకం కింద బ్యాంకుల ద్వారా వీధి విక్రయదారులకు పీఎంస్వనిధి రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతలో రూ.15 వేల, రెండో విడతలో రూ.25 వేల, మూడో విడతలో రూ.50 వేల వరకు రుణ సదుపాయం కల్పించడంతో పాటు రూ.30 వేల విలువైన క్రెడిట్ కార్డును ఎలాంటి సేవా రుసుము లేకుండా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని అన్ని వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు తమ సమీప జీవీఎంసీ జోనల్ కార్యాలయాలను సంప్రదించి, సంబంధిత ఏపీడీలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్ల వద్ద పేర్లు నమోదు చేసుకుని పథకం ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్న వ్యాపారులకు ఆర్థిక బలాన్ని అందించి వారి జీవనోపాధిని మెరుగుపర్చడమే లక్ష్యమని బి.వి. రమణ తెలిపారు.

## ఇంటి వద్దే కంపోస్టింగ్‌తో పరిశుభ్ర నగరం

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :



గృహాల నుంచి వెలువడే సేంద్రియ వ్యర్థాలను ఇంటి వద్దే కంపోస్టింగ్ చేసి ఎరువుగా మార్చుకోవడం ద్వారా పరిశుభ్రమైన, పర్యా వరణహిత నగర నిర్మాణానికి ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని జీవీఎంసీ పశ్చిమ జోన్ జోనల్ కమిషనర్ బి.హేమావతి సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా 52వ వార్డు శాంతినగర్ పార్కులో కంపోస్టింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి కంపోస్టింగ్‌ను అలవాటు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2025-26లో విశాఖను దేశంలోనే అగ్రగామి పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు.

## రుషికొండ బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
### పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు అధికారుల కసరత్తు

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త



విశాఖ జిల్లాలోని రుషికొండ బీచ్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. బీచ్‌లో పర్యాటకులను ఆకర్షించే విధంగా స్నాన సౌకర్యాలు, పర్యావరణహిత వినోద కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు, వాక్‌వేలు, వ్యూ పాయింట్లు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్ సదుపాయాలు, విశ్రాంతి కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. అలాగే బీచ్ పరిసరాల సహజ అందాలను కాపాడుతూ పర్యాటకాభివృద్ధి చేపట్టే విధానాలపై అధికారులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. స్థానిక చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు బీచ్ ప్రాంతంలో శానిటేషన్, హౌస్‌కీపింగ్, భద్రతా ప్రమాణాలను మెరుగుపర్చే చర్యలపై కూడా దృష్టి సారించారు. బీచ్ పరిసరాల్లో ఉన్న సుందర ప్రదేశాలను పర్యాటకులకు మరింత చేరువ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని జీవీఎంసీ అధికారులను జిల్లా పర్యాటక అధికారి కోరారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా కలెక్టర్ సత్యవేణి, ఏపీటీడీసీ అధికారులు, జీవీఎంసీ జోనల్ కమిషనర్, రెవెన్యూ, పోలీసు, పర్యాటక శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎండల తీవ్రత నేపథ్యంలో మజ్జిగ, గ్లూకోజ్ పంపిణీ

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త



ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో బాటసారులు, వృద్ధుల దాహార్తిని తీర్చేందుకు వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ, గ్లూకోజ్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణికంత ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా వివేకానంద సంస్థ అధ్యక్షులు అప్పారావు మాట్లాడుతూ, ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా ప్రజలు అవసరం లేకుండా బయటకు రావద్దని సూచించారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు రావాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గొడుగులు ఉపయోగించాలని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీరామ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఇండియన్ బ్యాంక్

ఎవిఎన్ కాలేజ్ శాఖ
ఎవిఎన్ కాలేజ్ రోడ్డు, వన్ టౌన్ ఏరియా, విశాఖపట్నం - 530001

**డిమాండ్ నోటీసు**
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం నోటీసు)

టు : 1) గుమ్మడి వంశీ చక్రధర్ (ఋణగ్రహీత/తనఖాదారు), తండ్రి: శ్రీ జి.కృష్ణమూర్తి (లేటు), ఎస్‌వీఎస్ రెసిడెన్సీ, ప్లాటు నెం.215/1&4, డోర్ నెం.1-84-22, ఫ్లాట్ నెం.11, 3వ అంతస్తు, ఎంవి పాలెం, సెక్టార్-4, ఎంవిపి కాలనీ, విశాఖపట్నం-530017. 2.శ్రీమతి గుమ్మడి వరలక్ష్మి (హామీదారు), భర్త: శ్రీ జి.కృష్ణమూర్తి (లేటు), ఎస్‌వీఎస్ రెసిడెన్సీ, ప్లాటు నెం.215/1&4, డోర్ నెం.1-84-22, ఫ్లాట్ నెం.11, 3వ అంతస్తు, ఎంవి పాలెం, సెక్టార్-4, ఎంవిపి కాలనీ, విశాఖపట్నం-530017.
డియర్ సర్ / మేడమ్
విషయం : మీ లోన్ అక్కౌంట్ నెంలు. Home లోన్ ఖాతా నెం.7424380922 ఇండియన్ బ్యాంక్, ఎవిఎన్ కాలేజ్ బ్రాంచ్ - గురించి.

| వ. నెం. | సౌకర్యం యొక్క స్వభావం | అక్కౌంట్ నెం | పరిమితి (రూ.లక్షలలో) | తేది:06-06-2026 నాటికి బకాయి |
|---|---|---|---|---|
| 1 | Home Loan | 7424380922 | రూ.40.50 | రూ.39,02,318/- |

మీలో చెల్లించవలసిన బకాయి తేది:06-06-2026 నాటికి రూ.39,02,318/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల రెండు వేల మూడు వందల పద్దెనిమిది రూపాయలు మాత్రమే) సదరు సొమ్ము పై తేది:06-06-2026 నుండి ఒప్పందం చేసుకొనిన రేటు ప్రకారం తదుపరి జమకూడు వడ్డీతో సహా చెల్లించుటలో విఫలమైనారు.
ఇందుమూలంగా తేది:06-06-2026 నోటీసు ద్వారా చెల్లించవలసిన బకాయి మొత్తం తేది:06-06-2026 నాటికి రూ.39,02,318/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల రెండు వేల మూడు వందల పద్దెనిమిది రూపాయలు మాత్రమే) చెల్లించవలెనని ఈ నోటీసు తేది.06.06.2026న రిజిస్టర్ పోస్టు ద్వారా మీకు పంపినసూ మాకు తిరిగి వచ్చినది. తేది:06.06.2026 నుండి అంగీకరించబడిన వడ్డీ మరియు ఇతర ఖర్చులు నోటీసు తేదీ నుండి 60 రోజులలో తేది:06-06-2026 నాటికి రూ.39,02,318/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల రెండు వేల మూడు వందల పద్దెనిమిది రూపాయలు మాత్రమే) బకాయి చెల్లించుటలో విఫలమైన యెడల బ్యాంక్ వారు ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ప్రకారం తమ అధికారములను ఉపయోగించి క్రింద ఇవ్వబడిన షెడ్యూలులోని వివరముల ప్రకారం స్వాధీనం చేసుకొను అధికారం కల్గియున్నారు.
సదరు చట్టంలో సెక్షన్ 13(8) ప్రకారం ఋణగ్రహీతలు తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసియున్నది.
ఈ నోటీసు బ్యాంకు వారికి ప్రస్తుతము అమలులో వున్న ఇతర చట్టబద్ధమైన హక్కులకు భంగం వాటిల్లకుండా జారీచేయడమైనది.

స్థిరాస్తి యొక్క వివరములు
గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, పెదవాల్తేరు యొక్క సర్వే నెం.37, ఎంవిపి కాలనీ, సెక్టార్-4, వుడా లేఅవుట్, ఎంవిపాలెం యొక్క ప్లాటు నెం.HIG-215/1&4 లోని 495 చ॥గ॥లు లేదా 413.82 చ॥మీ॥ల విస్తీర్ణంలో 50 చ॥గ॥లు లేదా 41.80 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు ఎస్‌విఎస్ రెసిడెన్సీ, మూడవ అంతస్తులోని 650 చ॥అ॥లు కొలతలతో మరియు సెల్లార్ నందు 80 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియాతో డోర్ నెం.1-84-22, టిఎఫ్-11 మున్సిపల్ అసెస్‌మెంట్ నెం.1086082720తో గల ఫ్లాట్ నెం.11 యావత్తు ఆస్తి. మొత్తం ఆస్తికి హద్దులు: తూర్పు : ఎంవిపాలెం యొక్క HIG ప్లాటు నెం.214/1 & 4 దక్షిణం : 30 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర : ఎంవిపాలెం యొక్క HIG ప్లాటు నెం.216/1 & 4 ఉత్తరం : ఎంవిపాలెం యొక్క HIG ప్లాటు నెం.212/1 & 4 కొలతలు: తూర్పు : 90 అ॥లు లేదా 27.45 మీ॥లు, దక్షిణం : 90 అ॥లు లేదా 15.25 మీ॥లు, పడమర : 90 అ॥లు లేదా 27.45 మీ॥లు, ఉత్తరం : 49 అ॥లు లేదా 14.93 మీ॥లు, మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం.11కు హద్దులు: తూర్పు : కొచ్చెర్ల రవి శంకర్ గారి ఫ్లాట్ నెం.10, దక్షిణం : 30 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర : HIG ప్లాటు నెం.216/1 & 4 ఉత్తరం : కారిడార్.

తేది : 06-06-2026
ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి
ఇండియన్ బ్యాంక్

## అచ్చెర్ల, బంగారయ్య పేట గ్రామాలలో యాంటీ డ్రగ్ క్యాంపియన్ కార్యక్రమం



కసంకోట, జూన్ 10, ప్రభాతవార్త

తుంపాలమ్మ తల్లి జాతర సందర్భంగా 100 రోజుల యాంటీ-డ్రగ్ క్యాంపెయిన్ 2.0 కార్యక్రమంలో భాగంగా అచ్చెర్ల, బంగారయ్య పేట గ్రామాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించాము. గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యాన్ని, విద్యను, కుటుంబ జీవితాన్ని, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని తెలియజేశాము. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, మంచి స్నేహితులను ఎంచుకొని, క్రీడలు, విద్య మరియు సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ప్రజలకు అవగాహన కల్పించాము. మహిళల భద్రత, మహిళలపై నేరాల నివారణ,రోడ్డు భద్రతపై కూడా అవగాహన కల్పించారు. ప్రజలకు శక్తి యాప్, డయల్-112, 100, 1091 వంటి అత్యవసర పోలీసు సేవల గురించి వివరించి, అవసరమైనప్పుడు వాటిని వినియోగించుకోవాలని సూచించాము. ఈ కార్యక్రమంలో కసింకోట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అల్లు స్వామి నాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ కే లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

కసింకోట, జూన్ 10, ప్రభాతవార్త



అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని మైన్స్ శాఖకు అప్పగించినట్లు రసం కూడా అల్లు స్వామి నాయుడు తెలిపారు. కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా, అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు గుర్తించి తనిఖీ చేశారు. తనిఖీలలో సంబంధిత అనుమతి పత్రాలు లేకుండా మట్టి రవాణా చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో, రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం మైన్స్ అండ్ జియాలజీ శాఖ అధికారులకు అప్పగించామని చెప్పారు. మైన్స్ అండ్ జియాలజీ శాఖ అధికారులు పరిశీలించి, నిబంధనలను ఉల్లంఘించినందుకు ప్రతి ట్రాక్టర్‌కు రూ.10000 చొప్పున జరిమానా విధించామని తెలిపారు. ఈ సందర్భంగా కసింకోట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ, అక్రమ మట్టి రవాణా, అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

## చిన్నారులకు యోగాంధ్ర-2026 పోటీలు

నక్కపల్లి, జూన్ 09,ప్రభాతవార్త



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమానికి గ్రామీణ ప్రాంతాలలో విశేష స్పందన కనబడుతుంది. బుధవారం ఉదయం సీతంపాలెం అంగన్వాడీ కేంద్రం సమీపంలో యోగా మాస్టర్ ట్రైనీ ఎన్.వి.ఎస్. ఆచార్యులు ప్రోటోకాల్ ఆసనాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ కల నెరవేరాలంటే వయస్సుతో పనిలేకుండా అందరూ దీనిలో భాగస్వామ్యం కావాలన్నారు. స్థానిక మండల విద్యాశాఖాధికారులు కే.నరేష్, నాగన్నదొర సూచనలమేరకు బుధవారం సీతంపాలెం గ్రామంలో అవగాహన కల్పించామన్నారు. ఈనెల 21న యోగా దినోత్సవంపై ప్రతీగ్రామంలోనూ ఈ కార్యక్రమాలు ప్రతీరోజూ నిర్వహించనున్నట్లు ఆచార్యులు తెలిపారు.

## ఉపమాకలో పర్యటించిన హోంమంత్రి వంగలపూడి "అనిత"..అభివృద్ధి పనులకు శంకుస్థాపన

(నక్కపల్లి, ప్రభాతవార్త)



మండలంలోని ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మంత్రికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు చిత్రపటాన్ని అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ సంస్థ సహకారంతో చేపట్టనున్న ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పుష్కరిణి అభివృద్ధి పనులకు హోంమంత్రి అనిత శంకుస్థాపన చేశారు. అనంతరం ఎస్. రాయవరం మండలం పెదగుమ్ములూరు గ్రామంలో చెరువు అభివృద్ధి పనులకు హోంమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, మాజీ జెడ్పిటిసి కొప్పిశెట్టి కొండబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ టిడిపి నాయకులు కొప్పిశెట్టి జగదీష్, శ్రీను, కోరుకొండ దొరబాబు, మన బాల కొండబాబు, ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి వాసు, పాము గణేశ్వరరావు, తోట అప్పారావు, ఎలమంచిలి చంద్రరావు, చందు, బుజ్జి. జి. సత్తిబాబు, పాయకరావుపేట మండలం టిడిపి అధ్యక్షులు చించెలపు పద్దు తదితరులు ఉన్నారు.

### నార్త్ ఈస్ట్ రైల్వే ప్రాజెక్టుల అధ్యయన యాత్రలో

## రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఎం.పీ సి.ఎం. రమేష్

### పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులతో కలిసి విస్తృత స్థాయి సమీక్షలు

అనకాపల్లి జూన్ 10, ప్రభాతవార్త



రైల్వే స్టాండింగ్ కమిటీ అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో రిషికేష్ కొనసాగుతున్న రైల్వే అభివృద్ధి పనులు మౌలిక వసతుల ప్రాజెక్టులను రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి ఎంపీ డాక్టర్ సి.ఎం. రమేష్, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కీలక రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, కనెక్టివిటీ విస్తరణకు చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధ్యయన యాత్రలో భాగంగా నార్త్ ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే అధికారులు, రైల్వే ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో సమావేశమై ఈశాన్య భారతదేశంలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, కనెక్టివిటీ విస్తరణ, కొనసాగుతున్న ప్రాజెక్టులపై చర్చించారు. ఈశాన్య రాష్ట్రాల్లో రైల్వే నెట్‌వర్క్ బలోపేతం ప్రాంతీయ, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. దేశంలో ఆధునిక రైల్వే వ్యవస్థ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు , రైల్వే శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండేళ్ల అభివృద్ధిపై ఫోటో ఎగ్జిబిషన్

నక్కపల్లి రూరల్ /అడ్డురోడ్డు, ప్రభాతవార్త



పాయకరావుపేట నియోజక వర్గంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో చేపట్టిన సుమారు 1150 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన ఫోటో ప్రదర్శన కార్యక్రమాన్ని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్,జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షుల నాయ కత్వంలో హోం మంత్రి అనిత పరిశీలించి వాటిని వివరించారు. ఈ మేరకు ముందుగా ఉపమాక వెంకటేశ్వర స్వామి చెరువుల అభివృద్ధికి ముందుకొచ్చిన ఏషియన్ పెయింట్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలుపుతూ మేనేజర్‌ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి ,కొండబాబు తదితరులు ఉన్నారు.



## 16న ఉపమాకలో సామూహిక యోగా ప్రదర్శన

### -హోం మంత్రి అనితను కలిసి ఆయుష్ వైద్యాధికారుల బృందం

నక్కపల్లి, జూన్ 10, ప్రభాతవార్త



ఈ నెల 16న టెంపుల్ టూరిజం యోగా స్పాట్ కార్యక్రమంలో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక యోగా ప్రదర్శన జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని పూర్తి విజయ వంతం చేయాలని రాష్ట్ర హోం మంత్రి అనిత ఆదేశించారు. బుధవారం ఉదయం ఆయుష్ వైద్యాధికారుల బృందం డాక్టర్ కె.రఘు, సుజాత, అనూష హోం మంత్రిని కలిసి 16న జరిగే సామూహిక యోగా ప్రదర్శన గురించి వివరించారు. జిల్లాలోనే ఈ కార్యక్రమం ప్రత్యేకత సంతరించుకునేలా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. 16న జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని హోం మంత్రి అనితను ఆయుష్ వైద్యాధికారులు కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారు.

## ప్లాంట్ దుర్ఘటన బాధాకరం..

### కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధితులను ఆదుకున్న తీరు బాగుంది: మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్

అనకాపల్లి జూన్ 10, ప్రభాతవార్త



విశాఖ ఉక్కు కర్మాగారంలో భారీ విస్ఫోటనం మూలంగా 8 మంది చనిపోవడం దురదృష్టకరమైన విషయం అయినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించిన తీరు అందరూ మన్నలు పొందే విధంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘటన జరిగిన వెంటనే కేంద్ర ఉక్కు గనుల శాఖ మాత్యులు కుమారస్వామి సహాయం మంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శాసనసభ్యులు ఎమ్మెల్సీలు బాధితులను పరామర్శించి జరిగిన సంఘటన పరిశీలించి, సంఘటనపై త్రీమెన్ కమిటీ సభ్యులను నియమించి విచారణను 24 గంటల్లో నివేదికను సమర్పించాలని, సంఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం నష్టపరిహారం అందించుటకు ఆదేశాలు జారీ చేశారని, 24 గంటల్లో 25 లక్షలు నష్టపరిహారం, క్షతగాత్రులు 10 లక్షలు, అలాగే ఎనిమిది మంది ఉద్యోగులకు కోటి 72 లక్షలు ఇచ్చే విధంగా, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా అదే నష్టపరిహారం చెల్లిస్తామని లోకేష్ ప్రకటన అందరినీ ఆశ్చర్యపరిచిందని నాగ జగదీష్ అన్నారు. నాడు వైసీపీ ప్రభుత్వంలో ఎల్జి ఫార్మర్స్ బాధ్యతలకు జగన్ రెడ్డి హ్యాండ్ ఇచ్చి, నేటి శాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై వైసీపీ శవ రాజకీయాలు చేస్తుంటే, గతంలో ఎల్జి పాలిమర్స్ గ్యాస్ దుర్ఘటనలో ఆ పార్టీ వ్యవహరించిన తీరును ఉత్తరాంధ్ర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, కనీసం బాధితులను పరామర్శించకుండా జగన్ రెడ్డి విశాఖ విమానాశ్రయం ఉండే తిరిగి ప్రయాణం చేసిన వైనం గుర్తు చేసుకుంటున్నారని, జగన్ సర్కార్ కేవలం పరిహారంతో చేతులు దులుపు కోవడమే కాకుండా, న్యాయం కోసం పోరాటం చేసిన బాధితులపై కేసులు పెట్టి వేధించారని, కానీ కోటను ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబుతో ఎల్జి పాలిమర్స్ యాజమాన్యం నుండి మరో 120 కోట్లు పరిహారాన్ని అందించి, స్థానిక సౌకర్యాలకు మెరుగుపరచాలని ఆదేశించారని అన్నారు ఇప్పుడు కూడా స్టీల్ ప్లాంట్ ప్రమాదం జరిగిన వెంటనే బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, కేంద్రమంత్రి చనిపోయిన కుటుంబానికి శాశ్వత ఉద్యోగాన్ని కల్పిస్తామని, కాంట్రాక్ట్ వర్కర్ కుటుంబానికి కూడా పర్మినెంట్ ఉద్యోగం చదువుకున్న వారికి కల్పిస్తామని, అలాగే ఉక్కు కర్మాగారానికి సొంత గనులు అడుగుతున్న సందర్భంగా అనకాపల్లి జిల్లాల్లో అర్సెలర్ మిట్టల్ కర్మాగారానికి స్లరీ పైప్ లైన్ అనుమతి ఇచ్చామని, అలాంటిదే విశాఖ ఉక్కు కర్మాగారానికి తీసుకువస్తామని నారా లోకేష్ ప్రకటించడం అతని నిబద్ధత తెలియజేస్తుందని నాగ జగదీష్ అన్నారు.

## యోగాంధ్రపై విస్తృత ప్రచారం

### వైద్యాధికారులు రఘు, సుజాత, అనూష

నక్కపల్లి, జూన్ 10, ప్రభాతవార్త



ఈ నెల జూన్ 21 ప్రపంచ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విస్తృత ప్రచారం చేస్తున్నామని వేంపాడు, సర్వసిద్ధి, కన్నూరుపాలెం ఆయుష్ వైద్యాధికారులు డాక్టర్ కె.రఘు, సుజాత, అనూష చెప్పారు. బుధవారం నక్కపల్లి మండలంలో పలువురు అధికారులను కలిసి, ఈ నెల 16న జరగనున్న సామూహిక యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజు ఉదయం ఉ సమాక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే సామూహిక యోగా ప్రదర్శనకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సామూహిక యోగాసనాలు చేసే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వర రావు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి తదితరులను కలిశారు.

## గంజాయి, మత్తుపదార్థాల రహిత జిల్లాగా అనకాపల్లిని తీర్చిదిద్దడమే ధ్యేయం

### జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి, జూన్ 10, ప్రభాతవార్త

గంజాయి, మత్తుపదార్థాల రహిత జిల్లాగా అనకాపల్లిని తీర్చిదిద్దడమే ధ్యేయం చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ సమీక్షా సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల రవాణా, విక్రయాలు వినియోగంపై పోలీస్ శాఖ తీసుకుంటున్న కఠిన చర్యలను ఎస్పీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో మత్తుపదార్థాల నిర్మూలనకు అంతర-శాఖల సమన్వయం ఎంత కీలకమో దిశా నిర్దేశం చేశారు. జిల్లా పోలీస్ శాఖ నిరంతర నిఘా కారణంగా గంజాయి కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణాదారులపైనే కాకుండా, వినియోగించే వారిపై కూడా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని ఎస్పీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 12 పోలీస్ స్టేషన్లకు మొత్తం 300 డ్రగ్ డిటెక్షన్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందని వెల్లడించారు. గంజాయి సేవించే అలవాటు ఉన్నట్లు అనుమానం వస్తే, ఈ అత్యాధునిక కిట్ల ద్వారా తక్షణమే పరీక్షలు నిర్వహించి, గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయితే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 37 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిలో 34 మందిపై నిరోధక ఉత్తర్వుల కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, ఇప్పటికే 15 మందికి సంబంధించిన డిటెన్షన్ ఆర్డర్స్ వచ్చాయని, అందులో 12 ఆర్డర్లను విజయవంతంగా అమలు చేసి నిందితులను జైలుకు పంపామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ, కేవలం పోలీస్ శాఖ మాత్రమే కాకుండా అన్ని ప్రభుత్వ శాఖల నోడల్ అధికారులు సమన్వయంతో బాధ్యతగా పనిచేసినప్పుడే జిల్లాను మత్తు రహితంగా మార్చగలమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా కింది ఆదేశాలను జారీ చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలి. కాలేజ్ హాస్టళ్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. గంజాయి హాట్‌స్పాట్‌లుగా మారే అవకాశం ఉన్న నిర్మానుష్య ప్రాంతాలు, పాడుబడిన భవనాలను క్లియర్ చేయాలి. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాల వెలుతురును మెరుగుపరచాలి. అనుమానితులకు మెడికల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి. పోలీసులకు సరఫరా చేసిన డ్రగ్ డిటెక్షన్ కిట్ల వినియోగాన్ని, ఆసుపత్రుల్లో చికిత్స సౌకర్యాలను పర్యవేక్షించాలి. అంతర్-జిల్లా, అంతర్-రాష్ట్ర బస్సు సర్వీసులలో లగేజ్ తనిఖీలు ముమ్మరం చేయాలి. జిమ్‌లు, మెడికల్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచి, ప్రిస్క్రిప్షన్ లేకుండా బాడీబిల్డింగ్ కోసం వాడే మత్తు ఇంజెక్షన్లు, మాత్రలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. రైల్వే స్టేషన్లలో లగేజ్ స్కానింగ్ పెంచాలని, కొరియర్, పార్శిల్ సర్వీసుల వివరాలపై డేటా సేకరించి నిఘా పెట్టాలని, సంయుక్త దాడులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ, ఎక్సైజ్, విద్యా, వైద్య, రవాణా శాఖ, అగ్రికల్చర్, డి.ఆర్.ఐ, ఎన్.సి.బి, కస్టమ్స్, రైల్వే, ఆర్.టీ.సీ తదితర ఉన్నతాధికారులు, ఈగల్ సెల్ జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## నూకాంబికను దర్శించుకున్న అమృత్ యాత్ర స్వామీజీలు

### ఘనంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి జూన్ 10, ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారిని స్వామి చిన్మయానంద అమృత్ యాత్ర స్వామీజీలు బుధవారం దర్శించుకున్నారు. మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ వీరికి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు, దేవస్థాన సిబ్బంది పూర్ణకుంభంతో వేదమంత్రాలతో, మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో శాస్త్రోక్తంగా పూజలు జరిపి ఆశీర్వచనం చేసి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులచే 1953లో స్థాపించబడిన చిన్మయ మిషన్, ప్రపంచవ్యాప్త ఆధ్యాత్మిక విద్య, యువజన కార్యక్రమాలు, విలువ ఆధారిత పాఠశాల విద్య, సామాజిక సేవా కార్యక్రమాలను అందిస్తోంది. ఈ ఉద్యమం వ్యక్తులకు వేదాంత జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక ఎదుగు దలకు ఆచరణాత్మక సాధనాలను అందించడం, తద్వారా వారు సమాజానికి సానుకూల భాగస్వాములుగా మారేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మిషన్ లో భాగంగా చిన్మయ అమృత్ యాత్ర చక్రాలపై తిరిగే జ్ఞానం, బహిరంగ ప్రసంగాలు, విద్యాపరమైన సంభాషణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సత్సంగాలు, సామూహిక సమావేశాలు ఇంకా మరెన్నో కార్యక్రమాల ద్వారా యువతను చైతన్యపరిచే ఈ ఉద్యమం 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని జరుపుకుంటున్న సందర్భంగా చిన్మయ అమృత్ మహోత్సవ్ ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఈ చిన్మయ యాత్ర. గురుదేవుని స్వామి చిన్మయానంద దార్శనికతను, వారస త్వాన్ని, శాస్త్రాల జ్ఞానాన్ని దేశవ్యాప్తంగా 295 రోజుల ఈ యాత్ర 2026 అక్టోబర్ 23న ఢిల్లీలోని భరత్ మండపంలో ముగించు ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానమునకు భారతదేశ పర్యటనలో భాగంగా బుధవారం అమృత్ యాత్ర అమ్మవారి దేవాలయానికి విచ్చేశారు. దేవస్థానం చైర్మన్ పీల నాగ శీను, డైరెక్టర్లు, డిఈ సుజాత, ఈవో వై శ్రీధర్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## గాలి, వానలు బీభత్సం భారీ వృక్షాలు నేలకొరిగాయి.. పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం



ఎస్.రాయవరం,జూన్ 10, ప్రభాతవార్త

మండలంలో బుధవారం సాయంత్రం భారీగా,గాలి, వానలు రావడంతో భారీ వృక్షాలు నేలకొరిగాయి పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో సుమారు పది గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలిగింది జాతీయ రహదారిపై నేలకొరిగిన వృక్షాలను, పోలీస్ సిబ్బంది,జాతీయ రహదారి భద్రత సిబ్బంది క్లియర్ చేశారు. పెంకుటిల్లు ధ్వజమైంది.




## పేట నియోజకవర్గంలో 1,150 కోట్లతో సంక్షేమం- అభివృద్ధి పనులు : హోంమంత్రి అనిత

నక్కపల్లి, జూన్ 10, ప్రభాతవార్త



పాయకరావుపేట నియోజకవర్గంలో రెండేళ్ల కాలంలో 1150 కోట్ల రూపాయలు నిధులు తీసుకురావడం జరిగిందని ఆస్ఫూర్తితో అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకరించారని, గత ఐదేళ్ల విధ్వంసకర పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం దిశగా పరుగులు పెడుతోందని హోంమంత్రి వంగలపూడి అనిత సంతోషం వ్యక్తం చేశారు. నక్కపల్లి క్యాంప్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, మంత్రి నారా లోకేష్ చురుకైన కృషితో రాష్ట్రం అభివృద్ధి మార్గంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలు ఫోటోలు ముద్రించి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పాయకరావుపేట నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో "తల్లికి వందనం" పథకం ద్వారా రూ.49 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. "ఎన్టీఆర్ భరోసా పింఛన్లు" కింద అవ్వలు, తాతలు, వితంతువులు, మత్స్యకారులు, దివ్యాంగుల సంక్షేమం కోసం మొత్తం రూ.501 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. "అన్నదాత సుఖీభవ" పథకం కింద రైతులకు రూ.73 కోట్లు అందించామని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, సముద్రంపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకార కుటుంబాల కోసం రూ.32 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ మేర ఆటో కార్మికుల సంక్షేమం కోసం "ఆటో డ్రైవర్ సేవలో" పథకం కింద రూ.2.55 కోట్లు, అత్యవసర వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.81 కోట్లు అందించినట్లు వివరించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 871 పనులకు రూ.118 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా 172 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించినట్లు చెప్పారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో 36 పనులకు గాను 137 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి కోసం రూ.130 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్ కింద రూ.66 కోట్ల వ్యయంతో 244 పనులు చేపట్టినట్లు తెలిపారు. సాగునీటి రంగంలో 92 పనుల కోసం రూ.16 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం కింద నియోజకవర్గంలోని 2,513 పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ అందించే లక్ష్యంతో రూ.18 కోట్లు వ్యయం చేసినట్లు పేర్కొన్నారు. పెట్టుబడులు, ఉపాధి కల్పనలో కూడా ప్రభుత్వం ముందంజలో ఉందని హోంమంత్రి తెలిపారు. ఏఎన్ఎంఎస్ స్టీల్ ప్లాంట్‌కు రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో శంకుస్థాపన జరిగిందని, దీని ద్వారా 55 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. 4,500 ఎకరాల్లో రూ.11 వేల కోట్ల పెట్టుబడితో 70కి పైగా ఫార్మా కంపెనీల స్థాపనకు బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజల కోసం ప్రత్యేకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, నక్కపల్లి మండలం రాజయ్యపేటలో రూ.24.77 కోట్లతో, దొండవాకలో రూ.23.90 కోట్లతో రెండు ప్రధాన మత్స్యకార జెట్టీల నిర్మాణం జరుగుతోందన్నారు. రాయవరం మండలం సోముదేవుపల్లి వద్ద వరహానది ఉధృతి నుంచి గ్రామాలు, పంట పొలాలను రక్షించేందుకు రూ.9.95 కోట్లతో రక్షణ గోడ నిర్మిస్తున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా రవాణా సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం పందూరు వంతెనను రూ.5.75 కోట్లతో, జల్లూరి వంతెనను రూ.4.25 కోట్లతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఆధ్యాత్మిక పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5.46 కోట్లు కేటాయించి పనులు చేపట్టినట్లు తెలిపారు. పాయకరావుపేట పట్టణ ప్రధాన రహదారి అభివృద్ధి కోసం రూ.3.5 కోట్లు మంజూరు చేసినట్లు, అలాగే రూ.61 లక్షల వ్యయంతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ఎస్.రాయవరం మండలం పెనుగొల్లులో రూ.54.70 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నక్కపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, ఎలమంచిలి నియోజకవర్గంలోని మూడు మండలాలను కలిపి అడ్డురోడ్డులో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. న్యాయ సేవల విస్తరణలో భాగంగా నక్కపల్లిలో సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) ఏర్పాటు కోసం ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని, ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఇప్పటికే జారీ అయినట్లు చెప్పారు. విద్యారంగంలో మెగా డీఎస్సీ ద్వారా పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన 147 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తూ కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని,పాయకరావుపేట నియోజకవర్గం కూడా అభివృద్ధి ఫలాలను వేగంగా అందుకుంటోందని ఆమె స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కొన్ని విషయాలు కావాలని రాజకీయం చేస్తున్నారన్నారు. ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన చోరీ విషయంలో 48 గంటల్లోనే నిందితులను పట్టుకున్నారని అన్నారు. దొంగ ఎవ్వరైనా దొంగేనని, దొంగకు కులాలు, మతాలు, పార్టీలు ఉండవని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు,అమలకంటి అబద్ధం, చించెలపు పద్దు, పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టిబుజ్జి, గుర్రం రామకృష్ణ, గోసల శ్రీకాంత్ ,వైబోయిన వెంకటరమణ, తో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

## టీబీ నిర్మూలనకు ముమ్మర కసరత్తు..

### రాజాంలో ఇంటింటా సర్వే, 110 మందికి ఎక్స్‌రేలు



బుచ్చయ్యపేట, జూన్ 10, ప్రభాతవార్త

బుచ్చయ్యపేట మండలంలోని రాజాం గ్రామంలో క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన లక్ష్యంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న టీబీ ముక్త భారత్ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఈ శిబిరం జరిగింది. వైద్యాధికారి డా. డి. సంధ్యారాణి పర్యవేక్షణలో గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి టీబీ లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించారు. అనంతరం అనకాపల్లి జిల్లా క్షయవ్యాధి విభాగం నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన పోర్టబుల్ డిజిటల్ ఎక్స్‌రే యంత్రంతో మొత్తం 110 మందికి ఉచిత ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, టీబీ పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రివేళ చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే ఇతరులకు వ్యాపించకుండా అరికట్టవచ్చని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పరీక్షలు, ఉచిత మందులు, పోషకాహార సహాయాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. టీబీ బాధితులపై వివక్ష చూపకుండా కుటుంబ సభ్యులు, సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.టీబీ నిర్మూలన లక్ష్య సాధనలో భాగంగా మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా ప్రత్యేక ఎక్స్‌రే శిబిరాలు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయవ్యాధి విభాగం పర్యవేక్షకులు పరంజి, పెంటయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు చి. రవణ, ఆరోగ్య సహాయకులు నాయుడుబాబు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా డాక్టర్ షహనాజ్ (వ్యాయమ ఉపాధ్యారాలు)

అనకాపల్లి జూన్ 10, ప్రభాతవార్త



నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు సింగంపల్లి అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చిన్నదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యారాలుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ షహనాజ్‌ని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఆమెకు బుధవారం అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు సింగంపల్లి అప్పలనాయుడు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు బోణి అప్పలనాయుడు, గౌరవ అధ్యక్షులు సూరిరెడ్డి జగన్ మోహన్, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవింద నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ రామమూర్తి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు తుంపాల వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి నక్కా శ్రీనుబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శులు కృష్ణంరాజు, వరప్రసాద్ కార్య నిర్వాహక అధ్యక్షులు వేచలపు నాగేశ్వరావు తదితరులు అందజేసి, అభినందించారు.

vsp11:vsp11.qxd 10-06-2026 21:03 Page 1






## పిల్లలకు మానసిక, శారీరక ఎదుగుదలను గుర్తించాలి

### ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి శారదాదేవి

పాడేరు,జూన్10, ప్రభాతవార్త:



పిల్లలకు మానసిక, శారీరక ఎదుగుదలను అంగన్వాడీ కార్యకర్తలు ముందుగానే గుర్తించి కృత్రిమ మేధస్సు సాంకేతిక వినియోగించు కోవాలని అంగన్వాడీ టీచర్లకు నవ చేతన యాప్ ద్వారా అవగాహన శిక్షణ కార్యక్రమంలో పాడేరు సీడీపీఓ శారదా దేవి పేర్కొన్నారు. రెండురోజులు పాటు జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో పిహెచ్సి డాక్టర్లు, అంగన్వాడీ సూపెర్వైసోర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా ఇంటెన్సివ్‌పై అవగాహన తప్పనిసరి

డుంబ్రిగుడ, జూన్ 10, ప్రభాతవార్త:



ఓటరు జాబితాలకు సంబంధించి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణులు అవగాహన పెంచుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరావు సూచించారు. మండల కేంద్రంలోని కిడారి భవన్లో మండల స్థాయి క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిల శిక్షణ శిబిరంతోపాటు అత్యవసర మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలోనే పార్టీ బలోపేతానికి సమిష్టగా కృషి చేయాలన్నారు. దొంగ ఓట్ల తొలగింపు, కొత్తగా ఓటర్లను చేర్పించడం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి రాబోవు ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేద్దామని ఆయన అన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి నాగరాజు, ప్రధాన కార్యదర్శి రవి, తెదేపా మహిళా అధ్యక్షురాలు లావణ్య, టీఎన్టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, పీఏసీఎస్ చైర్మన్ సుబ్బారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

డుంబ్రిగుడ, జూన్ 10, ప్రభాతవార్త:



నూతన విద్యా సంవత్సరం ఈనెల 12 న ప్రారంభం కానుండడంతో మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత హైస్కూల్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ బుధవారం చేపట్టారు. స్థానిక మండల ఎంఈఓ 2 జి గిన్ను ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధి వారీగా ప్రైవేట్ వాహనాల్లో నేరుగా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించే విధంగా చర్యలు తీసుకొని పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గతంలో ఉపాధ్యాయులే మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ వచ్చి పుస్తకాలను తీసుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఈ ఏడాది ప్రైవేట్ వాహనాలను ఏర్పాటు చేసి ప్రతి పాఠశాలలకు పుస్తకాలను అందించే విధంగా చర్యలు చేపట్టడంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్పిలు, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## కించమండలో మహిళాల భద్రతపై అవగాహన ర్యాలీ

డుంబ్రిగూడ, జూన్ 10, ప్రభాతవార్త:



మండలంలోని కించు మండ వారపు సంతలో మహిళా భద్రతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై సురేష్ మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు మహిళల సంబంధించి హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమంతో పాటు మహిళలకు వర్తించే చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మెంబర్ కృష్ణకుమారి సిడిపిఓ మహిళా పోలీసులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాల పంపిణీ

గూడెంకొత్తవీధి, జూన్10, (ప్రభాతవార్త):



మండల కేంద్రంలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు తెలిపారు. ఈ సంవత్సరం నుండి ఆన్లైన్ (డి కృషి) పద్ధతిలో విత్తనాల పంపిణీకి రైతు సేవ కేంద్రాలలో ఏర్పాట్లు చేశామని రైతులు ఆధార్,పట్టా పాసు పుస్తకాలు తీసుకొని మీ సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న 90% రాయితీ పై వరి విత్తనాలు తీసుకోవాలని ఆయన కోరారు. నేడు మండల కేంద్రంలోని ప్రారంభం అయిన తర్వాత అన్ని రైతు సేవా కేంద్రాలలో యధావిధిగా వరి విత్తనాల పంపిణీ జరుగుతుందన్నారు. ఏడాది వారి రకాలలో జీలకర్ర సన్నాలు, నెల్లూరు సన్నాలు,ఆర్జిఎల్ మొదలగు రకాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు.

## 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం : కలెక్టర్

పాడేరు, జూన్10, ప్రభాతవార్త:



ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో థిమెటిక్ ట్రైబల్ యోగ ఈ నెల 11 వ తేదీ నేడు గురువారం ఉదయం 6 గంటలకు 500 మందితో యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ టి. నిశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ గురువారం నిర్వహించబోయే యోగా కార్యక్రమానికి పాడేరు ఐటిడిఏ పివిటిజి ఏపీవో వెంకటేశ్వరరావు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. యోగా కార్యక్రమంలో 500 మందికి తక్కువ కాకుండా పాల్గొనే విధంగా ఏర్పాట్లు చూడాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యా యినులు యోగా కార్యక్రమంలో నిర్వాహకులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. యోగ కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలలో మౌలిక వసతులు ఏర్పాట్లు, మ్యాట్లు, యోగాసనాలు వేయడానికి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ తాగునీటి సదుపాయం, అవసరమైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అందరూ విధిగా కామన్ యోగా ప్రోటోకాల్ పాటించాలన్నారు. స్కూల్, కాలేజ్ విద్యార్థులు, ఎన్ సిసి , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు, యూవత పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులను, స్వాతంత్ర్య సమరయోధులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు.

## రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం

### ఒక పక్క క్రీడా మైదానంలో జాయింట్ వీల్ పరికరాలు .. క్రీడా కార్యక్రమాలు చేసేది ఎట్టా

పాడేరు, జూన్10, ప్రభాతవార్త:



రెండు రోజుల్లో పాఠశాలలు తెరవబడుతున్నాయి. బాలబాలికల క్రీడా మైదానంలో ఆడుకోవడానికి చాలా అసౌకర్యంగా ఉంది. మోదకొండమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి జాయింట్ వీల్ పరికారాలు క్రీడా మైదానంలో ఇంకా ఖాళీ చేయకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉన్నాయి. పండగ అయిపోయి నెల రోజులు దాటుతున్న కూడా వారు ఇంకా కాళీ చేయకపోవడం వల్ల క్రీడా కార్యక్రమాలకు చాలా కష్టంగా ఉన్నాయి. క్రీడా మైదానంలో జాయింట్ వీల్ పరికారాలు ఉండటం వల్ల క్రీడా కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుంది నెల రోజులు దాటినా కూడా ఇంకా ఖాళీ చేయకపోవడం చాలా విడ్డూరంగా ఉంది, కావున వెంటనే క్రీడా మైదానంలో ఉన్నటువంటి జాయింట్ వీల్ పరికారాలు వెంటనే తీయవలసిందిగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు కోరుతున్నారు. మరోవైపు అంతర్జాతీయ యోగా కార్యక్రమాలు సందర్భంగా కూడా యోగ కార్యక్రమాలు ఇక్కడే చేయవలసి ఉందని తెలిసింది అప్పుడు ఇంకా కష్టంగా ఉంటుంది కాబట్టి క్రీడా మైదానంలో ఇంకా తిష్ట వేసి కోసటువంటి జాయింట్ వీల్ పరికారాలు వెంటనే తీసివేయాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పిల్లలు కోరుతున్నారు.

## ముంచంగిపుట్టులో జిల్లా స్థాయి ' ప్రత్యేక పీజీఆర్ఎస్'

### - 255 అర్జీలు రాక - జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ హాజరు

ముంచంగిపుట్టు, జూన్ 10, (ప్రభాతవార్త):



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించి, వారి సమస్యనువిన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామల నుండి వచ్చిన అర్జీ దారులు వారి అర్జీ ను సమర్పించి వారి సమస్యలను జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ , ఐ టి డి ఏ పి ఓఆదిత్య వర్మ వారికీ తెలియజేసారు. ఈ ప్రత్యేక పీజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా,వివిధ గ్రామాలకు రోడ్లు, మంచినీరు, హెల్త్, ఏపీ ఎం ఐ పి, ఇరిగేషన్,ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్,పి ఆర్ సమస్యలు , ఇతర సమస్యలపై మొత్తం 255 అర్జీలు నమోదయ్యాయి. వాటిలో కొన్ని రెవెన్యూ శాఖ సంబంధించిన భూ సమస్యలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, సరిహద్దు వివాదాలకు సంబంధించి ముంచంగి పుట్టు మండలం లోని మారుమూల గ్రామాలకు సంబంధించి గ్రామ పంచాయతీలకు సంబంధించి రోడ్స్, మంచినీరు ఏర్పాట్లు పై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వినతులను అందించి, వారి సమస్య త్వరతగతిన పరిష్కరించాలని, అదేవిధంగా సీసీ, బి టి రోడ్స్ వెయ్యాలని ముంచంగి పుట్టు, గాంధీ నగర్, కిల్లోగూడ గ్రామ స్తులు కోరారు. బొంద్రు గూడ గ్రాముస్తులు గత 16 సంవత్సర నుండి వ్యవసాయ భూ వివాదలో ఉందని కిమ్ముడు సోన్ను రైతుల సాగులో భూములకు సంబందించిన సమస్య తీర్చాలని కోరారు. కించెయిపుట్టు గ్రామం నుండి పాత్ర సునీత తన భర్త డెత్ సర్టిఫికెట్ కోసం, కుమ్మురిపడ గ్రామం కొర్ర సీతారావు అమ్మ ఓడి, రేషన్ కార్డు రాలేదని,కించయిపుట్టు పంచాయతీ, ధారపల్లి గ్రామంలో అంగన్వాడీ సెంటర్ కావాలని పలువురు అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం నమోదు చేశారు. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, విద్యుత్, త్రాగునీరు, రోడ్స్, పెన్షన్, విద్యుత్, గురుకులం, మత్స్యశాఖ, గృహ నిర్మాణ, అంగన్వాడి బిల్డింగ్స్, ఇతర సంక్షేమ పథకాలు సంబంధించి అర్జీలు దాఖలయ్యాయని,వాటిపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంటనే స్పందించి అర్జీదారుల సమస్య ను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. బుధవారం ఉదయం మండలంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద జిల్లాస్థాయి పీజిఆర్ఎస్ కార్యక్రమం పాల్గొని అనంతరం ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పి జి ఆర్ ఎస్ దరఖాస్తులపై సంబంధిత అధికారులు అర్జీదారంతో మాట్లాడి సమస్యను సున్నితంగా పరిశీల దిశగా తీసుకురావాలని తెలిపారు. సమస్యను మండల స్థాయి లోనే పరిస్కరించినప్పుడు సమస్యపై సమాధానం,అర్జీ దారునికి వివరించాలని, ఒకవేల పరిష్కారం కానీ ఎడల ఆ సమస్య ఎందుకు పరిష్కారం కాదు ఆ సమస్య యొక్క వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. అర్జీ ధారుని సమస్యలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసినప్పుడు ఐవీఆర్ఎస్ లో నెగిటివ్ రాదని, పిటిషన్స్ రిపీట్ కాకుండా ,అర్జీదారని పిటిషన్లు గడువులోగా పరిష్కరించక పోగా వారితో సక్రమంగా మాట్లాడకుండా, సమస్యను పరిష్కరించకుండా, ఉన్నందువల్లే అర్జీలు పదేపదే రిపీట్ అవుతున్నారని అధికారులు గమనించాలని పేర్కొన్నారు. ఈలా పి జి ఆర్ ఎస్ కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహించడం వల్ల ఈ మండల పరిధిలోని సమస్యలు మండలంలోనే ప్రజలకు వివరించవచున్నారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారులకోసం వివిధ శాఖలు ఏర్పాటుచేసిన నమోదు కేంద్రాలు, ఆధార్ నమోదు కేంద్రంలో, ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా 38 మందికి వివిధ సమస్యలపై తనకి చేయించుకున్నారని డాక్టర్. రమ్యప్రభ, పి హెచ్ఎన్ పెద్దమ్మితో పాటు ఏఎన్ ఏంలు, హెల్త్ అసిస్టెంట్స్, సి హెచ్ఓస్, ఆశ వర్కర్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి (ఎఫ్ ఏ సి ) ఎంవిఎస్ లోకేశ్వరరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి భుజంగరావు, ముంచంగి పుట్టు మండల స్పెషల్ అధికారి వి. మోహన్ రావు, ఎంపీడీవో ధర్మారావు, జిల్లా, మండల స్థాయి శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

### జాయింట్ కలెక్టర్ , ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతి

ముంచంగిపుట్టు, జూన్ 10, (ప్రభాతవార్త):



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రం లోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక ఎంపీడీవో కే ధర్మారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల ఆదివాసి గిరిజన విలేకరుల సంఘం మండల అధ్యక్షుడు కాంతారు మోహన్ , విలేకరుల సంఘం సభ్యులు కలసి అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ , ఐటీ డి ఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ లకు వినతి పత్రాన్ని అందజేసారు. విలేకరుల సంఘం మండల అధ్యక్షుడు కాంతారు మోహన్,అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజా తో వివరిస్తూ... సుమారు 15ఏళ్లుగా పత్రిక విలేకరులుగా పనిచేస్తున్న ఆదివాసి గిరిజన విలేకరులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు మేరకు గతంలో అల్లూరి జిల్లా కలెక్టర్ విధుల్లో ఉన్న సుమిత్ కుమార్ ప్రత్యేక ఉత్తర్వులలో ఏజెన్సీ 11 మండలాలలోని అన్ని మండలాల ఆదివాసి గిరిజన విలేకరులకు గృహ నిర్మాణ స్థలాలు కేటాయించాలని జీవోజారి చేశారని. గిరిజన విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రత్యేక జీవో ను ముంచింగి పుట్టు మండల తహసిల్దార్ కు నివేదిక పంపించార ని విలేకరులు సంఘనాయకులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. వినతి పత్రాన్ని స్వీకరించిన జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ సానుకూలంగా స్పందించి ఆమె మాట్లాడుతూ సంబంధిత రెవిన్యూ శాఖ అధికారులను తక్షణమే పిలిపించి గిరిజన విలేకరులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కొరకు మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు గుర్తించి సర్వే చేపట్టి ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆమె డిప్యూటీ తహసిల్దార్ కు ఆదేశించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు , గ్రామ కంఠం, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములు గుర్తించి సర్వే చేసి తమకు తక్షణమే నివేదికను అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాలకు అంగీకరిస్తూ మండల కేంద్రంలో గుర్తించి సర్వే నిర్వహించి ఆదివాసి గిరిజన విలేకరులకు గృహ నిర్మాణాలకు స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. ముంచింగి పుట్టు మండల ఆదివాసీ గిరిజన విలేకరులు సంఘ సభ్యులు గంపరాయి కోటేశ్వరరావు , పాంగి పులి రాజు, కిముడు రాంబాబు, కూడా మోహన్, కూడా అనిల్ కుమార్, పాంగి భాస్కర్ రావు , మండల ప్రెస్ క్లబ్ సభ్యులు ఎస్ సురేష్ పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ సీనియర్ నేత నాగరాజు



పాడేరు,జూన్10, ప్రభాతవార్త.:

పాడేరు మండలం నక్కలపుట్టు గ్రామంలో కొలువుదీరి ఉన్న శ్రీ మొదకొండమ్మ అమ్మవారిని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పంచాయితీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొర్రా నాగరాజు,పాడేరు మాజీ ఎంపిపి బొర్రా విజయరాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొర్రా నాగరాజు దంపతులు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను ప్రధాన అర్చకులు అందజేశారు.

## పాడేరు ఆర్టీసీ కాంప్లెక్‌ను సందర్శించిన కలెక్టర్ నిశాంతి



పాడేరు,జూన్10, ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి పాడేరు ఏపీఎస్ఆర్టీసీ బస్ స్టేషన్ ను బుదవారం సాయంత్రం సందర్శించారు. బస్ స్టేషన్లో ఉన్న పరిశుభ్రత, తాగునీటి సదుపాయము టాయిలెట్స్ సదుపాయము బస్సు సమయాలు తెలిపే బోర్డులు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రయాణికులతో కలెక్టర్ మాట్లాడి వారికి ప్రస్తుతం అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ప్రయాణికులు కూడా బస్సు స్టేషన్ లో నీటి సౌకర్యాలు పరిశుభ్రత టాయిలెట్స్ పరిశుభ్రత బాగున్నాయని కలెక్టర్ కి తెలిపాటు. ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు పాడేరు నుండి అనకాపల్లి ఒక ట్రిప్పు కల్పించాలని ప్రయాణికులు కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పి. శ్రీనివాస్ ,ఆఫీస్ సూపరిండెంట్ శ్రీనివాస్ కుమార్, కోటి రాహుల్,గ్యారేజీ ఇంచార్జ్ లక్ష్మణరావు, కంప్యూటర్స్ ఇన్చార్జ్ ప్రసాద్ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ భద్రయ్య, ట్రాఫిక్ కంట్రోలర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు కేంద్రంలో తప్పిన పెను ప్రమాదం

పాడేరు,జూన్10, ప్రభాతవార్త:



బుధవారం సాయంత్రం ఈదురు గాలులు కూడిన వర్షం కారణంగా పాడేరు మెయిన్ రోడ్డు శ్రీనివాసా లాడ్జి సెంటర్ వద్ద విద్యుత్ వైర్లు తెగి ద్విచక్ర వాహనంపై పడడంతో వాహన చోదకుడు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీంతో సకాలంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసిమరమ్మతులు చేపట్టారు. విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తి సురక్షితంగా ఉన్నారు. అయితే సుమారు పావుగంటసేపు మెయిన్ రోడ్డు వద్ద కరెంటు వైర్ నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో స్పందించడంతో ఎటువంటి నష్టం జరగలేదు.

## శోక 'జన' సంద్రం కెజీహెచ్ శవాగారం

### మృతుల కుటుంబాల ఓదార్పునకు పోటాపోటీగా పలు పార్టీలు

### అధికార కూటమి తరపున రాష్ట్ర మంత్రులు లోకేష్, పవన్, శ్రీనివాసవర్మ, ఇతర మంత్రులు

### ప్రతి పక్షం తరపున వైఎస్ఆర్ సిపీ, వామపక్ష కార్మిక సంఘాల నేతల పరామర్శలు

విశాఖపట్నం, జూన్ 9, ( ప్రభాత వార్త ) :



స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటన లో అసువులు బాసిన మృతుల బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు ,అధికార కూటమి,ప్రతిపక్ష వైఎస్ఆర్సిపీ వామ పక్ష పార్టీలు , కార్మిక సంఘాల నాయకులు ఓదార్పు లు, పరామర్శలతో మంగళవారం కెజీహెచ్ మార్చురీ ప్రాంగణం శోక 'జన' సాగరాన్ని తలపించింది. తొ లుత ఈ ప్రమాదం లో తీవ్రంగా



గాయపడిన క్షతగాత్రులు చికిత్స పొందుతున్న నగరంలోని కిమ్స్ ఐకాన్, ఎంజీఎం - సెవెన్ హిల్స్ ఆసుపత్రి లను. సందర్శించి అక్కడ భాదితులు ను వారి కుటుంబాలను కలుసుకుని పరామర్శించిన రాజకీయ పార్టీ ల నేతలు చివరగా మధ్యాహ్నం సమయానికి కెజీహెచ్ మార్చురీకి చేరుకొని అప్పటికే మృతుల శవ పరీక్షల కోసం ఎదురు చూస్తున్న మృతుల బంధువులు కుటుంబ సభ్యులు ను ఓదార్చేందుకు పోటీ పడ్డారు. దాంతో మార్చురీ ప్రాంగణం ఏడుపులు పెడ బొబ్బలతో గంభీరంగా మారింది. అధికార కూటమి తరపున ప్రమాద భాదితులు మృతుల కుటుంబాలను రాష్ట్ర మంత్రులు లోకేష్ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్,, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మంత్రులు అనిత వాసంశెట్టి శుభాష్, గుమ్మడి సంధ్యా రాణి నాదేండ్ల మనోహర్, విశాఖ ఎంపీ శ్రీభారత్, స్థానిక శాసన సభ్యులు గణబాబు వంశీ కృష్ణ శ్రీనివాస్ సుందర్‌పు విజయ కుమార్ టీడి పీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తదితరులు పరామర్శిచారు. వైఎస్ఆర్సిపీ నుంచి శాసన మండలి ప్రతి పక్ష నేత బొత్స సత్యనారాయణ మాజీ మంత్రులు కూరసాల కన్నబాబు,జీ. అమరనాధ్ కెకె. రాజు తిప్పల దేవన్ రెడ్డి తదితరులు పరామర్శించి సంతాపాన్నీ తెలిపారు. ఇక సి పీఐ నుంచి జె సత్యనారాయణ మూర్తి తెలుగు శక్తి అధ్యక్షులు బీవీ రామ్ సీపీఎం ఐద్వా , స్టీల్ ప్లాంట్‌కు సంబందించిన వామపక్ష కార్మిక సంఘాల ముఖ్య నేతలు మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో వున్నారు. వీరంతా మృతుల కుటుంబాలను పరామర్శించడం తోపాటు ప్రమాద ఘటనకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం అని గట్టిగా ఉదఘటించారు. ఏడుగురి శవపరీక్షలు



పూర్తి ప్రమాద ఘటనలో ఉక్కు ద్రవ తీవ్రతకు మంటల్లో మాడి పోయిన ఎనిమిది మంది మృత దేహాల్లో ఏడు గురి పార్తివ దేహాలకు మంగళవారం కెజీహెచ్ మార్చురీ లో ఫారన్ సిక్ వైద్య విభాగం వైద్యులు శవ పరీక్షలు ను పూర్తి చేసి మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన ఒక్క మృతుని కుటుంభికులు ఇతర రాష్ట్రము నుంచి రావాల్సిఉన్నందున దానికి పోస్టుమార్టం నిర్వహించలేదని ఫోరిన్ సిక్ విభాగాది పతి డాక్టర్ పీ. వెంకట రమణ తెలిపారు.

## ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ చేయాలి



ఆనందపురం, జూన్ 10, ప్రభాతవార్త:

ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారానే రైతులకు ఎరువుల పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి చెప్పారు. అయన బుధవారం ఆనందపురంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, సంబంధిత దస్త్రాలను పరిశీలించి అమ్మకాల విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఉన్న అర్హతలను బట్టి ప్రభుత్వం రూపొందించిన ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డిఏపీ ఎరువుల పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. గత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతుల వివరాలను యాప్‌లో పొందుపరిచారని, ఆ వివరాలను ఎరువుల డీలర్లతో అనుసంధానం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు ఎరువుల పంపిణీ జరగాలని, ఎటువంటి అక్రమాలు లేదా అవకతవకలు చోటుచేసుకోకుండా డీలర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందిన పక్షంలో సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తలు నైపుణ్యాలు పెంచుకోవాలి ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, జూన్ 10, ప్రభాతవార్త:



మారుతున్న రాజకీయ పరిస్థితులకు తగ్గట్టు కార్యకర్తలు నైపుణ్యాలను పెంచుకోవడం కోసం పార్టీ పరంగా ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పోలింగ్ బూత్ నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు పార్టీ యంత్రాంగం మొత్తం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) విషయంలో పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. బుధవారం ఆనందపురం క్లస్టర్ - 3 శిక్షణ తరగతుల్లో మాట్లాడుతూ ఓటర్ లిస్టులో అవకతవకల కారణంగా ఎన్నికల ఫలితాలు తారుమారైపోతున్నాయని, పశ్చిమ బెంగాల్‌లో అనేక ఏళ్లుగా పోలవుతున్న బంగ్లాదేశీ యులు, చొరబాటుదారుల ఓట్లను ఉదహరించారు. ఓటర్ లిస్టుల్లో చోటు చేసుకుంటున్న గందరగోళం కొన్ని పార్టీలకు వరంగా మారుతోందని పేర్కొన్నారు. నిజమైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భీమిలి పరిశీలకుడు మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, మీసాల సత్యనారాయణ, గండ్రెడ్డి సోమినాయుడు, శ్రీకాంత్ రాజు, బి.ఆర్.బి. నాయుడు, పాండ్రంగి అప్పలరాజు, బమ్మిడి ఉమ, మహంతి శివాజీ, బలిరెడ్డి మల్లికార్జునరావు, అప్పల రాము, కాకర రమణ, ఎస్.ఐ.ఆర్. శిక్షకులు అనంత కృష్ణసాయి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తెస్తాం

### -స్టీల్ ప్లాంట్ సీఎండీతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్ భేటీ

గాజువాక,జూన్ 10,ప్రభాతవార్త:



విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా అధ్యక్షులు పరశురామరాజు, గాజువాక ఇంచార్జి కరణంరెడ్డి నరసింగరావులతో కలిసి స్టీల్ ప్లాంట్ సీఎండీ ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ప్లాంట్‌లో జరిగిన ప్రమాద వివరాలను సీఎండీని అడిగి తెలుసుకున్న మాధవ్.. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సురేంద్ర మోహన్, వెన్నా శ్రీరామమూర్తి, నాగేశ్వరరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



కెజీహెచ్ శవాగారం ఎదుట మృతుల కుటుంబ సభ్యులు ను ఓదారుస్తున్న లోకేష్ కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ రాష్ట్ర మంత్రులు

## హోం మంత్రి వంగలపూడి అనితకు అణుకు గిరిజనుల కృతజ్ఞతలు



(ఎస్ .రాయవరం/ అడ్డు రోడ్డు ప్రభాతవార్త)

కోటవురట్ల మండలం అణుకు గ్రామానికి చెందిన గిరిజనులు బుధవారం నక్కపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ ప్రాంతంలో సాగు చేసిన అటవీ ఉత్పత్తులు, పనస పండ్లు, పైనాపిల్ తదితర ఉత్పత్తులను మంత్రికి అందజేశారు. అణుకు గ్రామ ప్రజలతో మంత్రి అనితకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేస్తూ, ఈ ఏడాది సంక్రాంతి పండుగను ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి అణుకు గ్రామంలో జరుపుకున్న విషయాన్ని గిరిజనులు ప్రస్తావించారు.గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు గిరిజనులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా అణుకు గ్రామానికి రూ.3 కోట్ల వ్యయంతో రహదారి మంజూరు చేయడం, గ్రామంలో రేషన్ సదుపాయం కల్పించడం, త్వరలో బీఎస్ఎన్ఎల్ టవర్ అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, తమను సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి అనితకు ధన్యవాదాలు తెలిపారు.

## టోల్ ప్లాజా సిబ్బందికి శిక్షణ తరగతులు







నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని వేంపాడు కాగిత టోల్ ప్లాజా పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు విధి నిర్వహణపై టీబీఆర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. అనకాపల్లి - అన్నవరం జాతీయ రహదారి ఈఎన్‌హెచ్-16పై ఉన్న వేంపాడు టోల్ ప్లాజాలో పని చేస్తున్న ఉద్యోగులకు వృత్తిపరమైన ప్రవర్తన నైపుణ్యాలు, టీం వర్క్, ఇన్సిడెంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ లో భాగంగా అత్యవసర వైద్య సేవలు, సీపీఆర్, రాజ్‌మార్గ్ యాత్ర యాప్ వినియోగం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల సేవలను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక టోల్ ప్లాజాలో ఏర్పాటు చేయడం జరిగిందని హెచ్.ఎల్.ఎల్ .లైఫ్‌కేర్ లిమిటెడ్ జాతీయ అధికారి తిరునగరి నటరాజ్, మాస్టర్ ట్రైనర్స్ జయకృష్ణ సాయి, లక్ష్మీలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణ ఉద్యోగుల వృత్తి సామర్థ్యాన్ని పెంపొందించి, సేవలను మరింత బలోపేతం చేసి, సురక్షితంగా తీర్చిదిద్దడం ద్వారా ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ మూర్తి, ప్రాజెక్ట్ మేనేజర్ నాగేశ్వరరావు, టి యల్ శ్రీనివాస్, ఆర్ఇ సత్యరాజు, టోల్ ప్లాజా మేనేజర్ డి.ఎ. కృష్ణ, ఐ ఎం టి మేనేజర్ సత్యనారాయణలు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ తరహా శిక్షణలు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచి, వృత్తిపరమైన బాధ్యతలను మరింత నైపుణ్యంతో నిర్వర్తించేందుకు దోహదపడతాయని అన్నారు. ముఖ్యంగా సీపీఆర్ శిక్షణ నిర్వహణ ద్వారా ప్రమాదం జరిగిన తొలి గంటలో ప్రాణాలను రక్షించే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ 1033 హెల్ప్‌లైన్ ద్వారా ప్రయాణికులకు అనేక అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

## రంగస్థల కళాకారుడు దేవాదుల శివాజీ మృతి



అనకాపల్లి జూన్ 10 :(ప్రభాత వార్త)

రంగస్థల కళాకారుడు, రంగస్థల శ్రామికుడు దేవాదుల శివాజీ (72) బుధవారం కాలం చెందారు. శివాజీ కి భార్య ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. అనకాపల్లి గ్రామంలో గాని చుట్టుపక్కల గ్రామాల్లో గాని ఎక్కడ నాటికల పోటీలు జరిగిన వారి సహాయం పూర్తిగా ఉండేది, అంతేకాదు ఆయన మేకప్ ఆర్టిస్ట్ కూడా, స్వర్గీయ దాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభాకర్ ఆర్ట్ థియేటర్స్ సంస్థను స్థాపించి పావలా నాటికి ద్వారా రంగస్థలం ప్రవేశం జరిగినది. ఈయన సేవలకు గుర్తింపుగా 2015 సంవత్సరంలో అజో- విభో- కందాలం ఫౌండేషన్ రంగస్థలం సేవా మూర్తి జీవితకాల సాధనా పురస్కారంతో సత్కరించి ఉన్నారు.ఈ మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు కందుకూరి అవార్డు అనకాపల్లి జిల్లా నుంచి అయినను ఎంపిక చేసి ఘనంగా సత్కరించి అందజేశారు. డైమండ్ హిట్స్ సాంస్కృతిక సంస్థలు చాలా యాక్టివ్ మెంబర్ గా ఉండేవారు. వీరి పార్థివ దేహాన్ని మాజీమంత్రి దాడి వీరభద్ర రావు , మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వర్ రావు ,డాక్టర్ గంది శేషు కుమార్ , కామాక్షి అమ్మవారి దేవస్థానం పెద్దలు, గ్రామీణ యువజన మందిరం గౌరవాధ్యక్షులు సూరిశెట్టి రాము , జై వీర్ మిత్రమండలి , నాటక రంగ ప్రముఖులు రంగస్థల కళాకారులు వీరి అంతిమయాత్రలో పాల్గొన్నారు. వీరి మరణం రంగస్థలంకి తీరని లోటు. మీరు పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించిననారు.

## పోలీస్ అధికారులను సత్కరించిన వైకాపా నాయకులు

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం శ్రీ ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన హుండీ చోరీ కేసు విషయమై నాలుగు రోజులు లోనే నిందితులను పట్టుకొని స్వామివారి ఆస్తులను కాపాడిన నక్కపల్లి సర్కిల్ పోలీస్ అధికారులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జ్ వీసం రామకృష్ణ నాయకత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మర్యాదపూర్వ కలిసి సత్కరించారు. ఇది గొప్ప చరిత్రని ఈ కేసు విషయంలో మీరు కష్టించిన కష్టానికి స్వామి అనుగ్రహం ఉంటుందని భవిష్యత్తులో మంచి జరుగుతుందని వీసం రామకృష్ణ అభినందనలు తెలుపుతూ అన్నారు. సీఐ జూరెడ్డి మురళి తోపాటు ఎస్సైలు సన్ని బాబు, సాహిబా అంజుమ్ నాతోపాటు దర్యాప్తులో కష్టపడిన ప్రతి ఒకరిని సత్కరించారు. సత్కరించిన వారిలో మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు,మాజీ ఉప సర్పంచ్ వీసం రాజు, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సూర్యకాసులు గోవిందు, మాజీ సర్పంచులు సాదిరెడ్డి శ్రీను ,భార్గవ్, పొడగట్ల వెంకటేశ్వరరావు, విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఎలమంచిలి చందు, మత్స్యకార నాయకుడు సూరిబాబు తో పాటు పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## అడ్డురోడ్లో వడగళ్ల వాన, ఎస్.రాయవరంలో భారీ వృక్షం నేలకొరిగి కారు ధ్వంసం



ఎస్.రాయవరం, జూన్ 10, ప్రభాతవార్త

మండలంలో అడ్డరోడ్డు గ్రామంలో వడగళ్ల వాన గ్రామస్తులను ఆశ్చర్యపరిచింది, భారీ వృక్షం నేలకొరిగి కారు ధ్వంసం అయింది. గ్రామంలో విద్యుత్తు అంతరాయం కావడంతో గ్రామం చీకటమైమైంది. విద్యుత్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

## తునిపాలం గ్రామంలో 11న ముత్యాలమ్మ ఉత్సవం



పద్మనాభం, జూన్ 10,ప్రభాతవార్త

మండలంలో తునిపాలం గ్రామంలో కొలువు దీరిన ముత్యాలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు ఈ నెల 11వతేదీన జరగనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.ప్రతి సంవత్సరం జూన్ రెండువ వారంలో నిర్వహించడం పూర్వం నుండి వస్తున్న ఆనవాయితీ.ఈ మేరకు అమ్మవారి గుడికి, విగ్రహానికి రంగులు వేసి ఉత్సవానికి సిద్ధం చేసారు.ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## విశాఖ ఉక్కులో విషాదం..

### -బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన విప్ గణబాబు

గాజువాక జూన్ 10,ప్రభాతవార్త



విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటు చేసుకున్న ప్రమాదం కార్మిక వర్గంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనలో కాంట్రాక్ట్ కార్మికుడు గొట్టాపు త్రినాధరావు మృతి చెందడం పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు మంగళవారం గుడివాడ అప్పన్న కాలనీలోని త్రినాధరావు నివాసానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. మృతుని కుటుంబానికి జరిగిన నష్టం భర్తీ చేయలేనిదని, త్రినాధరావు లేని లోటు తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని గణబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు త్వరగతిన అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంగవరంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



పాయకరావుపేట రూరల్, జూన్ 10, ప్రభాతవార్త

మండలంలోని మంగవరంలో బుధవారం ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంగన్ వాడీ విద్యను పూర్తిచేసుకుని ప్రాథమిక పాఠశాలలో అడుగుపెడుతున్న చిన్నారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్ వాడీ సెంటరు లబ్ధిదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకుని ఉన్నత విద్యాభ్యాసానికి సిద్ధమవుతున్న చిన్నారులను అభినందించారు. అంగన్ వాడీ దశ నుండి పిల్లలకు మంచి సంస్కారం, ప్రాథమిక విద్య, పౌష్టికాహారం అందించడం వలన వారి భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని సూపర్ వైజర్ రంజాన్ బీబీ పేర్కొన్నారు. చిన్నారులను ముస్తాబు చేసి సర్టిఫికెట్లు అందజేశారు. తల్లిదండ్రుల సమక్షంలో ఈ వేడుకను ఎంతో ఉత్సాహంగా జరిపించారు. తమ పిల్లలు గ్రాడ్యుయేషన్ డే టోపీలు పెట్టుకుని సర్టిఫికేట్లు, పట్టాలు చేత పట్టుకుని ఉండటం చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల సాయం..ఉద్యోగం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్

గాజువాక, జూన్ 10,ప్రభాతవార్త



విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు అండగా ఉంటాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్-1 విభాగంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన గాజువాక 66వ వార్డు సీతారాంనగర్‌కు చెందిన కోన ప్రభాకరరావు కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. నియోజకవర్గ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు, జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజులతో కలిసి బాధిత కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో ఇప్పటికే తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇస్తామని మాధవ్ హామీ ఇచ్చారు. అలాగే పిల్లల చదువుల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, టౌన్‌షిప్‌లో ఒక క్వార్టర్‌ను ఉచితంగా కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేంద్ర మోహన్, నాగేశ్వరరావు, వెన్నా శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ పేరిట సింహాచలంలో ప్రత్యేక పూజలు



గాజువాక,జూన్ 10,ప్రభాతవార్త

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ సేవలో మరిన్ని విజయాలు సాధించాలని, ఆయనకు అఖండ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం నిరంతరాయంగా సేవలందిస్తూ, 4,399 రోజుల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏకైక నాయకుడు నరేంద్ర మోదీ అని కొనియాడారు. మోదీ సమర్థవంతమైన పాలనలోనే దేశం అన్ని రంగాలలో అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, జిల్లా అధ్యక్షులు పరశురామరాజు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, కేశవ్ కాంత్, వెన్నా శ్రీరామమూర్తి తదితర రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## గుడిలోవ ఆలయ అర్చకుడు అదృశ్యం



ఆనందపురం, జూన్ 10, ప్రభాతవార్త:

ఆనందపురం మండలంలోని శొంట్యాం గ్రామానికి చెందిన, గుడిలోవ రంగనాథ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడుగా పని చేస్తున్న కోట్ర కామేశ్వరరావు(చిట్టి పంతులు)(70)) అదృశ్యమయ్యారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, కామేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం గుడిలోవ దేవాలయానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అయన కుమారుడు శర్మ పోలీస్ లకు ఫిర్యాదు చేసాడు. కుటుంభ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం కామేశ్వరరావు ఎత్తు సుమారు 5.5 అడుగులు, గోధుమవర్ణం శరీరం, తెల్ల జుట్టు, తెల్ల గడ్డం కలిగిఉండి , బ్రౌన్ ఫ్రేమ్ కళ్లద్దాలు, నీలం రంగు ఫుల్ హ్యాండ్ షర్ట్, తెల్లటి పంచె ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసినా, ఎక్కడైనా కనిపించినా వెంటనే 9281826731 నంబర్‌లో సంప్రదించడం గానీ, ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## విశాఖ ఉక్కు ప్రమాద బాధిత కుటుంబాలకు కూటమి నేతల పరామర్శ



గాజువాక,జూన్ 10,ప్రభాతవార్త

విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను కూటమి నేతలు పరామర్శించి ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత కుటుంబాలను కలిసి ఓదార్చారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు పెదగంట్యాడ, సీతారాంనగర్, అగనంపూడి, వడ్లపూడి, గుడివాడ ప్రాంతాల్లోని మృతుల కుటుంబాలను సందర్శించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఆర్థిక సహాయంతో పాటు ఉపాధి, పిల్లల విద్యకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి అవసరం వచ్చినా వెంటనే స్పందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొండా జగన్, పల్లా శ్రీనివాస్, రఫీ, సింగూరు అనంత్, పులి రమణారెడ్డి, నమ్మి అప్పారావు, పెంటిరాజుతో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## నిరంతర శ్రామికుడు వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం,జూన్ 10,ప్రభాతవార్త



రెండేళ్ల తన ఎమ్మెల్యే పదవి కాలంలో.. తన పాలన ఒక అద్భుతం... దక్షిణ నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాలన.. నిరంతరం ప్రజల్లో ఉండే వ్యక్తి వంశీకృష్ణ శ్రీనివాస్ రాజకీయాల కతీతంగా కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా తనలో కలుపుకుంటూ నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్కరికి అన్ని పథకాలు అమలయ్యేలా చేస్తూ నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కొరకు పాటుపడుతున్న ఏకైక వ్యక్తి వంశీకృష్ణ శ్రీనివాస్... రెండేళ్ల పాలనలో నియోజకవర్గంలో ప్రతి గడప తొక్కిన ఘనత వంశీకృష్ణ శ్రీనివాస్ ది... కాళ్లకు చక్రాలు కట్టుకుని ప్రతి పేదవాడి కష్టాన్ని తీరుస్తూ బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి గా పేదల పెన్నిధిగా నిరుద్యోగుల పాలిట వరంగా అక్కచెల్లెళ్లకు అన్నగా నిరంతరం తోడుగా ఉన్న ఒకే ఒక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్... ఇటువంటి ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గం లాంటి అత్యంత వెనుకబడిన నియోజకవర్గానికి ఉండడం తమ పాలిట వరంవని తమ జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని.. ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాజుగౌడ్ యాత కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు.

## పగడ్బందీగా ఓటర్ల సవరణ, నమోదు కార్యక్రమంను నిర్వహించాలి



పద్మనాభం,జూన్ 10, ప్రభాతవార్త

రాష్ట్ర టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఇంటింటికి తిరిగి కొత్త ఓటర్లను చేర్పించడం, సవరణ చేయడం కార్యక్రమంను నాయకులు, కార్యకర్తలు పకడ్బందీగా నిర్వహిం చాలని సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కె దామోదరరావు అన్నారు. బుదవారం పద్మనాభం రహదారి బంగ్లాలో మండల పార్టీ అధ్యక్షుడు రమణ ఆధ్వర్యంలో జరిగిన బూత్ లెవిల్ ఏజెంట్లుకు సర్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరుతో అనుసందానం ఉంటే ప్రతి బూత్ లో విజయం మనదేనని ఆయన సూచించారు.ప్రతి ఓటు ముఖ్యమైనది, విలువైనది కాబట్టి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందీశ్వరరావు, రామరాజు, లీలావతి, నందిని ,మహేష్,శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

## పద్మనాభంలో ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు



పద్మనాభం, జూన్ 10,ప్రభాతవార్త

మండలంలో పద్మనాభం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ రహదారి బంగ్లాలలో బుధవారం మండల టీడీపీ అధ్యక్షులు కోరాడ రమణ ఆధ్వర్యంలో ప్రముఖ సినీహీరో,హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను డీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జైబాలయ్య, జైటీడీపీ నినాదాలు చేసారు. అనంతరం మద్యాహ్నం విజయనగరం రోడ్డుపై ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లును అందజేసి దాహార్తిని తీర్చారు. ఈ కార్యక్రమంలో నందీశ్వరరావు, ఎంపిటీసీ రమణరాజు, రామరాజు,లీలావతి, నందిని, రొబ్బు సూర్యనారాయణ, సంగుశ్రీను,జుత్తాడ గనేష్,బార్నాల శ్రీను,సుమంత నాయుడు, పాల్గొన్నారు.

## డాన్సర్ పురుషోత్తంకు ఎంఎల్ఏ వంశీకృష్ణ పరామర్శ

విశాఖపట్నం, జూన్ 10, ప్రభాతవార్త



ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కెజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ప్రముఖ డాన్సర్ పురుషోత్తమును దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ కొరియోగ్రాఫర్ రమేష్ మాస్టర్‌తో కలిసి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పురుషోత్తం ఆరోగ్య పరిస్థితిని సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.



## ఎఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా విక్రయాలు ప్రారంభం

పద్మనాభం, జూన్ 10, ప్రభాతవార్త

మండలంలో రెడ్డిపల్లి, అనంతవరం గ్రామాలలో ఉన్న ప్రైవేటు ఎరువుల దుకాణాలలో ఎపి ఎఐఎంఎస్ యాప్ ద్వారా బుధవారం యూరియా విక్రయాలను మండల వ్యవసాయ అధికారి ఎం ఎస్ చలం ప్రారంభించారు. ఇకపై నుండి రైతులు ఆధార్ కార్డులను తీసుకొచ్చి యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. అత్యధిక మోతాదులో వాడుతున్న యూరియాను తగ్గించడానికి ప్రభుత్వం ఈ యాప్‌ను అమలు చేసిందని అన్నారు.

## ఉక్కు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.25 లక్షల చెక్కు

గాజువాక,జూన్ 10,ప్రభాతవార్త



విశాఖ ఉక్కు కర్మాగారంలోని ఎస్ఎంఎస్-1 మిషన్-2 వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగవరం గ్రామానికి చెందిన కందుల పైడి రాజు బుధవారం ఉదయం మృతి చెందారు. మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన ఉక్కు యాజమాన్యం, పరిహారంగా రూ.25 లక్షల చెక్కును ఆయన సతీమణికి అందజేసింది. ఈ మేరకు ఉక్కు యాజమాన్య ప్రతినిధులు చంద్రశేఖర్, రవిబాబు సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన యాజమాన్య ప్రతినిధులు, సంస్థ తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పైడి రాజు మృతి పట్ల గంగవరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## విమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన లోక్ సత్తా నాయకులు



ఆరిలోవ, జూన్ 10, ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన విశాఖ ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)ని మరింత ఆధునికరించి మౌలిక సదుపాయాలు కలిపించాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ బుధవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వి. మన్మధరావు తో సమావేశమై వినతి పత్రం అందజేశారు. అనంతరం విమ్స్ లో ప్రస్తుతం రోగులకు అందుతున్న సేవలు నూతనంగా కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీశెట్టి విలేకరుల తో మాట్లాడుతూ అపార అనుభవం ఉన్న డాక్టర్ల బృందం, సిబ్బంది ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాల లేమి కనిపిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం విమ్స్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశావ్యాప్తంగా ప్రకటించిన 10 కీలక ఆసుపత్రుల్లో సెకెండ్రి లెవెల్ కెమికల్, బయోలాజికల్ రేడియోలాజుకల్ న్యూక్లియర్ మెడికల్ మేనేజ్మెంట్ సెంటర్ (సి.బి.ఆర్.ఎన్.)ని విమ్స్‌కి కేటాయించడం అభినందనీయమని, లోక్ సత్తా బృందం ఇప్పటికే కేజీహెచ్ లో రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేక నివేదిక తయారు చేసిందని అదే విధంగా విమ్స్ పై కూడా ఒక నివేదిక తయారు చేసి ఎమ్మెల్యేలకు, మంత్రులకు, ముఖ్యమంత్రికి అందచేసి కేజీ హెచ్, విమ్స్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఆయనతోపాటు లోక్‌సత్తా నగర అధ్యక్షుడు ఎమ్.ఎస్.ఎన్.మూర్తి, ఉత్తర నియోజకవర్గం అధ్యక్షుడు గొట్టాపు సుదీర్, వడ్డాది ప్రకాష్, హర్ష, వేగి శ్రీనివాస్, రాజా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెదగదిలిలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు

ఆరిలోవ, జూన్ 10, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 12వ వార్డు పెదగదిలి జంక్షన్‌లో బుధవారం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకులకు ముఖ్య అతిథిగా యువ నాయకులు వెలగపూడి ప్రతాప్ రుద్ర హాజరై నందమూరి అభిమానులు, పార్టీ నాయకులు మధ్య కేక్ కట్ చేసి స్వీట్స్, బిస్కెట్స్, కూల్ డ్రింక్స్ అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బాలకృష్ణ సినీ రంగంలో అలాగే రాజకీయం లో తండ్రి ఆశయాలను ముందుకి తీసుకువెళుతూ ప్రజాసేవ చేస్తున్నారని తెలిపారు. తెదేపా నాయకులు గాడి సత్యం, పోతిన భరత్, బాదరు బాలరాజు, పరదేశి ఆనంద్, సీరియల కృష్ణ, రెడ్డి రామూర్తి, గండ్రేటి అబద్దం, అనుగుపల్లి ఈశ్వర్‌రావు, రాయి అప్పలనాయుడు, ఒమ్మి మోహన్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



ఆనందపురం, జూన్ 10, ప్రభాతవార్త

పెందుర్తి--ఆనందపురం జాతీయ రహదారిపై గండిగుండం వంతెన వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ద్విచక్ర వాహనం వెనుక చక్రం అకస్మాత్తుగా గాలి కోల్పోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తి మండలం సుజాతనగర్‌కు చెందిన ఎం. ఆదినారాయణ (57) తన భార్య ఎం.రాజ్యలక్ష్మి (50)తో కలిసి ద్విచక్ర వాహనం పై విజయనగరం వైపు ప్రయాణిస్తున్నారు. వారు గండిగుండం వంతెన సమీపానికి చేరుకోగానే వాహనం వెనుక చక్రం ఒక్కసారిగా గాలి కోల్పోవడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న రాజ్యలక్ష్మి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే జాతీయ రహదారి అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించగా క్షతగాత్రురాలకు ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం తగరపువలసలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. కాగా, ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న ఆదినారాయణ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. కేసుని ఆనందపురం పోలీస్ లు దర్యాప్తు చేస్తున్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జన్మదిన వేడుకలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గొర్ల గోవింద రావు, నియోజకవర్గం వైస్సార్సీపీ ప్రచార కమిటీ అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు ల జన్మదిన వేడుకలు సందర్భంగా నక్కపల్లి మండల పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో బుధవారం రాత్రి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,మాజీ సర్పంచులు సాదిరెడ్డి శ్రీను, పొడగట్ల వెంకటేశ్వరరావు, తల్లా భార్గవ్ సురకాసుర గోవిందు తో పాటు ఎలమంచిలి చందు ,సూరిబాబు తదితరులు ఉన్నారు.

11skl13:11skl13.qxd 10-06-2026 21:44 Page 1



## ప్రజల సంక్షేమమే మనందరి బాధ్యత



**ఇచ్ఛాపురం, జూన్ 10, ప్రభాతవార్త:**

స్థానిక లొద్దపుట్టి గ్రామ దేవత తులసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్.పద్మ నాభం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ ఆదేశాల మేరకు ప్రతినెలా మొదటి బుధవారం గ్రామ పార్టీ సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామ అభివృద్ధి ప్రజల సంక్షేమమం మనందరి బాధ్యతగా పని చేయాలని, మండల పార్టీలో వివిధ అంశాలను గూర్చి తదితర అంశాల చర్చించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.ఢిల్లీరావు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు పి.బాబ్జి, దక్కత కామేష్, సహదేవ్ దుర్యోధన, చంద్రశేఖర్, లోహిదాస్ మాధవ్ యువరాజ్ బోర ప్రసాద్ బి.మోహన్ శంకర్ నారాయణ పరశురాం, చందు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అభివృద్ధి : ఎమ్మెల్యే బెందాళం



**కంచిలి, జూన్ 10, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు అన్నారు. బుధవారం కంచిలి మండలం కొల్లూరు పంచాయతీ కర్తలి గ్రామంలో ఏడు లక్షల 50 వేలు ఎంపీపీ నిధులతో మండపం, అలాగే డీజీపురం గ్రామంలో ఎంపీ నిధులు 750000 లతో కమ్యూనిటీ భవనం శంకుస్థాపన చేశారు. అనంతరం జె.బైరిపురం గ్రామంలో గ్రామస్తులు నిర్వహిస్తున్న యజ్ఞ హోమ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో పల్లె గ్రామాలను అభివృద్ధి చేయక కుంటుపడిపోయాయని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రహదారి పనులు గ్రామాల్లో మౌలిక వసతులు కు పెద్ద పేట వేసారని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు మాదిన రామారావు, బంగారు కురయ్య, ఎంపీడీవో వి.తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి పైల రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల పురుషోత్తంరెడ్డి, ఐటీడీపీ అధ్యక్షులు వాసాల రమేష్, జగదీష్ పట్నాయక్, పైల సూర్యనారాయణ రెడ్డి, పిలక చిన్నబాబు, మాదిన ప్రదీప్, కిషోర్ పాడి, బుడ్డెపు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



**కవిటి, జూన్ 10, ప్రభాతవార్త:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు పొందల కృష్ణారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రామయ్యపుట్టుగలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు టిడిపి నాయకులతో మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ప్రతి నెలలో మొదటి బుధవారం, రెండవ బుధవారం ఈ సమావేశం మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించాలని రాష్ట్ర పార్టీ సూచించిందని తెలిపారు. గత ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరకుపోయిందని రాష్ట్రంలో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. సమావేశంలో కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు ఎస్వి రమణ, ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, ఎక్స్ జడ్పిటిసి బి.రమేష్, కోర్రాయి వాసుదేవరావు, మహిళా కార్యదర్శి శ్యామల, మహిళా అధ్యక్షురాలు దేవకి జన్న, మండల కార్యదర్శి తిరుమల కుమార్, టిడిపి మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతు రారాజుగా ఎదగాలి : టిడిపి నేత పాండురంగ



**వీరఘట్టం, జూన్ 10, ప్రభాతవార్త:**

రైతు రారాజుగా ఎదగాలని, ఇందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తోటపల్లి ప్రాజెక్ట్ మాజీ చైర్మన్, టిడిపి పాలకొండ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జ్ నిమ్మక పాండురంగ అన్నారు. బుధవారం మండలంలోని కంబర గ్రామంలో రైతులకు వరి విత్తనాలు, పచ్చి రొట్ట విత్తనాలు, యూరియా, పిఎండిఎస్ కిట్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉండి, వారికి అవసరమైన, విత్తనాలు, ఎరువులు సకాలంలో సరఫరా చేసి వారికి పూర్తి భరోసా ఇచ్చేది కూటమి ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. రైతుల కళ్ళల్లో ఆనందాన్ని చూడటం కోసం ప్రభుత్వం వినూత్నమైన పథకాలను ప్రవేశపెట్టి అన్ని విధాల ఆదుకుంటుందని అన్నారు. రైతులకు సరిపడే విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఈ విషయంలో రైతులు కంగారు పడవలసిన పనిలేదని ఆయన అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, తోటపల్లి ప్రాజెక్ట్ చైర్మన్ పొదిలాపు విజయరామణి, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, పట్టణ సీనియర్ నాయకులు, జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు చింత ఉమామహేశ్వరరావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు కే.లలిత కుమారి మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు గొర్లె గౌరునాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తూముల రమేష్, యువ నాయకులు జంపు శేఖర్, టిఎన్టియుసి అధ్యక్షులు శశిభూషణరావు , తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తీవ్రత దృశ్య కూలింగ్ వాటర్ బాటిల్ పంపిణీ



**మెళియాపుట్టి, జూన్ 10, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో వేసవి తీవ్రత దృష్టిలో ఉంచుకొని ఉపాధి వేతనదారులకు దుక్క చత్రపతి రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు దుక్క నరసింహారెడ్డి వాటర్ కూలింగ్ బాటిల్స్ పంపిణీ చేశారు. తదనంతరం వేతనదారులకు భోజనాలు ఏర్పాటు చేశారు. రాబోయే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్, చాణిక్య, కాళ్ళ కాంతారావు, మురళీ మాస్టారు, లంక బృందావన్ మారం వెంకటరావు, పరపటి రమణ, పట్నాన ఈశ్వరరావు, గాలి రామకృష్ణ, ఉపాధి హామీ వేతనదారులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

### -రోడ్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన



**ఆమదాలవలస, జూన్ 10, (ప్రభాతవార్త):**

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మండలంలో కొర్లకోట గ్రామపంచాయతీలో రూ.1.69 కోట్లతో నిర్మించిన సిసి రోడ్లు, కాలువలు, కొర్లకోట గ్రామం నుంచి జంబుద్వీపం మీదుగా ముద్దాడపేట గ్రామం వరకు రూ.3.80 కోట్లతో నిర్మించిన బిటి రోడ్డు నిర్మాణాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మొదలవలస రమేష్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, మాజీ సర్పంచ్ సనపల అన్నపూర్ణమ్మ, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి వండాన ఉదయ్ కుమార్, తమ్మినేని అమర్నాథ్, నాని, కూన ఆంజనేయులు, సనపల అప్పలనాయుడు, ఎండ అప్పలనాయుడు, బుడుమూరి సీతారాం, హనుమంతు బాలకృష్ణ, ఆర్ అండ్ బి ఏఈ ఆంజనేయ నాయక్, పి ఆర్ డి ఈ చంద్రశేఖర్, గ్రామస్తులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యాలయంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు



**రాజాం, జూన్ 10 ప్రభాతవార్త:**

మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సూచనల మేరకు, రాజాం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 'నటసింహం' హిందూపురం నియోజకవర్గ శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ 66వ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నంది సూర్య ప్రకాశరావు, సుమల వెంకట మన్మధరావు, గురవాణ నారాయణరావు, దుప్పలపూడి శ్రీను, వంగా వెంకటరావు, రఘుమండల గణపతి, జయరాం, హరి, అప్పలనాయుడు, మరిపి జగన్, ఉమా, సూరిబాబు, గౌరీశ్వరరావు, ఎస్.జగన్నాథం, పిల్లా సత్యం నాయుడు, చిట్టి, కోటి, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## బుడ్డెపు మాలమ్మ కుటుంబానికి పరామర్శ

**కంచిలి, జూన్ 10, ప్రభాతవార్త:**



కొల్లూరు పంచాయతీ సిర్తలికి చెందిన బుడ్డెపు మాలమ్మ (57) ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందారు. వారి చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబీకులను ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతినిధి పైల లక్ష్మీనారాయణ, కొల్లూరు పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పైల గణేష్ రెడ్డి, బుడ్డెపు మురళి తదితర పెద్దలు, యువకులు పరామర్శించారు.

## రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

### -విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన

**ఆమదాలవలస, జూన్ 10, (ప్రభాతవార్త)**



రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం కొర్లకోట రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు సబ్సిడీపై విత్తనాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రైతన్నలు సాగులో కొత్త విధానాల అవలంబించి, అధిక దిగిబడులు సాధించాలని సూచించారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎరువులు, పురుగుల మందులను పంటలకు వినియోగించాలన్నారు. ఆధునిక వ్యవసాయ సాగు వైపు రైతుల దృష్టి సారించాలన్నారు. యాంత్రీకరణకు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మొదలవలస రమేష్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, పిఎసిఎస్ అధ్యక్షురాలు సిమ్మ మాధవి, తమ్మినేని అమర్నాథ్, నాని, నూకరాజు, బుడుమూరు సీతారాం, ఎండ అప్పలనాయుడు, కూన ఆంజనేయులు, సనపల అప్పలనాయుడు, అన్నిపు భాస్కరరావు,ఏడిఏ బగ్గు రజిని ఏవో మెట్ట మోహనరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నౌపడలో అప్రకటిత విద్యుత్ కోతలు



### ఉక్కపోతతో అల్లాడిపోతున్న వినియోగదారులు

**సంతబొమ్మాళి, జూన్ 10, ప్రభాతవార్త:**

మండలంలో నౌపడ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం కరెంటు కోత వలన ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వేసవి కాలం..ఆపై కరెంట్ కోతలు.. రెండూ కలిపి ప్రజలకు ఉక్కపోత..ఇదీ మండలంలో నౌపడ పరిసర ప్రాంత దుస్థితి. మాడు పగిలే ఎండలతో ఉదయం 9 దాటితే బయటకు రావాలంటేనే బెంబేలెత్తుతున్న ప్రజలు ఇంట్లోనే సేద తీరుదామన్నా కరెంటు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఉక్కపోతలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనాలు ఫ్యానో, కూలరో వేసుకొని భానుడి తాపం నుంచి ఉపశమనం పొందాలనుకుంటే విద్యుత్ శాఖ అధికారులు అనధికార, అప్రకటిత విద్యుత్తు కోతలతో ప్రజలను విసుగెత్తిస్తున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా నౌపడ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్తు కోతలు విధిస్తూ సమాచారం కోసం విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులను చరవాణి ద్వారా సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పే నాధుడే లేడని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ కోతలపై నౌపడ లైన్మెన్‌కు కొంత మంది వినియోగదారులు సంప్రదించగా సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేస్తుంటారని ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరికి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తూ ఇకనైనా అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తును అందించాల్సిందిగా భావనపాడు, మర్రిపాడు, నౌపడ , హనుమంతు నాయుడుపేట, మూలపేట పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ కోతలపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా రాజపురంలో జంపర్ కట్ అవ్వడం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడిందని తెలిపారు.

## పాతపట్నంలో లాబ్ ఆన్ వీల్స్

**పాతపట్నం, జూన్ 10, ప్రభాతవార్త :**



అంతర్జాలంపై అవగాహన కలిగి, కృత్రిమ మేధస్సు అర్థం చేసుకొని మారుతున్న శాస్త్ర సాంకేతిక రంగాలలో విద్యార్థులు భాగస్వాములు కావాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనపల వైకుంఠరావు అన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ సహకారంతో ఇన్ఫోసిస్ స్టెమ్ ల్యాబ్ సౌజన్యంతో నడుస్తున్న ల్యాబ్ ఆన్ వీల్స్ శకటం బుధవారం పాతపట్నం చేరుకుంది. కో-ఆర్డినేటర్ అనూష, ఇన్‌స్ట్రక్టర్ భాను విద్యార్థులకు ఆర్డినో బోర్డులు, బ్రెడ్ బోర్డులు, రోబోట్స్, సెన్సార్లు మొదలగు పరికరాలను చూపించి కృత్రిమ మేధస్సు గూర్చి అవగాహన కల్పించారు. ఈ తరగతులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు అమరజ్యోతి పాఠశాల విద్యార్థులు సుమారు 50 మంది హాజరయ్యారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ తిరుమలరావు, జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి సూచించారు. తరగతులలో సైన్సు ఉపాధ్యాయులు సుధారాణి, రమణి, ఎన్టీఆర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తూరులో తెలుగుదేశం పార్టీ మండల కమిటీ సమావేశం



**కొత్తూరు, జూన్ 10, ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు సూచనలతో కొత్తూరు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మండల కమిటీ సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా జరిగింది. కొత్తూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అగతముడి మాధవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు కలిసి మండల స్థాయి మెంబర్‌షిప్ నమోదు మరియు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పొత్రకొండ మోహనరావు, జిల్లా సంస్థాగత కార్యదర్శి అగతముడి అరుణ్ కుమార్, కొత్తూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు మాతల గాంధీ, చింతాడ కోటేశ్వరరావు, సహకార సంఘం డైరెక్టర్లు అరుభోలు దశరథ, చోడవరపు రాము, నెల్లి అచ్యుతరావు, ఎద్దు సంతోష్, టి. తిరుపతిరావు, నూలు వీరభద్రస్వామి, మజ్జి వెంకటరావు, ముగితి లక్ష్మణరావులతో పాటు మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి

**సంతకవిటి, జూన్ 10, ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు బుధవారం సంతకవిటి మండలం మామిడపల్లి గ్రామంలో సంతకవిటి మండలం క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు, ముఖ్య నాయకులతో క్యాడర్ మీటింగ్ నిర్వహించి పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కొల్ల అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో సంతకవిటి మండల టీడీపీ అధ్యక్షులు గట్టి భాను, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్, మండల తెలుగు యువత అధ్యక్షులు వావిలపల్లి శ్రీనివాస్, మండల సీనియర్ నాయకులు మొయ్య నారాయణప్పడు, తమ్మినేని సింహాచలం, టీడీపీ మండల నాయకులు, క్లస్టర్,యూనిట్, బూత్ ఇంచార్జిలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రైవేట్ ఎరువుల షాపులు ఆకస్మిక తనిఖీలు

**వీరఘట్టం, జూన్ 10, ప్రభాతవార్త:**

మండలంలోని ప్రైవేటు ఎరువుల షాపులను బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భవాని శంకర్ టెక్నికల్ టీంతో తనిఖీలను నిర్వహించారు. భోగి శ్రీధర్, భోగి ఉమామహేశ్వ రరావు అండ్ సన్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఎరువులను ఏ పి ఏ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా డీలర్లు ఏ విధంగా విక్రయిస్తున్నారో తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారికి పలు సలహాలు సూచనలు అందజేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఏవో జక్కు సౌజన్య వివిఏలు పాల్గొన్నారు.

## పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లతో సమీక్ష

**కవిటి, జూన్ 10, ప్రభాతవార్త:**



కవిటి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పంచాయతీల పంచాయతీ డెవలప్ మెంట్ ఆఫీసర్‌లతో ఎంపీడీవో ఎల్.త్రినాధ్ సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా యోగాంధ్ర కార్యక్రమము అన్ని పంచాయతీల్లో నిర్వహించాలని, యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే పంచాయతీ రాజ్ కమిషనర్ సమావేశం నకు అందరూ తగిన సమాచారంతో హాజరు కావాలని ఆదేశించడం జరిగింది. డిప్యూటీ ఎంపిడిఓ బి వి ఎస్ రెడ్డి, పీడీఓలు పాల్గొన్నారు.

## తల్లికి వందనం అర్హుల జాబితా సిద్ధం చేయాలి



**కోటబొమ్మాళి, జూన్ 10 ప్రభాతవార్త:**

ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి రవి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## 15న సీతంపేటలో ఘనంగా 'యోగాంధ్ర' కార్యక్రమం

### కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి



వీరఘట్టం, జూన్ 10, ప్రభాతవార్త: 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ప్రత్యేక 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆ రోజు ఉదయం 7:00 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో ఆరోగ్యం, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది, యువత మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## కూటమి ప్రభుత్వంలో కర్షకుడికే పెద్దపీట



### -రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, జూన్ 10, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, రైతుల పక్షపాత ప్రభుత్వంగా తన చిత్తశుద్ధిని చాటుకుంటోంది. రానున్న ఖరీఫ్ సీజన్ (2026-27)లో రైతన్నలకు ఏ లోటూ రాకుండా ఉండేలా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాన్ని పండుగ చేసే దిశగా అడుగులు వేస్తూ, రాయితీపై వరి విత్తనాల పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు.సాగు ఖర్చును తగ్గించి రైతులకు అండగా నిలిచేందుకు, ప్రభుత్వం కిలో వరి విత్తనాలపై రూ.10ల రాయితీని అందిస్తోంది. అలాగే, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గిరిజన రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తూ 90% రాయితీని అమలు చేస్తోందని అన్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఎక్కడా విత్తనాల కొరత రాకుండా ప్రభుత్వం ముందుచూపుతోవ్యవహరించింది. కార్యక్రమంలో కింజరాపు హరిప్రసాద్, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు, వెలమల విజయలక్ష్మి, పిఏసిఎస్ అధ్యక్షులు, వెలమల కామేశ్వరరావు, బోయిన గోవిందరాజులు, బోయిన శ్రీనివాస్, పినకాన అజయ్ కుమార్, టెక్కలి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కే.జగన్ మోహన్‌రావు, కోటబొమ్మాళి మండల వ్యవసాయ అధికారి గోవిందరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సింధు పోలమ్మ క్రికెట్ విజేత భావనపాడు



కంచిలి, జూన్ 10, ప్రభాతవార్త: మండలం శ్రీరాంపురం గ్రామంలో జరుగుతున్న సింధు పోలమ్మ క్రికెట్ పోటీల్లో భావనపాడు జట్టు విజేతగా నిలిచింది. బుధవారం శ్రీరాంపురం గ్రామంలో భావనపాడు, బెలగం జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరగగా భావనపాడు విన్నర్స్‌గా బెలగాం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేతలకు శ్రీరాంపురం మాజీ సర్పంచ్ మాదిన రామారావు బహుమతులు అందజేశారు.



## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**కోటబొమ్మాళి, జూన్ 10, ప్రభాతవార్త :**

మండలం జాతీయ రహదారి కిష్టుపురం జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ రాష్ట్రం, రాంజీ జిల్లా, హేలారి గ్రామానికి చెందిన రమేష్ గుంజి (35) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మృతుడు రమేష్ గుంజి నేషనల్ హైవే అథారిటిలో కూలిగా పనిచేస్తు తన గ్రామానికి చెందిన మరో ముగ్గురుతో కలిసి జాతీయ రహదారి కిష్టుపురం జంక్షన్ సమీపంలో ఒక రూంను అద్దెకు తీసుకొని గత అరునెలలుగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి భోజనం కోసం కొత్తపేట జంక్షన్కు వచ్చి భోజనం చేసి తిరిగి వెలుతుండగా శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వెలుతున్న కంటేనర్ లారీ (గుర్తుతెలియని) రమేష్ గుంజిని ఢీకొని అపకుండ వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో రమేష్ గుంజి అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడు స్నేహితుడు సునీల్ రుండ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని ఎసఐ వంగపండు సత్యనారాయణ తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తున్న కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల

**కంచిలి, జూన్ 10, ప్రభాతవార్త :**




ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వి.జగదీశ్ కుమార్ వచ్చినప్పటి నుండి కళాశాల రూపురేఖలు మారి విద్యార్థులకు ఉన్నతులుగా తీర్చిదిద్దుటకు విశేష కృషి చేస్తున్నారు. ఇక్కడి విద్య అంటే కేవలం పాఠ్య పుస్తకాలు మాత్రమే కాదు ప్రతి విద్యార్థికి ఆత్మవిశ్వాసంతో కూడిన వ్యక్తిగా ఉన్నత లక్ష్యాలు సాధించే పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా ప్రిన్సిపాల్ వి.జగదీశ్ కుమార్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం నిరంతరం కృషి చేస్తున్నారు. పదవతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు వారి జీవితంలో కీలకపాత్ర వహిస్తున్న ఇంటర్మీడియట్‌లో ఎం.పీ.సీ. బై.పి.సి. హెచ్.ఇ.సి సి.ఇ.సిలో చేరుటకు అందుబాటులో ఉన్న విద్యా కేంద్రం కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన అనేక సౌకర్యాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి ఉచితంగా పాఠ్య పుస్తకాలను నోటు బుక్స్ ప్రాక్టికల్ రికార్డ్స్ అందిస్తున్నారు.

## ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరగాలి



### జిల్లా వ్యవసాయ అధికారి వై.వి.మురళీకృష్ణ

**కొత్తూరు, జూన్ 10 ప్రభాతవార్త :**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'అపామ్స' యాప్ ద్వారానే ప్రైవేట్ వ్యాపారులు యూరియా, డి.ఎ.పి ఎరువుల విక్రయాలు జరపాలని జిల్లా వ్యవసాయ అధికారి వై.వి.మురళీకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం కొత్తూరు మండల కేంద్రంలోని యు.జి సంప్రదాయ వేదిక భవనంలో నిర్వహించిన విభాగ స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యాపారులు, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ఉద్దేశించి జిల్లా అధికారి మాట్లాడుతూ, ఎరువుల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, ప్రతీ రైతుకూ సకాలంలో ఎరువులు అందేలా చూడాలని ఐదు మండలాల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎరువులు పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో గిరిజన అభివృద్ధి సంస్థ జిల్లా పథక నిర్వాహకులు స్వర్ణలత, అదనపు పథక నిర్వాహకులు ధనుంజయరావు, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ పి.వెంకటరావు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్‌లో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు

**పాతపట్నం, జూన్ 10, ప్రభాతవార్త:**



2026-27 విద్యా సంవత్సరానికి స్థానిక ఏపి మోడల్ స్కూల్లో మిగులు ఉన్న 6వ, 7వ, 8వ, 9వ తరగతులలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రత్నకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తగు వివరములతో ఆన్లైన్‌లో జూన్ 10 నుండి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగుల సీట్లలో ప్రవేశాల కోసం జూన్ 24న ప్రవేశపరీక్ష నిర్వహించబడుతుందని, ఎంపికైన అభ్యర్థుల జాబితాను జూన్ 25న ప్రకటించబడుతుందన్నారు.

## పేదల దాహార్తిని తీర్చిన సామాజిక వేత్త భామిడి రాజు

**కొత్తూరు, జూన్ 10, ప్రభాతవార్త:**



గులివిందలపేటలో గత కొన్నేళ్లుగా తాగునీటి ఎద్దడితో సతమతమవుతున్న నిరుపేదల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామంలోని ఎస్సీ వీధి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను స్థానిక నాయకుడు పడాల నాగభూషణం, ప్రముఖ సామాజిక వేత్త, ఎంపీహెచ్ డెవలపర్స్ అధినేత భామిడి రాజు దృష్టికి తీసుకెళ్లగా ఈ సమస్యపై భామిడి రాజు తక్షణమే స్పందించారు. పంచాయతీ నిధులు విడుదల కావడానికి సమయం పడుతుందని గ్రహించిన ఆయన, ప్రభుత్వ నిధుల కోసం వేచి చూడకుండా తన సొంత డబ్బులతో ఎస్సీ వీధిలో తాగునీటి వసతిని ఏర్పాటు చేసి నిరుపేదల దాహార్తిని తీర్చారు. ఈ సందర్భంగా వారు తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు భామిడి రాజుకు, స్థానిక కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

# అందమైన బొట్టు మాల!

ఫ్యాషన్ ఫ్యాషన్



అమ్మాయిలంటేనే అలంకరణలూ, ఆభరణాలు, సందర్భం ఉండాలే కానీ, అందంగా తయారై మెరిసిపోరూ! పండగలు, వేడుకల వేళ సంప్రదా యం, సొగసూ ఇనుమడించేలా కనిపించేందుకు బొట్టునగల్ని మించిన ఎంపిక ఉండదు మరి. కాలాన్ని బట్టి దుస్తులూ, యాక్సెసరీల్లోనే కాదు.. నగల్లోనూ డిజైన్లలోనూ ఎన్నో మార్పులు వచ్చేస్తుంటాయి. అయితే, కొన్నిసార్లు నయా రకాలు వస్తే మరికొన్ని పాత ఫ్యాషన్లే కొత్తందాలు చుట్టుకుని వస్తుంటాయి. అలా ఒకప్పుడు అమ్మ, అమ్మమ్మల తరం.. మెడలో పెట్టుకుని మురిసిపోయిన బొట్టు నగలు ఇప్పుడు ఆధుని కతరంఅందాన్ని రెట్టింపు చేసేందుకు కొత్త సొబగులద్దుకుని మళ్లీ వచ్చేశాయి. ధరించినవారి అందాన్నిచూపు తిప్పుకోగలమా !













బాగా పండిన బొప్పాయిపై తొక్క తీసేసి.. ముక్కలుగా కట్ చేయాలి. వీటిని మిక్సీలో వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ గుజ్జును ముఖానికి, మెడకు పట్టించి.. గుండ్రంగా రుద్దు తూ మర్దన చేసుకోవాలి. ఇలా దాదాపు 20 నుంచి 30 నిమిషాల వరకు మృదువుగా మసాజ్

## బొప్పాయితో మెరిసే ..!



చేసుకుంటూ ఉండాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. కావాలనుకుంటే ఈ బొప్పాయి పేస్ట్‌కు టీస్పూన్ చొప్పున కలబంద గుజ్జు, తేనె కలుపుకోవచ్చు. ఇలా బొప్పాయితో చేసుకొనే ఫేషియల్ గోల్డెన్ ఫేషియల్ చేసుకున్నంత ఫలితాన్నిస్తుం దంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ముఖం మీద ఉంటే ట్యాన్ కూడా తగ్గ ముఖం పడు తుంది. ఇలా వారానికి ఒకటి లేదా రెండు సార్లు చేయడం వల్ల ప్రకాశవంతమైన చర్మం మన సొంతమవుతుంది. ❐

# 'మచా జిలేబీ' మజా మజాలే !



ఎంత మధుర పదార్థాలైనా వాటికీ రంగురంగుల ఆకర్షణ ఉంటేనే మజా! ఇప్పుడొచ్చే స్వీట్లన్నీ రంగు, రుచి, వాసన ఉంటేనే మార్కెట్‌లో 'స్వీట్ కేక్'ల్లో అదిరిపోతున్నాయి. మిఠాయిరంగును మించిన మరింత ఆకర్షణీయ రంగును జోడించడం రుచినిపెంచే ఇతరత్రా ఫ్లేవర్‌లను కలపడం, ఇవన్నీ మధుర ప్రియులకు ఎంతగానో తృప్తినిస్తాయి. అలాంటి వాటికి ఇప్పుడెంతో 'క్రేజ్', తాజాగా మార్కెట్‌లో సంప్రదాయ 'జిలేబీకి' జపనీస్ మచా కలిపి ఎవర్ గ్రీన్‌గా ఆకర్షణియమే కాదు నోరూరించేటట్లు అందిస్తున్నారు. ఈ కొత్త స్వీట్ కోసం ఈసారి ఆకుపచ్చరంగును ఎన్నుకున్నారు. సాధారణంగా పసుపు లేదా నారింజ రంగులో, కరకరలాడుతూ తియ్యగా ఉండే జిలేబీ అందరికీ సుపరిచితమే. అయితే, జపాన్‌కు చెందిన గ్రీన్ టీ పౌడర్ 'మచా'ను ఉపయోగించి ఈ కొత్త జిలేబీని తయారు చేస్తున్నారు. దీనివల్ల జిలేబీకి కొద్దిగా వగరు, భిన్నమైన రుచి వస్తుంది. ఈ 'మచా జిలేబీ'ని స్ట్రాబెర్రీ లస్సీతో కలిపి అందిస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతాయి. మొన్నీమధ్య ఒకామె ఈ కాంబినేషన్‌ను పోస్ట్ చేయగానే మరిన్నీ చానల్స్‌లోకి పేస్ట్ అయి పోయాయి. 'జిలేబీని లస్సీలో ముంచకుండా తింటే రుచికి రుచి మజాకు మజా! అని నోరూరించే స్థాయిలో జిలేబిని పట్టుకుని ఎగిరి గంతేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఫ్యూజన్ ఫుడ్ ట్రెండ్‌లో భాగంగానే మచా జిలేబీ వంటి ప్రయోగాలు తెరపైకి వస్తున్నాయని నిపుణులు అంటున్నారు. గతంలో చాక్లెట్, చిల్లీ జిలేబీల్లాగానే ఇదీనూ ! ఫుడ్ ప్రియులకు విరివిగా దొరికేటట్లు స్వీట్‌షాప్ ఓనర్లు ఏర్పాట్లు చేసారు. ఒకసారి మనమూ రుచి చూస్తే పోలా!



సాధారణంగా ఇన్ఫెక్షన్లు, హార్మోనుల్లో మార్పులు, థైరాయిడ్ వంటివి ఇందుకు దారితీస్తాయి. కొందరు సమయానికి ఆహారం తీసుకోక పోవడం, విపరీతంగా డైట్ చేయడం లాంటివి చేస్తుంటారు. ఆ ప్రభావం కనుబొమలపైనా పడుతుంది. ఒత్తిడి, ఆందోళన, మేకప్ ఉత్పత్తులు ఎక్కువగా వాడటం, తరచూ ఐబ్రోస్ తీయించుకోవడం వంటివీ సమస్యగా మారుతుంటాయి. గుండ్రని ప్యాచ్‌లు వస్తే అలోపేషియా ఏరియేటా అయ్యుండొచ్చు. ఇమ్యూన్‌సిస్టమ్ సరిగా పనిచేయక

## 'ఐ బ్రో' పెన్సిల్ వాడొద్దు !

పోవడం వల్ల ఇది వస్తుంది. కొందరిలో రెప్పలపై ఉన్న వెంట్రుకలూ పోతాయి. దురద, చర్మం పొట్టులా రాలడం వంటివి ఉంటే ఎగ్జిమా కావొచ్చు. సోరియాసిస్, కాంటాక్ట్ డెర్మటైటిస్, సెబోరిక్ డెర్మటైటిస్ వంటివీ కారణమవొచ్చు. ముందు కను బొమలు రాలడానికి అసలు కారణమేంటో నిపుణులను సంప్రదించి తెలుసుకోండి. మామూలుగా మినాకినసడల్ 5% ద్రావణం, కార్టికో స్టిరాయిడ్ క్రీములు వాడటం ద్వారా పరిస్థితి అదుపులోకి తెచ్చుకోవచ్చు. సమస్య పెద్దది అయితే మందులు, ఇంజెక్షన్లనూ తీసుకోవాల్సి ఉంటుంది. వీటితోపాటు మస్కారా, ఐబ్రో పెన్సిల్ వాడకాన్ని తగ్గించండి. విటమిన్లు, మినరల్స్ ఆహారం ద్వారా సమృద్ధిగా అందేలా చూసుకోవడంతోపాటు ఒత్తిడికీ దూరంగా ఉండండి. ఇన్నీ చేశాక కూడా పెరుగుదల లేకపోతే అప్పుడు ఐబ్రో ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించకోవచ్చు. ★

## వ్యథ — బాధను చెప్పుకోనీయండి

ప్రశ్న: ప్రేమ విఫలం కావడంతో మా అమ్మాయి డిప్రెషన్ కు గురయ్యింది. బాధ, ఆవేదన, భయం, ఆందోళనతో సతమతం అవుతోంది. అర్థం లేని మాటలు మాట్లాడు తోంది. అతన్ని మరువలేను అంటుంది. అంతలోనే మరొకరితో పెళ్లి చేస్తే మరిచిపోతాను అంటుంది. నా వల్ల అందరికీ సమస్యలు వచ్చాయి కాబట్టి చనిపోతే అందరూ సుఖపడుతారు అంటూ ఏడుస్తుంది. నెల రోజులుగా కంటికి కునుకులేకుండా కాపలా కాస్తున్నాము. ఆమె ఇప్పుడు మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతోంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదివే సమయంలో ఒక అబ్బాయితో పరిచయం పెంచుకున్నది. మార్కులు తగ్గడంతో ఆరా తీసి బుద్ధి మాటలు చెప్పి నియంత్రించాము. అప్పటికి మరచిపోయి బాగా చదివి మెడిసిన్ లో సీటు తెచ్చుకున్నది. మళ్ళీ అతను తారస పడటంతో పీకల్లోతు ప్రేమలోకి దిగింది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నది. అయితే తల్లి తండ్రులు సమ్మతించక పోవడంతో ఆ అబ్బాయి తిరస్కరించాడు. మాకు విషయం తెలిసి ప్రయత్నం చేసినా అతని తల్లి తండ్రులు సమ్మతించ లేదు. దీనితో మా అమ్మాయి పిచ్చిదాని లాగా ప్రవర్తిస్తోంది. ఆమె మనసు మార్చే మార్గం చెప్పండి.

- ఒక సోదరి, విశాఖపట్నం

జవాబు: అమ్మా మీ అమ్మాయి ప్రేమ విఫలం కావడంతో తీవ్రమైన భావోద్వేగ సంక్షోభం ఎదుర్కొంటోంది. డిప్రెషన్‌తో బాధ పడుతోంది. ముఖ్యంగా "నేను చనిపోతే అందరూ సుఖపడతారు" అని చెప్పడం, అర్థం లేని మాటలు మాట్లాడడం, తీవ్ర ఆవేదనతో ఉండటం వంటి లక్షణాలను చాలా తీవ్రమైనవిగా భావించాలి. కాబట్టి మీ అమ్మాయిని వెంటనే మానసిక వైద్యునీతో పాటు క్లినికల్ సైకాలజిస్టుకు చూపించండి. ప్రేమ విఫలం కావడం కారణం కావచ్చు, కానీ ప్రస్తుతం కనిపిస్తున్న లక్షణాలు కేవలం కౌన్సెలింగ్‌తోనే సరిపోని స్థాయిలో ఉండవచ్చు. మీరు ఆమెతో ఎక్కువ మాట్లాడి, హితోపదేశాలు చేయడం కంటే ఆమె బాధను అంగీకరిం చండి. ఆమె ఏడిస్తే ఎడవనివ్వండి, బాధను చెప్పనివ్వండి. దీనివల్ల మనసులోని బాధ తగ్గి కొంత ఉపశమనం దొరుకుతుంది. 'ఇంకొకరితో పెళ్లి చేస్తే మరిచిపోతాను' అనేది ఆమె బాధ నుంచి బయటపడటానికి చెబుతున్న మాట. ఈ స్థితిలో పెళ్లి నిర్ణయం తీసుకోవడం సరైనది కాదు. ఆత్మహత్య ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయ వద్దు. ఆమెకు తోడుగా మీరు ఉన్నారు అన్న భరోసా కల్పించండి. ఒంటరిగా ఉంచకుండా జాగ్రత్త పడండి. చాలా సున్నితంగా వ్యవహరిస్తూ మనసు ద్యాస మళ్ళించండి. ఇంటర్‌లో ఒకసారి ఆ సంబంధం నుంచి బయటపడి, తిరిగి చదువుపై దృష్టి పెట్టి మెడిసిన్‌లో సీటు సాధించింది అంటే మీ అమ్మాయిలో మానసిక బలం ఉంది. ప్రస్తుతం ఆమె తీవ్రమైన దుఃఖం, నిరాశ ప్రభావంలో ఉంది. సరైన చికిత్స, కుటుంబ మద్దతు, ఆదరణ ఉంటే కొద్ది రోజుల్లో కోలుకుంటుంది.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

## సాక్షాత్కారం!

బుధుడు భౌతిక జ్ఞానం, తర్కం, విశ్లేషణకు ప్రతీక. గురువు దైవజ్ఞానం, ధర్మం, ఆత్మసాక్షాత్కా రానికి ప్రతీక. బుధ–గురు వైరం మనకు "బుద్ధి , భక్తి కలిసినప్పుడే సంపూర్ణత" . నేటి కాలంలో విద్య, విజ్ఞానం, సాంకేతి కత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇవన్నీ బుధుని ప్రభావాన్ని సూచిస్తాయి. అదే సమయంలో ధర్మం, సంస్కృతి, గురుభక్తి, ఆధ్యాత్మిక విలువలు కూడా అవసరమే. ఇవి గురువు కటాక్షానికి సూచనలు. బుద్ధికి భక్తి తోడైతే విజయం, జ్ఞానానికి వినయం తోడైతే దైవానుగ్రహం అనే సత్యాన్ని బుధ,గురు వైరం మనకు గుర్తు చేస్తుంది. మనం బుధుని మేధస్సును, గురువు జ్ఞానాన్ని సమానంగా గౌరవిం చాలి. విజ్ఞానానికి వినయం జత కలిసినప్పుడు, విద్యకు విలువలు తోడైనప్పుడు జీవితం సార్థకమవుతుంది. గురువు మనకు ధర్మమార్గాన్ని చూపిస్తే, బుధుడు ఆ మార్గంలో నడిచే వివేకాన్ని అందిస్తాడు. ఈ ఇద్దరి ఆశీర్వాదంతోనే మనిషి భౌతికంగా, ఆధ్యాత్మికంగా

# తెర



## 'సింగ్ గీతం' 12న రిలీజ్

చాలా మంది ఫిల్మ్ మేకర్స్ సినిమా విడుదల అనేది ఒక ముగింపు ఘట్టం. అయితే లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, క్రియేటివ్ ఫిల్మ్‌మేకర్ నాగ్ అశ్విన్‌లకు మాత్రం తాము ఊహించిన ప్రతి క్రియేటివ్ ఎలిమెంట్ తెరపై అత్యుత్తమంగా ఆవిష్కృతమయ్యేలా చూసుకోవడమే ముఖ్యం.

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సింగ్ గీతం' చిత్రం తొలుత జూన్ 11న విడుదల కావాల్సి ఉండగా, ఇప్పుడు జూన్ 12కి వాయిదా పడింది. కథలో కీలక పాత్ర పోషించే కొన్ని ముఖ్యమైన సీజీఐ, విజువల్ ఎఫెక్ట్స్ పనులను మరింత మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. 'సింగ్ గీతం' ఒక ఫాంటసీ, సూపర్‌నేచురల్ ప్రపంచాన్ని ఆవిష్కరించే చిత్రం. ఇందులో సంగీతంతో పాటు విజువల్స్ కూడా కథనంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ప్రేక్షకులను ఆ ప్రపంచంలో పూర్తిగా లీనం చేసే అనుభూతిని కలిగించాలనే ఉద్దేశంతో, చిత్ర బృందం ఫైనల్ అవుట్‌పుట్‌ను మరింత పర్ఫెక్ట్ చేయడానికి అదనపు సమయం కేటాయిస్తోంది. తాజాగా సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. 'సింగ్ గీతం'కు క్లీన్ 'యూ సర్టిఫికేట్ లభించింది. అందరూ ఫ్యామిలీతో కలసి బిగ్ స్క్రీన్‌పై ఆస్వాదించదగిన అద్భుతమైన అనుభూతిని అందించేందుకు జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయాన్, అహల్యా ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, శాలిని కొండెపూడి కీలక పాత్ర పోషిస్తున్నారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలో పాటలు, నేపథ్య సంగీతం మెయిన్ హైలెట్స్‌గా నిలవనున్నాయి.

# లెజెండరీ డైరెక్టర్ భారతీరాజా



ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు భారతీరాజా (84) కన్నుమూశారు. అనారోగ్యంతో ఆయన తుదిశ్వాస విడిచారు. 1977లో వచ్చిన తమిళ మూవీ'16 వయథినిలే'తో ఆయన దర్శకుడిగా మారారు. 'సీతాకోకచిలుక', ఆరాధన', జమదగ్ని, ఈ తరం ఇల్లాలు, తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు ఆయన సుపరిచితుడే. దర్శకుడిగానే కాదు, నటుడిగానూ అలరించారు. యువ, సీత కత్తి, ఈశ్వరన్, సర్, తిరు, మహారాజా వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు.

కొత్త తరం నటులను సృష్టించిన వెటరన్ లెజెండరీ డైరెక్టర్ భారతీరాజా కన్నుమూశారు. .ఆయన వయసు 84.. కొంత కాలంగా అస్వస్థతతో బాధపడు తున్నారు...16 వయతినిలే ఆయన తొలి సినిమా.. భారతి రాజా ఎన్నో ఎక్స్పెరిమెంట్స్ చేశారు.. ఆరోజుల్లోనే సైకలాజికల్ థ్రిల్లర్స్ తీసి యువతను ఉర్రూతలూగించారు..రజని కమల్ శ్రీదేవికి స్టార్ డం ఇచ్చిన వారిలో ఈయనే ప్రథముడు.. 6 జాతీయ అవార్డులు 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు 4 ఫిలింఫేర్ అవార్డులు ఇంకా ఎన్నో అవార్డులు ఆయనను సత్కరించుకున్నాయి. భారత ప్రభుత్వం పద్మశ్రీ తో సన్మానించింది ఆయన మంచి నటుడు కూడా..తూర్పు వెళ్లే రైలుకి తమిళ మాతృక కూడా ఈయనే తీసారు.. ఈయన కేవలం గ్రామీణ జీవితాలనే చిత్రీకరిస్తారు అనే అపవాదును చెరిపెయ్యడానికి ఎర్రగులాబీలు అనే సైకాలజికల్ థ్రిల్లర్ పూర్తి అర్బన్ లైఫ్ ని ప్రతిబింబిస్తూ తీశారు ఆ తర్వాత టిక్ టిక్ టిక్ తీసి యువతని ఉర్రూతలూగించారు..నిలాల్గల్ నీడలు అనే సినిమా తో ఈయన పరిణితి పైన అందరికీ అనుమానాలు పోయాయి ..ఆత్మబంధువు తో సున్నితమైన మానసిక, మానవీయ కోణాలను కూడా అంతే ప్రతిభతో చిత్రించగలరు అనేది నిశ్చయం అయింది. తెలుగులో డైరెక్టుగా సీతాకోక చిలకలు కొత్త జంటతో తీసి సృజనకు భాష భేదాలు ఎల్లలు కావు అని నిరూపించుకున్నారు.దీనికి జాతీయ ఉత్తమ చిత్రం అవార్డుతో పాటుగా 5 నందులు కూడా దక్కాయి. ప్రతి సంవత్సరం ప్రతిష్టత్మాకంగా సంతోషం సినిమా వార పత్రిక అధినేత సురేష్ కొండేటి నిర్వహించే సంతోషం పురస్కారాలలో జీవిత సాఫల్య పురుస్కారాన్ని కూడా భారతీరాజా అందుకున్నారు ఆరాధన చిరంజీవి, సుహాసిని, జమదగ్ని, కొత్త జీవితాలు, యువ తరం పిలిచింది, ఈతరం ఇల్లాలు వంటివి ఆయన నేరుగా తెలుగులో డైరెక్టు చేసిన సూపర్ హిట్ సినిమా లు ...భానుమతి బాలయ్య బాబు కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ హిట్ సినిమా మంగమ్మగారి మనుమడు కి కథను అందించారు.. అలాగే రాజశేఖర్ నటించిన పల్నాటి పౌరుషం సినిమాకి స్క్రీన్ ప్లే అందించారు.. భారతీయ సినిమాకి పేరు ప్రతిష్టలు తెచ్చిన దర్శకుల లో ముందువరుసల తప్పకుండా వుంటారు.. భారతీరాజా సినిమాలు ఫిల్మ్ స్టూడెంట్స్‌కి రీసెర్చ్ మెటీరియల్ అనడంలో సందేహం లేదు ..ముఖ్యంగా స్క్రీన్ ప్లే, సినిమాటోగ్రఫీ టెక్నికాలిటీస్ తప్పనిసరి పాఠాలు.. మేటి దర్శకులు తన మార్కుని వదిలి తరలి పోయారు...

## 'ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్ ' దర్శక నిర్మాత పి. సునీల్ కుమార్ రెడ్డి..



సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిల్మ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా గే, ట్రాన్స్జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా 'ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్ ' ఈ చిత్రంలో ఎల్ బి శ్రీరామ్, ఎస్తర్ నార్రోన్హ, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్‌తో పాటు రియల్ ట్రాన్స్జెండర్ యాక్టర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. హిమ రాథోడ్ హీరోయిన్‌గా , చంద్రము , లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణితితో నటించారు. 'ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్ ' సినిమా ఈ నెల 19న దేశవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ రోజు హైదరాబాద్‌లో ఈ మూవీ టీమ్ మీడియాతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లైలా మాట్లాడుతూ మా హక్కుల కోసం ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నాము. కానీ మాకు సరైన వేదిక ఎక్కడా లభించలేదు. డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి మా సమస్యల ఇతివృత్తంతో ఈ సినిమాను రూపొం దించడం హ్యాపీగా ఉంది. కమ్యూనిస్ట్ యాక్టివిస్ట్ విష్ణు మాట్లాడుతూ గే కమ్యూనిటీ కోసం దాదాపు 12 ఏళ్లుగా పోరాడుతున్నాను.

## 'అనుమాన పక్షి' హిలేరియస్ ఫన్ రైడ్ టీజర్ రిలీజ్



'దీరి టిల్లు'తో సంచలన విజయాన్ని అందుకున్న రచయిత దర్శకుడు విమల్ కృష్ణ, మరో విభిన్నమైన వినోదాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈసారి ఆయన 'చిలక ప్రొడక్షన్స్' బ్యానర్‌పై 'అనుమాన పక్షి ' అనే యునిక్ కామెడీ చిత్రం కోసం యంగ్ హీరో రాగ్ మయూర్‌తో జతకట్టారు. రాజీవ్ చిలక, రాజేష్ జగతి యాని, హీరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ కథానాయికగా నటిస్తున్నారు. రమణ గోగుల ఆలపించిన ఈ చిత్రంలోని మొదటి పాట 'గులాబ్ జామ్' ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది. టీజర్‌లో రాగ్ మయూర్ పోషించిన పాత్రను పరిచయం చేశారు. ఈ చిత్రం రెగ్యులర్ స్టోరీ ఫార్ములాలకు భిన్నంగా, వినూత్నమైన, ఆఫ్‌బీట్ నేరేషన్‌తో సాగుతుందనే టీజర్‌తో స్పష్టమవుతుంది. ఫ్రెష్ నెస్, యూనిక్, అనూహ్యమైన మలుపులతో కూడిన కథన శైలి ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విమల్ కృష్ణకు ప్రత్యేకమైన వినూత్న కామెడీ శైలి ఈ టీజర్ అంతటా కనిపిస్తుంది. ఎప్పుడూ అనుమానపడే హీరో పాత్రలో రాగ్ మయూర్ అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతని హావభావాలు, స్క్రీన్ ప్రెజెన్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కథానాయికగా మెరిన్ ఫిలిప్ ఆకట్టుకోగా, ప్రిన్స్ సెసిల్, రాశి, అజయ్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, మస్త్ అలీ తమ తమ పాత్రల్లో అలరించారు. మొత్తంగా 'అనుమాన పక్షి టీజర్ నవ్వులు పంచే వినోదభరిత ప్రయాణానికి ఆహ్వానం పలుకుతోంది. టీజర్ చూస్తుంటే ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అనిపిస్తోంది. ఈ చిత్రం జులై 10న థియేటర్లలో విడుదల కానుంది.

## SYG (సంబరాల ఏటిగట్టు) ముంబై షెడ్యూల్ పూర్తి

మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్‌ఇండియా స్పెక్టికల్ SYG(సంబరాల ఏటిగట్టు) తో ఇంతకు ముందెన్నడూ చూడని ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నాడు. హనుమాన్ వంటి గ్లోబల్ బ్లాక్‌బస్టర్ తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం SYGపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. రోహిత్ కె.పి దర్శకత్వంలో, నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన ముంబై షెడ్యూల్ విజయ వంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో ఓ ప్రముఖ బాలీవుడ్ నటుడు పాల్గొనడం చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది.



హనుమాన్ విజయంతో భారతీయ సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, SYGతో మరింత భారీగా నిర్మిస్తోంది. ఇప్పటికే పూర్తైన ప్రతి షెడ్యూల్ ఈ ప్రాజెక్ట్ యొక్క భారీ స్థాయి, గొప్ప విజన్‌ను ప్రజెంట్ చస్తోంది. ఇటీవల పూర్తైన ముంబై షెడ్యూల్‌లో ప్రముఖ బాలీవుడ్ నటుడు పాల్గొనడం, ఈ చిత్రాన్ని ట్రూ పాన్‌ఇండియా స్థాయిలో రూపొందించాలన్న మేకర్స్ లక్ష్యాన్ని మరోసారి చాటిచెప్పింది. SYGను ప్రపంచ స్థాయి థియేట్రికల్ అనుభూతిని అందించే చిత్రంగా తీర్చిదిద్దేందుకు మేకర్స్ ఎలాంటి రాజీ లేకుండా నిర్మిస్తున్నారు. ప్రతి షెడ్యూల్‌ను అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తుండటంతో, సినిమా స్థాయి రోజురోజుకూ మరింత విస్తరిస్తోంది.

## 'పోలీస్ కంప్లైంట్' 12న విడుదల



హారర్, యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, రొమాన్స్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'పోలీస్ కంప్లైంట్'చిత్రం జూన్ 12న తెలుగు, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మేగోటి మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్ సినిమా ప్రమోషన్స్‌కు సహకరించకపోవడం వల్ల చిత్రానికి భారీ నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఇది నేను దర్శకత్వం వహించిన 11వ చిత్రం. నా కథను నమ్మి సినిమా నిర్మించిన నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాలో కీలక పాత్ర చేసిన హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, సూపర్ స్టార్ కృష్ణగారిపై రూపొందించిన ప్రత్యేక గీతంలో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఫిలిం సిటీలో ఆ పాటను అద్భుతంగా చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్ స్టార్ కృష్ణ వ్యక్తిగత పీఆర్వో బాలాజీ శర్మ మాట్లాడుతూ, కృష్ణసాయి చిన్నప్పటి నుంచే సూపర్ స్టార్ కృష్ణగారి వీరాభిమాని. ఈ సినిమాలో కృష్ణగారిని గుర్తు చేసే పాట ఎంతో అద్భుతంగా రూపొందింది. .నటి బేబీ తనుశ్రీ మాట్లాడుతూ,కృష్ణసాయి సార్‌తో కలిసి ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది, .

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

### యువకులకు ఎస్ఐ కౌన్సిలింగ్



వేపాడ, జూన్ 10, ప్రభాతవార్త:

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ యువకులకు వల్లంపూడి ఎస్సై ఎస్ సుదర్శన్ బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. వేపాడ మండలం నీలకంఠరాజపురం గ్రామశీ సమీపంలో రైవాడ కాలవ ప్రాంతానికి ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రీల్స్ ప్రభావంతో వివిధ ప్రాంతాల నుంచి యువకులు అధిక సంఖ్యలో వస్తున్నారని , కొంతమంది అక్కడే బహిరంగంగా మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్థానికుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయంపై ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, మద్యం సేవించి బహిరంగ ప్రదేశాల్లో గుమికూడరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికుల భద్రత, ప్రశాంతతకు భంగం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## ఓటర్ల జాబితా పై దృష్టి పెట్టాలి



దత్తిరాజేరు, జూన్ 10, ప్రభాతవార్త :

గ్రామ పంచాయతీలుకు సంబంధించిఓటర్ల జాబితా పై టిడిపి నాయకులు కార్యకర్తలు దృష్టి పెట్టాలని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ తెలిపారు మండల కేంద్రంలో ఉన్న టిడిపి పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్చార్జీలు యూనిట్ ఇన్చార్జీలు మరియు కార్యకర్తలు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో అన్ని స్థానాలను టిడిపి పార్టీ నాయకులు గెలుస్తారనిధీమా వ్యక్తం చేశారు ప్రధానంగా ఓటర్ జాబితాలో పేర్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు బయట ప్రాంతాల్లో ఉన్న ఓటర్సని స్థానిక గ్రామాల్లోని ఓటును ఉంచే విధంగా బి ఎల్ వో లు మాట్లాడి మీకు సంబంధించిన ఓట్లన్నీ వారితో దగ్గరుండి చేర్పించుకోవాలన్నారు క్లస్టర్ ఇంచార్జీలు యూనిట్ ఇన్చార్జిల్ తో కలిసి రోజుకి మూడేసి పంచాయతీలో ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేసి ఓటర్ల జాబితాలపై అవగాహన కల్పించాలన్నారు గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు ఏ కార్యకర్తకు ఏ అవసరమైన మండల నాయకులు అందుబాటులో ఉంటారని అధికారులతో కలిసిమెలిసి పనిచేసుకోవాలని అన్నారు గ్రామాల్లో అధికారులు ఎవరైనా మీ మాట వినకపోయినట్లయితే మా దృష్టికి తీసుకురావాలన్నారు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మిత్తి రెడ్డి ఈశ్వరరావు బాడసింగి సత్యనారాయణ టిడిపి సీనియర్ నాయకులు మిత్తిరెడ్డి రామ గంట వెంకటలక్ష్మి సత్యారావు బండి కృష్ణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒడిశా అధికారులు నిఘా పెడితే ఊరుకోం : మంత్రి వార్నింగ్



సాలూరు, జూన్ 10, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చి ఇక్కడ గిరిజనులను ఒడిశా అధికారులు, పోలీసులు ఇబ్బంది కలిగించిన అలాగే నిఘా పెట్టిన ఊరుకునే ప్రసక్తిలేదని రాష్ట్రమంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఒడిశా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం మండలంలో ఉన్న దండిగాం నుంచి నేరళ్లవలస నూతన రహదారి ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ తీవ్రంగా స్పందించారు.ఇక్కడ గిరిజనులను అరెస్టులు చేసి వేధింపులు గురిచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని, అలాగే గిరిజనులు వారికి నచ్చినట్టు వారు ఉంటారని స్పష్టం చేశారు.అంతేకాకుండా మాతో స్నేహపూర్వకంగా ఉంటే ఆదరిస్తామని వేరే ఆలోచనతో ఉంటే మాత్రం తాటతీస్తామని సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. అలాగే ఈ ప్రాంత గిరిజనులు నా సోదరీ సోదరలని ఇంకా బిడ్డలని వారి జోలికివస్తే ఊరుకునే ప్రసక్తి లేదని మళ్లీ మళ్లీ తీవ్రంగా హెచ్చరస్తున్నానని క్లారిటీ ఇచ్చారు.తహసిల్దార్ సురేష్, ఎంపీడీవో పార్వతి,టిడిపి నాయకులు పరమేష్, కార్యకర్తలు పెద్దఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



గరివిడి, జూన్ 10,ప్రభాత వార్త:

భారత ఎన్నికల సంఘం ఓటర్లు జాబితా సరిచేసేందుకు చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం బి ఎల్ ఓ లు పకడ్బందీగా నిర్వహించాలని గరివిడి మండల తహశీల్దార్ చింత బంగార్రాజు సూచించారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో గల సమావేశం మందిరంలో చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోగల గరివిడి, గుర్ల మండలాలకు చెందిన 134 మంది బి ఎల్ ఓ లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ లో పాల్గొన్న తహశీల్దార్ బంగార్రాజు మాట్లాడుతూ ఓటర్లు జాబితే సరి చేసే కార్యక్రమంలో బి ఎల్ ఓ లు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు జాబితా, వలస వెళ్లే కుటుంబాల జాబితా, పెళ్లి అయిన వారి జాబితా వేర్వేరుగా రూపొందించి అధికారులకి నివేదించాలన్నారు. సర్వేని బాధ్యాయుతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఎంవిబి సుబ్రహ్మణ్యం, సర్ ప్రత్యేక బోధకులు కృష్ణా రావు,ప్రసాద్,రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గాలివానతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం

### రూరల్ సీఐ అప్రమత్తమై చెట్టు తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్



సాలూరు, జూన్10 ,ప్రభాతవార్త :

సాలూరు మండలం గంగన్నదొర వలస జంక్షన్ వద్ద బుధవారం భీభత్సమైన గాలులతో కూడిన వర్షం పడడంతో రహదారి ప్రక్కన ఉన్న భారీవృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది.దీంతో రానుపోను వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం కలిగింది.అలాగే దండిగాం నుంచి నేరళ్లవలస నూతన రహదారి ప్రారంభోత్సవనికి వెళ్లిన రాష్ట్రమంత్రి సంధ్యారాణి కార్యక్రమం ముగించుకొని అదే దారిలో రావాల్సిఉంది.ఈ మేరకు విషయం తెలుసుకున్న రూరల్ సీఐ రామకృష్ణ ఇంకా ఎస్సై రవీంద్ర రాజ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై రోడ్డుకు అడ్డంగా ఉన్న భారీ వృక్షాన్ని జెసిబి తో తొలగించడంతో మంత్రి సంధ్యారాణి కారు వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అంతేకాకుండా ఎవరికి ఎటువంటి అంతరాయం లేకుండా తక్షణమే యాక్షన్ లోకి దిగిన ట్రాఫిక్ క్లియర్ చేసిన పోలీసులకు అందరూ హర్షం వ్యక్తంచేశారు.

## నేలగొరిగిన విద్యుత్ స్తంభాలు .. అంధకారంలో కేసలి



పాచిపెంట, జూన్ 10, ప్రభాతవార్త:

ఉరుములు మెరుపులు వడిగళ్ళ వానతో కేసలి గ్రామం వసంతాలమ్మ గుడి సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకు వరగడంతో కేసలి గ్రామానికి విద్యుత్తు అంతరాయం కలిగిందని గ్రామస్తులు వాపోయారు. ఏడాదిలో ఎన్నడూ కురవని వర్షం అకస్మాత్తుగా 12 గంటల నుండి రెండు గంటల వరకు గాలి వర్షం పిడుగులకు ఒడిగళ్లతో భారీ వర్షం కురిసింది. రైతులు వాణిజ్య పంటలు వేయడానికి సిద్ధంగా మెట్టు భూములు దుక్కులు వేసి విత్తనాలు వేయడానికి సిద్ధం చేశారు. కురిసిన వర్షానికి గాలికిమూడుస్తంభాలునేలమట్టమయ్యాయి. విద్యుత్ అధికారులకి విషయం తెలిసినప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడం వలన ఏమి చేయలేక విద్యుత్ స్తంభాలను పునరుద్ధించలేకపోయారు.

## యోగాతో ఆరోగ్యం : ఎంపీడీవో

కురుపాం, జూన్ 10, ప్రభాతవార్త :

యోగా చేయడం వల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో జే ఉమామహేశ్వరి అన్నారు బుధవారం కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాలో నిర్వహి స్తూ యోగా కార్యక్రమాలలో భాగంగా ఎంపీడీవో జె ఉమామహేశ్వరి యోగ సందర్భంగా మండల పరిషత్ కురుపాం స్టాఫ్ , ఎన్ ఆర్ ఇ జి ఎస్ సిబ్బంది కార్యక్రమం పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

దత్తిరాజేరు, జూన్ 10: తర్వాత వార్త మండలంలోని పెదమానాపురం ఎస్ బూర్జువలస పోలీస్ స్టేషన్ లకు నూతన ఎస్సైలుగా బాధ్యతలను బుధవారం స్వీకరించారు పెదమానాపురం స్టేషన్ ఎస్ఐగా జి కళాధర్ ఎస్ బూర్జువలసఎస్ఐగా పి మూర్తిబాధ్యతలు స్వీకరించారు ఎస్సై కళాధర్ మన్యం జిల్లా సాలూరు పోలీస్ స్టేషన్ నుంచి పెదమాపురం పిఎస్‌కు రావడం జరిగిందన్నారు ఇక్కడ పనిచేసిన ఎస్సై జయంతి విజయనగరం క్రైమ్ స్టేషన్కు బదిలీపై వెళ్లారు ఎస్ బూర్జువలస నూతన ఎస్సై మూర్తి మన్యం జిల్లా నుంచి ఎస్ బూర్జువలస పి ఎస్ కి రావడం జరిగిందన్నారు. ఇక్కడ పని చేసిన జి. రాజేష్ విజయనగరం పోలీస్ స్టేషన్ బదిలీపై వెళ్లడం జరిగిందన్నారు ఎస్ఐలకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## వైసీపీకి బిగ్ షాక్ .. టీడీపీ తీర్థం పుచ్చుకున్న గిరిజనులు

### మంత్రి సమక్షంలో 560 కుటుంబాలు చేరిక



సాలూరు , జూన్ 10, ప్రభాతవార్త :

సాలూరు మండలంలో ఉన్న సారిక,తోణాం ఇంకా గంజాయిభద్ర అలాగే కురుకుట్టి పంచాయతీలు గత ఎన్నోఏళ్లుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేవి అలాంటి మాజీ డీసీఎం రాజన్నదొరకు అండగా ఉన్న అనేక గిరిజన గ్రామాల గిరిజనకుటుంబాలు రాష్ట్రమంత్రి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో వైసీపీకి బిగ్ షాక్ తగలడేమే కాకుండా మంత్రి సంధ్యారాణి ఆకోటను బద్దలు కొట్టినట్టుగా టాక్ వినపడుతుంది.ఇంకా వివరాల్లోకి వెళ్తే నేరళ్లవలస జరిగిన రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభ సాక్షిగా కురుకుట్టి పంచాయతీ నుంచి 110 కుటుంబాలు,సారిక పంచాయితీ నుండి 160 ఇంకా తోణాం నంచి 190 అలాగే గంజాయిభద్ర నుంచి 100 కుటుబాలు గిరిజనులకు సంధ్యారాణి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం ఆమె మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై గిరిజన ప్రజలు బారీగా పార్టీలోకి వస్తున్నారని స్పష్టం చేశారు.అలాగే గిరిజన ప్రాంతాల్లో పెరుగుతున్న తెలుగుదేశం పార్టీ ఆదరణచూసి పార్టీలో చేరిన కుటుంబాల గిరిజన మహిళలతో మంత్రి సంధ్యారాణి క్రిందకూర్చుని వారితో కాసేపు ముచ్చటించి ఆనందం వ్యక్తపరిచారు.

## గ్రామాల్లో కొత్త ఓటర్లను చేర్పించండి



రామభద్రపురం.. జూన్ 10..ప్రభాత వార్త

గ్రామాల్లో కొత్త ఓటర్లను చేర్పించాలని రాష్ట్ర తెదేపా కార్యనిర్వాక మాజీ కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. ఆయన మాట్లాడుతూ రామభద్రపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల స్థాయి సర్ కార్యక్రమంలో భాగంగా భూత్ ఇన్చార్జిలకు అవగాహన సదస్సు నిర్వహించారు చింతల మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భూత్ ఇంచార్జిలంతా ఇంటింటికి వెళ్లి కొత్త వాటర్ నమోదు చేర్పులు మార్పులు చేయాలనే ఆయన కోరారు ఈనెల 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటికి వెళ్లి నూతన వాటర్ నమోదు చేయాలని ఆయన కోరారు ప్రభుత్వ బి ఎల్ వో లతోపాటు భూత్ ఇన్చార్జిలంతా వెంట వెళ్లి నూతన ఓటర్ల నమోదు చేయాలని ఆయన కోరారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన ఆదేశాల మేరకు బూత్ ఇన్చార్జిలంతా బాధ్యతగా పనిచేసే తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించాలని ఆయన కోరారు. సమావేశంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వసంతుల సన్యాసినాయుడు చింతల చిన్నమ్మ తల్లి, పెదిరెడ్ల మహేష్, కే వెంకటి, కే నాగేశ్వరరావు, ఎన్ భాస్కరరావు, ఎన్ నారాయణ, రవ్వ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ నారీ సిక్స్ యాప్..

### మహిళా సంఘ సభ్యుల ఆర్థిక లావాదేవీలకు ఎంతో దోహదం



పాచిపెంట, జూన్ 10, ప్రభాతవార్త:

సూపర్ నారి సిక్స్ యాప్ వెలుగు మహిళా సంఘ సభ్యులకు హార్థిక లావాదేవీలకు ఎంత దోదపడుతుందని పార్వతీపురం మన్యం జిల్లా డిఆర్డిఏ పిడి సిహెచ్ ప్రభావతి అన్నారు. మండల కేంద్రమైన పాచిపెంట వెలుగు మండల సమైక్య బుధవారం కార్యాలయమును సందర్శించారు. అనంతరం వెలుగు సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సూపర్ నారి యాప్ ప్రవేశ పెట్టిందని అన్నారు. ఈ యాప్ వలన 'మన డబ్బులు- మన లెక్కలు అనేది ఈ యాప్ లో సులభరంగా తెలుసుకోవచ్చు అన్నారు. అలాగే సభ్యురాలు ఐడి నంబర్ యూజర్ ఐడి, పాస్వర్డ్ ఐడి చివరి నాలుగు అంకెలతో లాగిన్ అవ్వాలన్నారు.లాగిన్ ఐనా తర్వాత సభ్యురాలు వ్యక్తి గత పొదుపు ఎంత ఉంది అనేది, బ్యాంక్ అప్పు ఎంత ఉంది అనేది, స్త్రీ నిధి తదితర అప్పులు వివరాలు వాయిస్ రూపంలో తెలియజేస్తుందన్నారు. మహిళా సంఘ సబ్యులు అందరూ ఈ అవకాశం సద్వినియోగం కోరారు. ఇప్పటికే గుర్తించిన సబ్యులకు స్త్రీ నిధి, బ్యాంక్ , సిఐఎఫ్ పథకాలలో అప్పు మంజూరు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏ సి ఎల్ పి సర్వేలో అప్పు అడిగిన సభ్యురాలుకి అందరికీ అప్పు మంజూరు చెయ్యాలని, అప్పులు ఇచ్చిన తరువాతఅసిస్ట్, టాగింగ్ సిసి లాగిన్‌లో చేయాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒక మహిళలను వ్యాపారవేత్తగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని, ఆ దిశగా సిబ్బంది అందరూ పని చెయ్యాలని ఆదేశించారు. అనంతరం సిహెచ్సి ( కస్టమైహెరింగ్) సెంటర్ పరిశీలించారు. మండల రైతు సమాఖ్యకు వ్యవసాయ పరికరాలు వస్తుందని రైతులు వాటిని వినియోగించుకోవాలన్నారు. రైతు సంఘాలు బలోపేతం కావలని కోరారు. డిపిఎం లు రాజ్య లక్ష్మీ, శ్రీనివాసరావు , ఏటీఎం ఆర్ శ్రీరాములు, సీసీలు పాల్గొన్నారు.

## పాచిపెంట మండలంలో ఏకధాటిగా ఒడిగళ్ల వాన

### ఊపిరిపీల్చుకున్న మండల ప్రజానీకం



పాచిపెంట, జూన్ 10, ప్రభాతవార్త :

గత మూడు నెలలుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఊపిరాడక ప్రజలు ఒక్కరు బిక్కిరి అవుతున్న సమయంలో మృగశిర కార్తి ప్రారంభంలో బుధవారం మధ్యాహ్నం ఏకధాటిగా కురిసిన కుడిగళ్ల వర్షానికి మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం12 గంటల నుంచి రెండు గంటల వరకు కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. అదేవిధంగా ఈ వర్షం రైతులు ఎదురుచూస్తున్న వాణిజ్య పంటలకు మొక్కజొన్న పత్తి రైతులకు నాటేందుకు అనుకూలించడం వలన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎప్పుడ, ఏప్పుడా అని ఎదురుచూస్తున్న రైతాంగానికి ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా మండలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో పాటు మైదాన ప్రాంతాల్లో ఏకధాటిగా ఒడిగిల్లు వర్షం పోరి చేయడం వల్ల భూమి చల్లబడడంతో వేడి తగ్గింది. ఈ కురిసిన వర్షానికి వీధుల్లో ఏర్లే నీరు సాగింది.

## మహిళల ఆర్థిక సాధికారతకే 'పీ-4': ఎమ్మెల్యే కోళ్ల




శృంగవరపుకోట,జూన్10, ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా మహిళల ఆర్థిక సాధికారత, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా మండలంలోని భవానీ నగర్ లో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోళ్ల మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబాలు తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని ఆమె ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ-4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెలుతున్నారని ఆమె పేర్కొన్నారు.కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి స్వయం ఉపాధి మార్గాలను చూపి సొంతంగా రాణించేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.మార్గదర్శి ఎంవీఆర్ గ్రూప్ ఆఫ్ స్మాల్ స్కేల్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఈఉచిత శిక్షణ ఉపాధి కల్పన కార్యక్రమం నిర్వహించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.నియోజకవర్గంలోని మహిళలందరూ ఈసువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైస్ ఓసంఘాల ప్రతినిధులు,ఎంవీఆర్ గ్రూప్ నిర్వాహకులు,మండల పార్టీ అధ్యక్షుడు డోకుల అచ్చం నాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి ఇందుకూరు శ్రీనురాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఇరవై రూపాయల కోసం సొంత బావనే హత్య చేసిన బావమరిది

గరివిడి ,జూన్10 , ప్రభాత వార్త:

మండలంలోని శివరాం గ్రామంలో 20 రూపాయలు కోసం సొంత బావ నే బావ మరిది హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన పచ్చిపాల కనకరాజు ( 45) అనే వ్యక్తి ని అదే గ్రామానికి చెందిన, కనక రాజు బావమరిది మజ్జి శ్రీను అనే వ్యక్తి ఇరవై రూపాయల విషయమై తగాదా పడి కనక రాజు ని కర్ర తో తలపై బలంగా కొట్టి హత్య చేశారు. హత్యోదంతానికి సంబంధించి గరివిడి పోలీసులు కథనం ప్రకారం శివరాం కి చెందిన మృతుడు కనక రాజు,ఆయన బావ మరిది మజ్జి శ్రీను వలస కూలీలు. పద్మ నాభం మండలం ఇసుకపాలెం లో దినసరి కూలీలు గా పనిచేస్తూ ఉన్నారు. పనులు ముగించు కొని స్వగ్రామం శివరాం వచ్చిన ఇరువురు కూలి డబ్బులు కోసం తగాదా పడ్డారు. కూలి డబ్బులు ని తన బావమరిది మజ్జి శ్రీనుకు 110 రూపాయలు మృతుడు కనక రాజు చెల్లించారు.అయితే 130 కూలి చెల్లించాలి 110 చెల్లించడమేమిటని శ్రీను ప్రశ్నించారు. యజమాని ఒక కుండీ పని చేసేందుకు 110 రూపాయలు మాత్రమే చెల్లించారని,.కూలి 130 చెల్లించ లేదని మృతుడు పేర్కొన్నప్పటికీ నాకు ఇరవై రూపాయలు ఇవ్వలేదని శ్రీను అగ్రహోద్రగ్యుడై బలంగా కనక రాజు తలపై కర్రతో కొట్టారు.దీంతో కనకరాజు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ కనక రాజుని విశాఖపట్నం కె జి హెచ్ కి తరలించారు. చికిత్స పొందుతూ కనక రాజు మంగళవారం రాత్రి మృతి చెందారు. మృతుడు భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గరివిడి ఎస్ ఐ బి.లోకేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గరివిడిలో ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



గరివిడి, జూన్ 10, ప్రభాత వార్త:

గరివిడిలో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు టిడిపి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కేకు కట్ చేసి మిఠాయిలను పంచుకున్నారు. బాలకృష్ణ కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పైల బలరాం, టిడిపి నాయకులు ఎస్.సురేష్, మహంతి రమణ మూర్తి, శీరపు శ్రీను, గొట్టిముక్కల సత్తిరాజు,పాకలపాటి వర్మ రాజు, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## వరి విత్తనాలు సిద్ధం



రామభద్రపురం, జూన్ 10, ప్రభాతవార్త:

ఖరీఫ్ సీజన్కు ముందే ఎరువులు నిల్వలుమండలంలో ఈ ఖరీఫ్ సీజన్కు వరి విత్తనాలు సిద్ధం చేశామని మండల వ్యవసాయాధికారి అమరా శివ తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేశామని, దీనికి అనుగుణంగా వరి విత్తనాలు, ఎరువులు రైత ఎలకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. 1121 రకం వరి విత్తనాలు 7296 క్వింటాళ్లు, 3291 రకం 19 క్వింటాళ్లు, సోనామసూరి 43 క్వింటాళ్లు, ఆర్జిఎల్ 44 క్వింటాళ్లును రైతు సేవా కేంద్రంలో నిల్వ ఉంచామని తెలిపారు. అలాగే మండలంలో ఉన్న 7 రైతు సేవాకేంద్రాల్లో సుమారు వంద టన్నులు ఎరువులు కూడా సిద్ధం చేశామని తెలిపారు. అలాగే ఇప్పటివరకు 70 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు, రాయితీపై అందించామని తెలిపారు. అలాగే ఈ ఏడాది సుమారు 10 వేల మంది రైతులకు ఎరువుల కార్డులు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. దీనివలన భవిష్యత్తులో రైతులకు ఎరువులు ఇబ్బంది లేకుండా చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇప్పటి నుంచి రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సేంద్రీయ ఎరువుల వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నామన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వలన కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో రసాయనిక ఎరువుల వాడకం అధికం వలన రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా భూసారం దెబ్బతింటుందని, నాణ్యతలేని దిగుబడులు వస్తాయని తెలిపారు. దీనిపై రైతులు ఆలోచించి రసాయనిక ఎరువుల వాడకం గణనీయంగా తగ్గించి నానో యూరియా, నానో ఎరువుల వాడకంపై రైతులు దృ ష్టిసారించాలని తెలిపారు. అలాగే ఈ ఏడాది వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు రాయితీపై వివిధ వ్యవసాయ పనిముట్లు కూడా అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. యంత్రాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఎల్.కోట మోడల్ స్కూల్‌లో మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు

లక్క వరపు కోట, జూన్ 10, ప్రభాత వార్త :

ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ లక్క వరపు కోట లో మిగిలి ఉన్న 6వ తరగతి, 7వ తరగతి, 8వ తరగతి, 9వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్ల ఎల్ కోట మోడల్ స్కూల్ ఒకాలేజీ ప్రిన్సిపాల్ ప్రకాష్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ జూన్ 10నుండి 20 వ తేదీ వరకు జరుగుతుంది అని . 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం జూన్ 24 న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది అని . ఎంపికైన అభ్యర్థుల జాబితా 25 వ తేది న ప్రకటించబడుతుంది.అని ప్రిన్సిపాల్ తెలిపారు సర్టిఫికేట్ పరిశీలన మరియు ప్రవేశాలు 26 న నిర్వహించబడతాయన్నారు.విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి అని . మిగిలిన ఖాళీలను స్థానిక, స్థానికేతర అభ్యర్థుల నుండి నిబంధనల ప్రకారం భర్తీ చేయడము జరుగుతుంది అని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తల్లిదండ్రులు విద్యార్థులకు తెలిపారు.

## వెంకన్న దేవస్థానం అభివృద్ధికి అందరి సహకారం అవసరం



విజయనగరం, జూన్ 10, ప్రభాతవార్త:

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి సేవా ట్రస్ట్ 4వ సర్వసభ్య సమావేశం బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌరవ శ్రీమతి తోయక జగదీశ్వరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజంలో సాంస్కృతిక, ధార్మిక విలువల పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ట్రస్ట్ సభ్యులు, భక్తులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున సాధ్యమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గారు హామీ ఇచ్చారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యే గారికి వివరించారు. సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## సాయిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించిన కిమిడి



గరివిడి, జూన్ 10 ,ప్రభాత వార్త :

మండలంలోని బొండపల్లి గ్రామం లో ఇటీవల విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన విద్యుత్ ఉద్యోగి లోచర్ల సాయిబాబు కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు పరామర్శించారు. మృతుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయి బాబు మృతి చెందడం విచారకరమన్నారు. ఆయన కుటుంబానికి ఓదార్చారు. ఈయన వెంట మండల టిడిపి నాయకులు పైల బలరాం,సురేష్,రమేష్,శంబాన సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : కర్రోతు



నెల్లిమర్ల, జూన్ 10, ప్రభాతవార్త

నెల్లిమర్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల్లిమర్ల మండలం, టౌన్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇంచార్జి శ్రీ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బంగార్రాజు ముందుగా ఇటీవల మరణించిన టీడీపీ సీనియర్ నాయకుడు సారిపల్లి బాబూరావుకు సంతాప సూచికంగా మౌనం పాటించారు అనంతరం మాట్లాడుతూ – పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అలాగే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) – 2026 కార్యక్రమంపై నాయకులతో విస్తృతంగా చర్చించి పలు కీలక సూచనలు చేశారు. ప్రజలకు మరింత చేరువై పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ప్రముఖ సినీనటుడు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు మరియు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.తదుపరి అన్న క్యాంటీన్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పేదలకు స్వయంగా భోజనం వడ్డించారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని ప్రతి వర్గానికి అండగా నిలవాలనే బాలకృష్ణ స్ఫూర్తిని కొనియాడుతూ, ఆయనకు ఆయురారోగ్యాలు, మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు ,టౌన్ పార్టీ అధ్యక్షుడు లెంక అప్పలనాయుడు ,ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యన్నారాయణ ,బోర్డు డైరెక్టర్ కింతాడ కళావతి ,క్లస్టర్, యూనిట్ కన్వీనర్ లు,కో కన్వీనర్ లు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

11-6pg10.qxd:11-6pg10.qxd 1/1/02 6:00 AM Page 1



# అఫ్ఘాన్‌తో వన్డే సమరానికి రెడీ



## టీమిండియాలో ఆరుగురు ఔట్

## జట్టులోకి కీలక ప్లేయర్లు ఎంట్రీ

**న్యూఢిల్లీ:** అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిన టీమిండియా, ఇప్పుడు మూడు మ్యాచ్‌ల వన్డే సమరానికి సిద్ధమవుతోంది. అఫ్గానిస్తాన్‌తో జరగబోయే ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ టీమిండియాకు అత్యంత కీలకంగా మారనుంది. ఈ నెల 13న ధర్మశాలలో మొదటి వన్డే, 17న లక్నోలో రెండో వన్డే, 20న చెన్నైలో చివరి వన్డే మ్యాచ్ జరగనున్నాయి టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే భారత సెలెక్టర్లు వన్డే జట్టులో భారీ మార్పులు చేశారు. టెస్టు జట్టులో ఉన్న ఆరుగురు ఆటగాళ్లను పక్కన పెట్టి, పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో నిరూపించుకున్న ఆరుగురు కీలక ఆటగాళ్లను జట్టులోకి తీసుకొచ్చారు. రెండు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను ఎంపిక చేసిన సెలెక్టర్లు, టెస్టులో ఆడిన కొందరు ఆటగాళ్లను వన్డే సిరీస్ నుంచి తప్పించారు. ముల్లాంపూర్ టెస్టులో భాగమైన సాయి సుదర్శన్, రిషబ్ పంత్, దేవదత్ పడిక్కల్, మహ్మద్ సిరాజ్, మానవ్ సుతార్, ధ్రువ్ జురెల్ వన్డే జట్టులో చోటు కోల్పోయారు.

వాస్తవానికి యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కూడా ఈ జాబితాలో ఉండాల్సింది, కానీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మోకాలి వెనుక భాగంలో నరాల నొప్పితో వన్డే సిరీస్ మొత్తానికి దూరం కావడంతో జైస్వాల్‌కు అదృష్టం వరించింది. కోహ్లీ స్థానంలో జైస్వాల్‌ను వన్డే జట్టులోకి కొనసాగించారు. ఇక టెస్ట్ జట్టు నుంచి ఔట్ అయిన వారి స్థానంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తిరుగులేని రికార్డు ఉన్న ఆరుగురు ఆటగాళ్లు జట్టులోకి వచ్చారు. టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ తిరిగి వన్డే జట్టులోకి వచ్చాడు. అలాగే టెస్టు ఫార్మాట్ నుంచి విరామం తీసుకున్న వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టుతో చేరాడు. ట్వంటీ20 సిరీస్ తర్వాత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్, చాలా కాలం తర్వాత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వన్డే జట్టులోకి పునరాగమనం చేశారు. వీరితో పాటు ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ వన్డే సిరీస్‌లో తమ సత్తా చాటనున్నారు.

అఫ్గానిస్తాన్ వన్డే సిరీస్ కోసం భారత పూర్తి జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే ఉన్నారు.





### ఆస్ట్రేలియన్ ఓపెన్ ..

## రెండో రౌండ్‌కు సింధు, తన్వి

### ముగిసిన పురుషుల సింగిల్స్ పోరు

**న్యూఢిల్లీ:** సిడ్నీలో జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ షట్లర్లు పి.వి. సింధు, తన్వి శర్మ ముందంజతో రెండో రౌండ్‌కు చేరుకున్నారు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు, పెరూకు చెందిన ఇనెస్ కాస్టిల్లోపై వరుస గేమ్‌లలో సునాయాస విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 10వ స్థానంలో ఉన్న ఈ మాజీ ప్రపంచ ఛాంపియన్, మ్యాచ్ ఆద్యంతం తన నియంత్రణలో ఉంచుకుని, 21-13, 21-11 తేడాతో విజయం సాధించింది. టీనేజర్ తన్వి శర్మ కూడా అద్భుతమైన ప్రదర్శనతో రెండో రౌండ్‌కు చేరుకుంది. ప్రస్తుత బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ రజత పతక విజేత అయిన ఆమె, ప్రారంభ రౌండ్‌లోని అత్యంత ఆసక్తికరమైన ఫలితాల్లో ఒకటిగా, చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ నంబర్ 11 చియు పిన్‌చియాన్‌ను 21-12, 22-20 తేడాతో ఓడించింది. సింధు ఇషారాణితో, తన్వి మాల్వికతో తలపడనుండగా, మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ నుండి కనీసం ఇద్దరు ప్రతినిధులు ఖాయమయ్యారు. అయితే, పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, సనీత్ దయానంద్, తరుణ్ మన్నేపల్లి అందరూ తొలి రౌండ్‌లోనే ఓటమి పాలవ్వడంతో, ఈ విభాగంలో భారతదేశపు పోరాటం ముగిసింది. అయితే పురుషుల డబుల్స్‌లో మాత్రం ఎంఆర్ అర్జున్-హరిహరన్ అమ్సకరుణన్ తొలి రౌండ్‌లో ఘన విజయం సాధించారు.

### అంటాల్యా ప్రపంచ కప్‌లో.. తొలి రౌండ్‌లోనే

## భారత్ ఆర్చర్లు నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ మూడవ దశలో, వ్యక్తిగత ఈవెంట్ల రౌండ్ ఆఫ్ 64లో వర్ధమాన తార సాహిల్ జాదవ్‌తో సహా నలుగురు ఆర్చర్లు నిష్క్రమించడంతో, భారత కాంపౌండ్ ఆర్చరీ ప్రచారం ఆరంభంలోనేముగిసింది. అంటాల్యాలో జరుగుతున్న ఈ పోటీల్లో అద్భుతమైన క్వాలిఫి కేషన్ రౌండ్ తర్వాత నాకౌట్ దశలోకి ప్రవేశించిన సాహిల్, మెక్సికోకు చెందిన జువాన్ గుటియెరెజ్‌తో హోరాహోరీగా జరిగిన పోరులో 145-147 తేడాతో ఓడిపోయాడు. అలాగే రిషబ్ యాదవ్, చికిత్సా తానిపర్తి, పృథికా ప్రదీప్ కూడా తొలి నాకౌట్ రౌండ్‌లోనే నిష్క్రమించడంతో వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్లలో భారతదేశానికి పరిమిత ప్రాతినిధ్యం లభించింది. పురుషుల కాంపౌండ్ విభాగంలో సాహిల్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిలో ఒకడిగా నిలవగా, అనుభవజ్ఞురాలైన వెన్నం జ్యోతి సురేఖ భారత మహిళల విభాగానికి నాయకత్వం వహించింది. వ్యక్తిగత ఫలితాలు నిరాశపరిచినప్పటికీ, టీమ్ పోటీలలో భారత్ గట్టి పోటీలో ఉంది. సాహిల్ జాదవ్, గణేష్ మణి రత్నం తిరుమూరు, కుశాల్ దలాల్‌లతో కూడిన పురుషుల కాంపౌండ్ జట్టు క్వాలిఫికేషన్‌లో అనుకూలమైన స్థానాన్ని సంపాదించి, నాకౌట్ రౌండ్లలో ముందుకు సాగాలని చూస్తోంది. జ్యోతి సురేఖ వెన్నం, చికిత్సా తానిపర్తి, పృథికా ప్రదీప్‌లతో కూడిన మహిళల కాంపౌండ్ జట్టు కూడా సునాయాసంగా ముందంజ వేసి, పతక పోటీదారులలో నిలిచింది.

## చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్

### 21 యేళ్ల తర్వాత ఆస్ట్రేలియాపై విజయం



**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. 21 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియాపై వన్డే మ్యాచ్‌లో విజయాన్ని కైవసం చేసుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఢాకా వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ద్వారా 86 పరుగుల తేడాతో ఆస్ట్రేలి యాను ఓడించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసాడెక్ హుస్సేన్ అద్భుతమైన ప్రదర్శనతో విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో అజేయ హాఫ్ సెంచరీతో రాణించిన మొసాడెక్(86 నాటౌట్), బౌలింగ్‌లో (2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 284 పరుగులు చేసింది. తంజిద్ హాసన్(44 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 54), నజ్ముల్ హుస్సేన్ షాంటో(86 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 67), మోసాడెక్ హోస్సేన్(70 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 86నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ 3 వికెట్లు, లియామ్ స్కాట్, మ్యాట్ రేన్‌షా రెండేసి వికెట్లు, గ్జేవియర్ బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం ఆస్ట్రేలియా వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి 42.2 ఓవర్లలో 9 వికెట్లకు 191 పరుగులే చేసింది. ఆ తర్వాత వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు డక్‌వర్త్ లూయిస్ ప్రకారం మ్యాచ్ ఫలితాన్ని తేల్చారు. అలెక్స్ క్యారీ(47), కామెరూన్ గ్రీన్(52 నాటౌట్), కూపర్ కనోల్లీ(35) మినహా అంతా విఫలమయ్యారు.





## టెస్ట్ ర్యాంకింగ్స్‌లో.. వరల్డ్ నంబర్ 1గా బ్రూక్

**న్యూఢిల్లీ:** ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ తన సహచరుడు జో రూట్‌ను అధిగమించి నెం.1 స్థానాన్ని తిరిగిదక్కించుకోగా, అఫ్ఘనిస్తాన్‌తో ఇటీవల జరిగిన ఏకైక మ్యాచ్‌లో సెంచరీ సాధించిన భారత కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ రెండు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికిచేరుకున్నాడు. ఆ మ్యాచ్‌లో భారతజట్టు ఇన్నింగ్స్ మరియు 300 పరుగుల తేడాతో విజయం సాధించింది. లార్డ్స్‌లో జరిగిన ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గేమ్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 115 పరుగుల తేడాతో విజయం సాధించగా, ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ చేసిన తర్వాత బ్రూక్ తిరిగి నంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. ఎనిమిది పరుగులు మాత్రమేచేయడంతో రూట్ మూడో స్థానానికి పడిపోగా, ఆస్ట్రేలియాకు చెందిన ట్రావిస్ హెడ్ రెండో స్థానానికి ఎగబాకాడు. ఇక న్యూ చండీగఢ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 126 పరుగులు చేసిన గిల్ ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ త్రయం బెన్ డకెట్ (మూడు స్థానాలు ఎగబాకి 15వ స్థానానికి), జేమీ స్మిత్ (ఐదు స్థానాలు ఎగబాకి 23వ స్థానాన్ని సమంగా చేర్చాడు) మరియు గ్లెన్ ఫిలిప్స్ (40వ స్థానానికి)కూడా బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించారు. బౌలింగ్‌లో ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ ఏడు స్థానాలు ఎగబాకి టాప్ 10 టెస్ట్ బౌలర్లలో పదవ స్థానంలోకి ప్రవేశించగా, ఆల్ రౌండర్లలో ఆరవ స్థానానికి చేరుకున్నాడు.

### ఎనిమిదో స్థానంలో భారత్ కెప్టెన్ గిల్



## స్పేస్‌ఎక్స్ ఐపిఒకు భారీ స్పందన..

### 75 బిలియన్ డాలర్ల ఆఫర్‌కు 250 బిలియన్ డాలర్ల డిమాండ్

**న్యూయార్క్,జూన్ 10:** అమెరికా అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ ఐపిఒకు పెట్టుబడిదారుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కంపెనీ సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న 75 బిలియన్ డాలర్లకు వ్యతిరేకంగా 250 బిలియన్ డాలర్లకు పైగా బిడ్ల డిమాండ్ నమోదైనటు బుధవారం వెల్లడించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓగా భావిస్తున్న ఈ ఇష్యూ ప్రస్తుతం నాలుగు రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ముఖ్యంగా సౌదీ అరేబియా, కువైట్‌కు చెందిన సంపద నిధులు ఒక్కొక్కటి 1 బిలియన్ డాలర్ల నుంచి 5 బిలియన్ డాలర్ల వరకు ఆర్డర్లు ఇచ్చినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. స్పేస్‌ఎక్స్ ప్రస్తుతం తన మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. కంపెనీ అధ్యక్షురాలు గ్విన్ షాట్‌వెల్ మరియు ఆర్థిక విభాగాధిపతి బ్రెట్‌జాన్సన్‌లు న్యూయార్క్ నగరంలోని మోర్గాన్ స్టాన్లీ కార్యాలయంలో సుమారు 300 మంది సంస్థాగత పెట్టుబడిదారులతో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి డాన్ సిమ్‌కోవిట్జ్ ఆతిథ్యం ఇచ్చారు. ప్రస్తుతం వెల్లడవుతున్న సబ్‌స్క్రిప్షన్ గణాంకాలు తుది కేటాయింపులను సూచించవని, ఇవి పెట్టుబడిదారుల ఆసక్తిని మాత్రమే ప్రతిబింబిస్తాయని నిపుణులు చెబుతున్నారు. షేర్ ధర నిర్ణయించిన తర్వాతే తుది కేటాయింపులు ఖరారు కానున్నాయి. రోడ్‌షో ప్రదర్శనలు, ఐపీఓ పత్రాల్లో స్పేస్‌ఎక్స్ తన ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవ స్టార్‌లింక్ పటిష్టమైన వృద్ధిని ప్రస్తావించింది. రాకెట్ ప్రయోగాల వ్యాపారంలో తన ప్రత్యేకతను కూడా హైలైట్ చేసింది. గత మూడు సంవత్సరాల్లో భూమి కక్ష్యలోకి పంపిన మొత్తం భారంస్పేస్‌ఎక్స్‌లో అత్యధిక భాగం తమ రాకెట్ల ద్వారానే వెళ్లిందని కంపెనీ పేర్కొంది. ఇక కృత్రిమ మేధస్సు సామర్థ్యాలను ఆధారంగా చేసుకుని సుమారు 23 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ అవకాశాలు ఉన్నాయని స్పేస్‌ఎక్స్ పెట్టుబడిదారులకు ఈ నేపథ్యంలో స్పేస్‌ఎక్స్ ఐపీఓకు లభిస్తున్న విశేష స్పందన ప్రపంచ పెట్టుబడి మార్కెట్ల దృష్టిని ఆకర్షిస్తోంది. కంపెనీ తుది ధర నిర్ణయం, షేర్ల కేటాయింపు ప్రక్రియపై ఇప్పుడు మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# సెన్సెక్స్, నిఫ్టీల్లో మిశ్రమ ట్రేడింగ్..

### లాభనష్టాలతో రెండో రోజు ఊగిసలాట..!




**ముంబై, జూన్ 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం రోజంతా ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రారంభంలో నమోదైన భారీ లాభాలు చివరి గంటలో కరిగిపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు లాభాలస్వీకరణకే మొగ్గుచూపించారు. అంతర్జాతీయ ధోరణులు క్షీణత, పశ్చిమాసియాలో మళ్లీ పెరిగిన భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డిమాండ్ మందగింపు ఆందోళనల నేపథ్యంలో మెటల్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు కొంత మద్దతు ఇవ్వగా, మెటల్, రియాల్టీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 64.42 పాయింట్లు పెరిగి 73,983.18 వద్ద ముగిసింది. నిఫ్టీ50 మాత్రం 27.15 పాయింట్లు క్షీణించి 23,214.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో భారతి ఎయిర్‌టెల్ 1.32 శాతం, ఇన్ఫోసిస్ 0.87 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.82 శాతం నష్టాలతో ఒత్తిడిని పెంచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.36 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.13 శాతం పడిపోయాయి. బీఎస్ఈలో 1,472 షేర్లు లాభపడగా, 2,748 షేర్లు నష్టపోయాయి. 161 షేర్లలో మార్పు లేదు. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.89 శాతానికి చేరుకుంది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ 95.28 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధర 2.19 శాతం క్షీణించి రూ.1,49,110కు పడిపోయింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 4.53 శాతానికి పెరిగింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 13 సెంట్లు పెరిగి 91.58 డాలర్లకు చేరుకుంది. యూరోపియన్ మార్కెట్లు నష్టాల్లోకి జారాయి. ఆసియా మార్కెట్లు కూడా అధికంగా నష్టాలతో ముగిశాయి. వాల్ స్ట్రీట్‌లో ఎస్అండ్‌పీ 500 సూచీ 0.26 శాతం, నాస్‌డాక్ 0.97 శాతం క్షీణించగా, డౌజోన్స్ మాత్రం 0.17 శాతం లాభపడింది. ఏజిస్ లాజిస్టిక్స్ షేరు 2.34 శాతం పెరిగింది. ఎలైట్‌కాన్ ఇంటర్నేషనల్ 19.18 శాతం ఎగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.82 శాతం పడిపోయింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మెటాతో కలిసి 168 మెగావాట్ల ఏఐ ఆధారిత డేటా సెంటర్ నిర్మించనున్నట్లు ప్రకటించింది. న్యూక్లియస్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ 14.56 శాతం జంప్ చేసింది. కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజరేషన్ 1.92 శాతం లాభపడింది. రూ.235.26 కోట్ల పెట్టుబడికి బోర్డు ఆమోదం తెలిపింది. డిక్సన్ టెక్నాలజీస్ 1.07 శాతం క్షీణించింది. జెమ్‌టెక్ టెక్నాలజీతో జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ 8.37 శాతం పెరిగింది. కాన్‌కార్డ్ బయోటెక్ 4.60 శాతం లాభపడింది. టోఫాసిటినిబ్ టాబ్లెట్లకు అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం లభించింది. ఆఫ్‌కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 4.61 శాతం ఎగసింది. జేటీఎల్ ఇండస్ట్రీస్ 4.62 శాతం పడిపోయింది. మార్సన్స్ 2.64 శాతం, వెరాండా లెర్నింగ్ 2.03 శాతం తగ్గింది. సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ షేర్లు బీఎస్ఈలో రూ.192 ఇష్యూ ధరతో పోలిస్తే 43.44 శాతం ప్రీమియంతో రూ.275.40 వద్ద లిస్టయ్యాయి. అనంతరం కొంత లాభాల స్వీకరణతో రూ.247.90 వద్ద ముగిశాయి. ఇది ఇష్యూ ధరపై 29.11 శాతం ప్రీమియాన్ని సూచిస్తోంది. బీఎస్ఈలో కంపెనీకి చెందిన 38.23 లక్షలకుపైగా షేర్లు ట్రేడయ్యాయి.

## ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలు

### సెబీ రిజిస్టరు అయిన రీట్‌లకే బ్యాంకుల రుణాలు

### 80శాతం నగదురాబడుల అంచనాలకు అనుగుణంగానే పరపతి

### రిజర్వుబ్యాంకు కొత్త మార్గదర్శకాలు..

**ముంబై, జూన్ 10:** రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు రీట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు ఇన్విట్‌లకు బ్యాంకులు రుణాలు అందించే విధానంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ బుధవారం తుది మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ద్వారా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ పెట్టుబడి సాధనాల ఫైనాన్సింగ్‌కు స్పష్టమైన చట్రాన్ని రూపొందించింది. సవరించిన నిబంధనల ప్రకారం, భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ)లో నమోదై, గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ పొందిన రీట్‌లకు మాత్రమే బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. అలాగే ఇన్విట్‌లపై తమ రుణ ఎక్స్‌పోజర్‌కు సంబంధించి బ్యాంకులు బోర్డు ఆమోదించిన విధానాలను రూపొందించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ విధానాల్లో రుణ అర్హత పరిశీలన, రుణ మంజూరు ప్రక్రియలు, అండర్‌రైటింగ్ ప్రమాణాలు, రిస్క్ మేనేజ్‌మెంట్, పర్యవేక్షణ వ్యవస్థలు వంటి కీలక అంశాలు తప్పనిసరిగా ఉండాలి. ఆదాయాన్ని అందించే రియల్ ఎస్టేట్ ఆస్తులను నగదీకరించేందుకు రీట్స్ కీలక వేదికలుగా ఎదుగుతున్న నేపథ్యంలో, సమర్థవంతమైన రుణ విధానాలను ప్రోత్సహిస్తూ వాటి నిధుల అవసరాలకు మద్దతు అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని ఆర్‌బీఐ పేర్కొంది. కొత్త నిబంధనల ప్రకారం, రీట్‌లు తీసుకునే రుణాలు సంబంధిత నియంత్రణ నిబంధనల్లో పేర్కొన్న అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా బ్యాంకులు నిర్ధారించాలి. రుణంగా పొందిన నిధులు అనుమతించిన అవసరాలకే వినియోగిస్తున్నాయో లేదో బ్యాంకులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ నిర్దేశించిన ప్రకారం, లిస్టెడ్‌రీట్స్‌ల ఆస్తులలో కనీసం 80 శాతం పూర్తయి, ఆదాయం సమకూర్చే మరియు సానుకూల నగదు ప్రవాహాన్ని కలిగించే ఆస్తులు ఉండాలి. అలాంటి రీట్‌లకు మాత్రమే బ్యాంకులు రుణాలు ఇవ్వగలవు. ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు ఆర్‌బీఐ రుణ పరిమితిని కూడా విధించింది. ఒక రీట్‌కు బ్యాంకు ఇచ్చే మొత్తం రుణ ఎక్స్‌పోజర్, ఆ రీట్‌ఆస్తుల విలువలో 49 శాతాన్ని మించకూడదు. రిస్క్ నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేస్తూ, రీట్, ఇన్విట్‌లకు మంజూరు చేసే అన్ని రుణాలు పూర్తిస్థాయి సెక్యూరిటీతో ఉండాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ తుది మార్గదర్శకాలు బ్యాంకులు, పెట్టుబడిదారులకు మరింత స్పష్టతను అందించడంతో పాటు ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతూ రుణాల లభ్యతను సమతుల్యం చేయడంలో సహాయపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్థిరమైన రాబడులు సృష్టించే రియల్ ఎస్టేట్ ఆస్తులను నిర్వహించే రీట్స్‌ల వ్యాపార నమూనాకు అనుగుణంగా బ్యాంకుల రుణ విధానాలను ఈ కొత్త చట్రం సమన్వయం చేస్తుంది.

## ఎరువుల సబ్సిడీ రెట్టింపుచేయాలని ఆర్థికశాఖకు ప్రతిపాదనలు



**న్యూఢిల్లీ, జూన్ 10:** పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎరువుల సబ్సిడీ కేటాయింపును రెట్టింపు చేయాలని కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీ కోసం రూ.1.77 లక్షల కోట్లు కేటాయించారు. అయితే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు వేగంగా పెరగడం, సరఫరా పరిస్థితులు కఠినంగా మారడంతో ఈ కేటాయింపును 100 శాతం పెంచాలని ఎరువుల శాఖ ప్రతిపాదించింది. ఎరువుల ధరలు పెరుగుతున్న వేగాన్ని దృష్టిలో ఉంచుకుని సబ్సిడీ కేటాయింపును రెట్టింపు చేయాలని ఎరువుల శాఖ కోరింది. ఒకవైపు సరఫరా పరిమితంగా ఉండగా, మరోవైపు డిమాండ్ బలంగా కొనసాగుతోందని ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, యూరియాపై సబ్సిడీ భారం గణనీయంగా పెరిగింది. ఒక్కో యూరియా సంచిపై ప్రభుత్వం అందించే సబ్సిడీ సుమారు రూ.2,900 నుంచి దాదాపు రూ.4,500కు పెరిగింది. దీంతో ప్రభుత్వ ఆర్థిక వనరులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది. ఎరువుల కోసం రైతులపై ఒక్క రూపాయి అదనపు భారం కూడా మోపలేం. అంతర్జాతీయ ధరలపై మనకు పెద్దగా నియంత్రణ లేదు. ఈ పరిస్థితి ప్రభుత్వ ఖజానాపై గణనీయమైన ఒత్తిడిని సృష్టిస్తోందని ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. అదే సమయంలో దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు కొనసాగుతుండటం వల్ల కొంత మేర ఒత్తిడి తగ్గే అవకాశం ఉందన్నా. భారత్ తన ఎరువుల అవసరాల్లో సుమారు 25 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. దేశీయ ఎరువుల ఉత్పత్తి 2024లో 50.95 మిలియన్ టన్నుల నుంచి 2025లో 52.5 మిలియన్ టన్నులకు పెరిగినప్పటికీ, అంతర్జాతీయ ధరల పెరుగుదల ప్రభావాన్ని పూర్తిగా ఎదుర్కోవడానికి ఇది సరిపోకపోవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. సబ్సిడీ భారం పెరుగుతున్నప్పటికీ, రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అదనపు నిధుల కోసం అనుబంధ డిమాండ్ ద్వారా నిధులు కోరే ప్రతిపాదన ప్రస్తుతం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రపంచ ఎరువుల మార్కెట్ మరింత సంక్లిష్టంగా మారుతోంది. పలువురు సరఫరాదారులు మార్కెట్‌కు దూరంగా ఉండటంతో అందుబాటులో ఉన్న వనరులు తగ్గుతున్నాయి. గత రెండేళ్లుగా మార్కెట్‌లో పెద్దగా కనిపించని చైనా మళ్లీ సరఫరాలు ప్రారంభించినప్పటికీ, సరఫరా వైపు అనిశ్చితులు ఇంకా కొనసాగుతున్నాయని ప్రభుత్వం చెపుతోంది. ఇక ఎరువుల ధరలతో పాటు వాతావరణ పరిస్థితుల ప్రభావంపై కూడా విధాన నిర్ణేతలు నిశితంగా గమనిస్తున్నారు. ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయం, దేశ ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని జూలై తర్వాత సమీక్షించనున్నట్లు వర్గాలు తెలిపాయి. రుతుపవనాల పనితీరు, పంటల దిగుబడిపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం పెరిగింది.




## ఈసీఎల్జీఎస్ పథకం కింద రూ.48,484 కోట్ల రుణగ్యారంటీలు

**న్యూఢిల్లీ,జూన్ 10:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యవసర క్రెడిట్ లైన్‌హామీ పథకం ఇసిఎల్‌జిఎస్ అమలులో ఇప్పటివరకూ 1,06,549 గ్యారంటీలను జారీచేసినట్లు కేంద్రం ప్రకటించింది. ఈ పథకం కింద మొత్తం రూ.48,484 కోట్ల విలువైన గ్యారంటీలు మంజూరయ్యాయని 96శాతం ఎంఎస్ఎంఇలకు అందచేసినట్లు కేంద్రం ప్రకటించింది. మొత్తం గ్యారంటీ విలువల్లో ఎంఎస్ఎంఇ రంగం వాటా 86శాతంగా ఉంది. ఈ పథకం అమలులో ప్రభుత్వరంగ బ్యాంకులు కీలకపాత్రపోషిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎంఎస్ఎంఇకిందకురాణి దరఖాస్తులకు మంజూరైన రుణాలపై 90శాతం గ్యారంటీ కవరేజి ఇస్తున్నట్లు కేంద్రంపారిశ్రామిక శాఖ వివరించింది. అర్హులైన రుణ లబ్దిదారులకు రూ.2.55 లక్షలకోట్లవరకూ మొత్తం రుణాలు అందించాలనే ఈ అత్యవసర క్రెడిట్‌లైన్ గ్యారంటీ స్కీం ప్రధాన లక్ష్యంగా కేంద్రం వివరించింది.



## మూడో విడత పీఎల్ఐ స్కీంకు 96 పరిశ్రమల ఎంపిక రూ.12,822.67 కోట్ల పెట్టుబడుల రాక అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశీయ వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకపథకం మూడో విడతలో మొత్తం 96 కంపెనీలను ఎంపిక చేసినట్లు కేంద్రం బుధవారం వెల్లడించింది. ఈ కంపెనీలు కలిపి రూ. 12,822.67 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపింది. టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ప్రకారం, పీఎల్ఐ టెక్స్‌టైల్స్ పథకం మూడో రౌండ్ కింద తాజాగా నిర్వహించిన సమావేశంలో 22 కొత్త దరఖాస్తుదారులకు ఆమోదం లభించింది. ఈ 22కొత్తగా ఎంపికైన సంస్థలు రూ. 2,339.14 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా నోటిఫై చేసిన ఉత్పత్తుల విభాగంలో రూ.15,561.34 కోట్ల టర్నోవర్ సాధించడంతో పాటు వస్త్ర పరిశ్రమ అంతటా 36,217 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అంచనా వేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.